అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 23-12-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 302 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



కేంద్రానికి అసాధారణ అధికారాలు

ఆ మూడు బిల్లుల లక్ష్యం అదే

- వార్తలను సెన్సార్ చేయొచ్చు
- ఇంటర్నెట్ సేవలు నిలిపేయవచ్చు
- గోప్యత హక్కుకు భంగం కలిగించవచ్చు

న్యూఢిల్లీ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన మూడు బిల్లులు సర్కారుకు అసాధారణ అధికారాలు కట్టబెడుతున్నాయి. ఈ బిల్లుల ద్వారా ఇకపై కేంద్రం తన ఇష్టానుసారం వార్తలను సెన్సార్ చేయవచ్చు. ఇంటర్నెట్ సేవలను సులభంగా నిలిపివేయవచ్చు. సమాచార మార్పిడిని అడ్డుకోవచ్చు. వాట్సప్ వంటి సామాజిక మాధ్యమాలలో వ్యక్తుల మధ్య నడిచే సంభాషణలను తెలుసుకోవచ్చు. తద్వారా సమాచార గోప్యతకు సంబంధించిన హక్కుకు భంగం కలిగించవచ్చు.

డిజిపబ్ సంస్థ ఈ నెల 20న నిర్వహించిన సమావేశంలో పలువురు నిపుణులు ఈ మేరకు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 60కి పైగా డిజిటల్ న్యూస్ మీడియా సంస్థలు, స్వతంత్ర పాత్రికేయులు, వ్యాఖ్యాతలకు డిజిపబ్ ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇంతకీ కేంద్రం తీసుకొచ్చిన మూడు బిల్లులు ఏమిటంటే...టెలికమ్యూనికేషన్ బిల్లు, బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసుల (నియంత్రణ) ముసాయిదా బిల్లు, డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టం.

దేనినైనా సెన్సార్ చేయొచ్చు

ప్రభుత్వం దృష్టిలో అస్పష్టంగా ఉన్న వార్తలు సహా ఆన్‌లైన్ సమాచారాన్ని నియంత్రించే అధికారం బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు ద్వారా సర్కారుకు లభిస్తుందని 'ది క్వింయంట్' పోర్టల్ సీఈఓ రితూ కపూర్ తెలిపారు. అయితే శిక్ష, విచారణ, దర్యాప్తు, సెన్సార్‌షిప్ వంటి చర్యలకు ఎలాంటి వార్తలు దారితీస్తాయో స్పష్టంగా తెలియడం లేదని ఆమె చెప్పారు. సీఈఓలు స్వీయ ధృవీకరణ చేసిన వార్తలను మాత్రమే ప్రసారం చేయాలని అనడం పత్రికలకు ఆచరణ సాధ్యం కాదని అన్నారు. వార్తా పత్రికలకు వర్తించే అంక్షలే సామాజిక మాధ్యమాలలో వ్యాఖ్యలు చేసే వారికి కూడా వర్తిస్తాయని డిజిటల్ వార్తా కథనాల రూపకర్త మేఘనాథ్ తెలిపారు. వార్తలు, కరంట్ అఫైర్స్ కార్యక్రమాలు ప్రభుత్వం నిర్దేశించిన నియమావళికి కట్టుబడి ఉండాల్సి ఉంటుందని చెప్పారు. అయితే ఈ నియమావళి కార్యక్రమాలను నియంత్రిస్తూ ఉంటుందని అన్నారు. వార్తలను అందించే పాత్రికేయులు తమకు ఆ సమాచారం ఎక్కడ నుండి వచ్చిందో గోప్యంగా ఉంచే అవకాశం ఇక ఉండబోదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఇష్టం లేని అంశాలను చర్చించే వారిని లక్ష్యంగా చేసుకొని ఈ చట్టాలను ప్రయోగించే ప్రమాదం ఉన్నదని 'ది మూక్‌నాయక్' న్యూస్ వెబ్‌సైట్ వ్యవస్థాపకురాలు మీనా కొట్వాల్ ...11లో



ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ఎంపీల బహిష్కరణపై ఇండియా నేతల ఆగ్రహం | జంతర్ మంతర్ వద్ద ప్రతిపక్షాల నిరసన

- ఎంత విచ్ఛిన్నం చేయాలని చూస్తే ఇండియా అంత పటిష్టమవుతుంది : ఖర్గే
- 146 మందిని సస్పెండ్ చేసి 60శాతం ప్రజల గొంతు నులిమారు : రాహుల్
- బీజేపీ మళ్లీ గెలిస్తే అసలు పార్లమెంటు ఉంటుందా? : ఏచూరి ప్రశ్న
- ప్రజాస్వామ్య రక్షణకు ఎంతటి మూల్యానికైనా సిద్ధం : శరద్‌పవార్ 3లో..

దేశ రక్షణను మోడీ గాలికొదిలేశారు



ప్రజాస్వామ్య రక్షణ కోసం పోరాటం తప్పదు

- ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తేయాలి
- ఇండియా కూటమి ధర్నాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వివరాలు 3లో..



హిట్లర్, ముస్సోలినీని మించిన మోడీ-షా

నిరంకుశ, ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్న బీజేపీ

ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో వామపక్షాల నిరసన

వివరాలు 3లో..



వాహనదారులకు శుభవార్త..

భారీ మొత్తంలో చలాన్లపై రాయితీలు

వివరాలు 11లో..

పద్మశ్రీ అవార్డును ప్రధానికి ఇచ్చేస్తా

రెజ్లర్ బజరంగ్ పునియా

పద్మశ్రీ అవార్డును వెనక్కి ఇచ్చేస్తున్నట్టు స్టార్ రెజ్లర్ బజరంగ్ పునియా ప్రకటించాడు. తాను గతంలో రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్న ఈ అవార్డును ప్రధాని నరేంద్ర మోడీకి ఇచ్చేస్తున్నట్టు ట్విటర్‌లో వెల్లడించాడు. తన అవార్డును ప్రధానికి అందజేసేందుకు ప్రధాని నివాసం వద్దకు వెళ్లగా పోలీసులు అడ్డుకోవడంతో ఢిల్లీలోని కర్తవ్య మార్గ్‌లో ఫుట్‌పాత్‌పై ఉంచాడు.



నేడు బీఆర్ఎస్ "స్వేద పత్రం"

రాష్ట్ర ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తొమ్మిదిన్నరేండ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానం దేశ చరిత్రలోనే ఓ సువర్ణ అధ్యాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగలూ రాత్రి తేడా లేకుండా రెక్కల కష్టంతో చెమటోడ్చి నిర్మించిన తెలంగాణ ప్రతిష్ఠను దెబ్బతీస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. విఫల రాష్ట్రంగా చూపించాలని ప్రయత్నిస్తే భరించేది లేదనీ, అగ్రగామి రాష్ట్రాన్ని అవమానిస్తే ఎట్టిపరిస్థితుల్లో ఊరుకోబోమని స్పష్టం చేశారు. అందుకే గణాంకాలతో సహా వాస్తవ తెలంగాణ ముఖచిత్రాన్ని వివరించనున్నట్టు తెలిపారు. అప్పులు కాదు.. తెలంగాణ రాష్ట్రానికి సృష్టించిన సంపదను ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో "స్వేద పత్రం" అనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్టు ఆయన వెల్లడించారు.



ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ యోచన



విజృంభిస్తున్న కరోనా...

594 కేసులు..ఆరుగురు మృతి



న్యూఢిల్లీ : భారత్‌లో మరోసారి కొవిడ్ విజృంభిస్తున్నది. గత కొన్ని రోజులుగా కరోనా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా జెఎన్.1 సబ్ వేరియంట్ వ్యాప్తి చెందుతున్నది. గురువారం 594 కేసులు నమోదైనట్టు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. బుధవారంతో పోలిస్తే యాక్టివ్ కేసులు 2,311 నుంచి 2,669కి పెరిగాయి. ఒక్క కేరళలోనే 265 కేసులు నమోదైనట్టు ఆరోగ్యశాఖ తెలిపింది. కేరళలో ముగ్గురు, కర్నాటకలో ఇద్దరు, పంజాబ్‌లో ఒకరు సహా మొత్తం ఆరుగురు మరణించగా.. మృతుల సంఖ్య 5,33,327కు చేరింది. ఈ వేరియంట్‌ను నిశితంగా పరిశీలిస్తున్నామని నిటి అయోగ్ సభ్యుడు వి.కె.పాల్ తెలిపారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్రాల్లో పరీక్షలను వేగవంతం చేశామని అన్నారు. ఆస్పత్రిలో చేరేవారి సంఖ్యలో పెరుగుదల లేదని చెప్పారు. కర్నాటకలో మాస్క్‌ను తప్పనిసరి చేసిన ...11లో

ఎంజీఎం, నీలోఫర్‌లో ముగ్గురికి కరోనా 11లో..



మహిళలపై 12శాతం పెరిగిన నేరాలు

డ్రగ్స్ మూలాలపై దృష్టి | స్నిఫర్ డాగ్స్‌తో గుర్తింపు

- నూతన సంవత్సర వేడుకలు రాత్రి ఒంటిగంట వరకే..
- పోలీసులు సిఫారసు లేఖలతో వస్తే చర్యలు
- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గం : హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి
- నగర నేరాల వార్షిక నివేదిక విడుదల

నవతెలంగాణ-సిటీబ్యూరో

గత ఏడాదితో పోల్చితే హైదరాబాద్ నగర కమిషనరేట్ పరిధిలో మహిళలపై 12శాతం దాడులు పెరిగాయి. అయితే సైబర్‌క్రైమ్, దోపిడీలు, దొంగతనాలు, మహిళలపై దాడులతోపాటు ఇతర అన్ని విభాగాల్లో కలిపి 2022 ఏడాదితో పోలిస్తే 2023లో క్రైమ్ రేటు 2శాతం మేర పెరిగిందని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ భవనంలోని ఆడిటోరియంలో నగర నేర వార్షిక నివేదికను సీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో వచ్చిన పండుగలు, ర్యాలీలతోపాటు అసెంబ్లీ ఎన్నికలు సహా అన్ని కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేశామన్నారు. నగర కమిషనరేట్ పరిధిలో ఐదు డీసీపీ జోన్లను ఏడుకు పెంచుకున్నామని, సివిల్ పోలీస్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు సైతం పెరిగాయన్నారు. ఈ ఏడాదిలో నగరంలో మహిళలపై నేరాలు పెరిగాయన్నారు. మహిళలపై లైంగిక దాడుల కేసులు 2022లో 343 ఉంటే, ఈ ఏడాది 403 నమోదయ్యాయన్నారు. ఈ ఏడాదిలో హత్యలు తగ్గి, స్థిరాస్తి సంబంధిత నేరాలు 3శాతం మేర పెరిగాయన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్ బ్యూరో తీవ్రంగా కృషి చేస్తుందని తెలిపారు. ఈ ఏడాది మత్తు పదార్థాలు వాడిన 740 మందిని అరెస్టు చేశారన్నారు. డ్రగ్స్ కేసులో 13 మంది విదేశీయులు సైతం ఉన్నారని తెలిపారు. డ్రగ్స్ మూలాలపై దృష్టి సారించామని, సరఫరా చేసేవాళ్లు ఎక్కడ ఉన్నా వెతికి పట్టికుంటామన్నారు. డ్రగ్స్‌ను గుర్తించేందుకు స్నిఫర్ డాగ్స్‌ను వాడతామని తెలిపారు. 11శాతం సైబర్ నేరాలు పెరిగాయని, వాటిని నివారించేందుకు అన్ని చర్యలూ చేపడతామన్నారు. సైబర్‌క్రైమ్, నార్కోటెక్ విభాగాలను మరింత బలోపేతం చేస్తామన్నారు. గతేడాది సైబర్ నేరాల్లో రూ.82కోట్ల మోసాలు జరిగితే, ఈ ఏడాది రూ.133కోట్లను సైబర్ నేరగాళ్ల కొల్లగొట్టారన్నారు. ఇక ఆర్థిక నేరాలు స్వల్పంగా పెరిగాయన్నారు.

నగర రోడ్లపైకి ప్రతిరోజూ 16150 కొత్త వాహనాలు

రోజురోజుకూ ట్రాఫిక్ పెరుగుతోందని సీపీ తెలిపారు. ప్రతి రోజూ 16150 కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

మరికొంత మందిని అరెస్టు చేస్తాం..

బిగ్‌బాస్ టైటిల్ విజేతగా నిలిచిన పల్లవి ప్రశాంత్ అన్నపూర్ణ స్టూడియో నుంచి ఊరేగింపుగా ...11లో

మత సామరస్యాన్ని కాపాడతాం



సంక్షేమ పాలన అందిస్తాం

- పథకాలు ఇంటింటికీ చేరుస్తాం
- క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో, రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడేది కాంగ్రెస్ పార్టీయేనని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. డిసెంబర్‌లో అద్భుత జరగబోతుందని ముందుగానే చెప్పానని గుర్తు చేశారు. ప్రపంచానికే డిసెంబర్ నెల మిరాకిల్ మంత్ అని చెప్పారు. ఎందుకంటే యేసు ప్రభువు జన్మదినమే కారణమన్నారు. దేశంలో సెక్యులర్ భావాలను కాపాడటం కాంగ్రెస్ ప్రధాన బాధ్యతని చెప్పారు. మొన్న కర్ణాటక.. నిన్న హిమాచల్ ప్రదేశ్... నేడు తెలంగాణలో సెక్యులర్ ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. అప్పుడే మణిపూర్‌లాంటి ఘటనలకు బ్రేక్ పడుతుందన్నారు. ప్రస్తుతం దేశ రక్షణ ప్రమాదంలో పడిందని చెప్పారు. మణిపూర్‌లో మారణహోమం జరిగితే..ప్రధాని ఆ రాష్ట్రాన్ని సందర్శించలేదని విమర్శించారు. ప్రజల ప్రాణాల కంటే ఎన్నికల ప్రచారం ముఖ్యంగా భావించారని తెలిపారు. రాహుల్‌గాంధీ పరామర్శించాలని ప్రయత్నిస్తే అడ్డుకున్నారని విమర్శించారు. నిస్సహాయులకు ...11లో

రేపు కలెక్టర్లతో సీఎం రేవంత్ భేటీ

వివరాలు 11లో..



రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం

- గవర్నర్, స్పీకర్, సీఎం, మంత్రులు, తదితరుల హాజరు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని బొల్లారంలో గల రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎట్ హోం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అందులో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ్మ జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పల్లవి ప్రశాంత్‌కు బెయిల్ మంజూరు

నవతెలంగాణ - బంజారాహిల్స్



హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద గత ఆదివారం జరిగిన విధ్వంసం కేసులో అరెస్టయిన బిగ్‌బాస్ సీజన్ 7 విజేత పల్లవి ప్రశాంత్‌కు బెయిల్ మంజూరైంది. ప్రశాంత్‌తో పాటు అతని సోదరుడికి శుక్రవారం నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. అలాగే, ఈ ఆదివారం పోలీసుల ముందు విచారణకు హాజరు కావాలని, రూ.15 వేల చొప్పున రెండు షూరిటీలు కట్టాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

విద్యతోనే భవిత

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం

- టెన్త్ విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యతోనే విద్యార్థుల భవిత బాగుంటుందని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. విద్య ఉంటేనే సమాజంలో గౌరవం దక్కుతుందని చెప్పారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు మూడు నెలలపాటు నిర్వహించే ప్రేరణ కార్యక్రమాన్నిశుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ ప్రణాళిక, పునశ్చరణతో విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించొచ్చని సూచించారు. చదువుకునే వయసులోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదగొచ్చని అన్నారు. విద్యార్థులు ఇలాంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్, సైకాలజిస్టు పరికిపండ్ల అశోక్ పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డుకు పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించాలి

- సీఎంకు మధుసూదన్‌రెడ్డి విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ బోర్డుకు పూర్తిస్థాయిలో సమయమిచ్చి పనిచేయగల అధికారిని కార్యదర్శిగా నియమించాలని ఇంటర్ విద్యా జేఏసీ చైర్మెన్ పి మధుసూదన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన కలిసి విజ్ఞప్తి చేశారు. సచివాలయానికే పరిమితమైన రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ ఇంటర్ బోర్డు కార్యదర్శిగా ఆర్నెల్లకోసారి కూడా కార్యాలయానికి రావడం లేదని ఆరోపించారు.ఆయన స్థానంలో మరో అధికారిని కార్యదర్శిగా నియమించాలని కోరారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన జయప్రదాభాయి వ్యవహారాలపైసమగ్ర విచారణ జరిపి తగినచర్యలు తీసుకోవాలని తెలిపారు.

మెగా డీఎస్సీని ప్రకటించాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో సంబంధం లేకుండా మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విడుదల చేసిన 5,089 పోస్టులకు అదనంగా మరిన్ని పోస్టులు కలపాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులకు టెట్, బదిలీలు, పదోన్నతులు, పార్లమెంటు ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు అంటూ చూస్తే ఈ ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశముందని తెలిపారు. వాటితో సంబంధం లేకుండా మెగా డీఎస్సీని ప్రకటించాలని కోరారు. రాబోయే ఆర్నెల్లలో ఉద్యోగ విరమణ పొందే ఖాళీలను కలిపి అనుబంధ నోటిఫికేషన్‌లో ప్రకటించాలని సూచించారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

- ఓ కుటుంబాన్ని కాపాడిన వాచ్‌మెన్, కానిస్టేబుల్

పంజాగుట్టలో ఘటన:

నవతెలంగాణ-బంజారాహిల్స్



హైదరాబాద్ పంజాగుట్టలోని ఓ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. అయితే ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్, వాచ్‌మెన్ వెంటనే స్పందించడంతో ఓ కుటుంబం ప్రాణాలతో బయటపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఉదయం ఎర్రమంజిల్‌లోని ఓ అపార్ట్‌మెంటులోని ఆరో అంతస్తులో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన వాచ్‌మెన్ ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. అలాగే అక్కడే ఉన్న పంజాగుట్ట ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రావణ్‌కు విషయం చెప్పడంతో వెంటనే స్పందించారు. ఇద్దరూ కలిసి అక్కడ ఉన్న డంబెల్ సహాయంతో ఆరో అంతస్తులోని డోరును బద్దలు కొట్టి కుటుంబాన్ని బయటకు తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బంది కూడా అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. ఇంట్లో ఉన్న మంచాలు, బీరువాలు ఇతర సామాగ్రి కాలిపోయిందని ఫైర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ఘటన జరిగిందన్నారు. ప్రాణాలకు తెగించి కుటుంబాన్ని కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రవణ్‌ను, వాచ్‌మెన్‌ను స్థానికులు అభినందించారు.

ప్రజావాణిలో 2202 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 2202 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. ఎక్కువగా 40 శాతం మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, 30 శాతం మేరకు పింఛన్లకు సంబంధించినవి, మిగిలినవి ఉద్యోగాలు, రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకున్నారని ప్రజా భవన్ అధికారులు తెలిపారు. ఈ మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

ధర ఉన్నా.. మిగిలేది సున్నా..!

పంట కోత ప్రయోగంతో మరింత దయనీయం వరి ఎకరాకి 30 క్వింటాళ్లకు గాను 20క్వింటాళ్లే..

- పత్తి ఎకరాకి 10క్వింటాళ్లకు గాను 6క్వింటాళ్లే..పెట్టిన పెట్టుబడి కూడా రాని దుస్థితి..





నవతెలంగాణ-మల్హర్‌రావు

అటు అకాల వర్షాలు.. ఇటు వర్షాభావంతో ఇప్పటికే రైతులు చితికిపోతుండగా.. ఇప్పుడు దళారుల దోపిడీతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. అరకొర పంట దిగుబడులకైనా గిట్టుబాటు ధర లభిస్తోందని ఆశిస్తే దళారులు గద్దల్లా వచ్చి తన్నుకుపోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించిన పంట కోత ప్రయోగల్లోనూ దిగుబడి తగ్గినట్టుగా తేలింది. దీనికి తీడు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీ వర్షాలకు పంటలు జలమయ్యాయి. ఇందుకు జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలమే నిదర్శనం.

మండల పరిధిలోని తాడిచెర్ల, మల్లారం, వళ్లెంకుంట, కొండంపేట, కుంభంపల్లి, పీవీనగర్ తదితర మానేరు పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో 15,046 ఎకరాల్లో వరి, 3,657 ఎకరాలకు పైగా పత్తి సాగు చేశారు. కానీ, వరి గొలుసు వేసిన దశలో వర్షాలు కురవడంతో పూత రాలిపోయింది. దీనికి తోడు తెగుళ్ల అంటుకున్నాయి. పత్తి పంట ఎదుగుదల దెబ్బతినగా పెట్టుబడి మరింత పెరిగింది. ఈక్రమంలో 150కి పైగా పంట కోత ప్రయోగాలు చేపట్టగా దిగుబడులు తక్కువగా రావడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పావుగంట పంటకోత ప్రయోగం చేస్తే పత్తి 10 నుంచి 12 కిలోలు రావాలి. వరి 20కిలోల దాకా రావాలి. కానీ, పత్తి 5 నుంచి 6 కిలోలు రాగా, వరి ధాన్యం 14 నుంచి 15 కిలోలు మాత్రమే వస్తోంది. ఈ లెక్కన ఎకరాకి ధా న్యం 30క్వింటాళ్లు రావాల్సి ఉండగా 20 నుంచి 25క్విం టాళ్లు మాత్రమే వస్తోంది. ఎకరానికి పత్తి 10 నుంచి 12 క్వింటాళు రావాల్సి ఉండగా 6 నుంచి 8 క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. ఫలితంగా మండల వ్యాప్తంగా రైతులు సుమారు 10 టన్నుల వరిధాన్యం, 12 టన్నుల పత్తి నష్టపోతున్నారు. మొత్తంగా పత్తికి రూ.2 కోట్లు, ధాన్యంకు రూ.3 కోట్లు కలిపి రూ. 5కోట్ల దాకా నష్టపోతున్న పరిస్థితి

.నష్టపరిహారం ఊసే లేదు?

గత రెండు సీజన్లు కలిపి అకాల వర్షాలకు మానేరు పరివాహక ప్రాంతాల్లో 5,789 ఎకరాల్లో ఇసుక మేటలు పెట్టి పంటలు దెబ్బతిన్నాయి. 500 కరెంట్ స్తంభాలు కొట్టుకుపోయాయి. 150 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 2వేల కరెంట్ మోటార్లు కొట్టుకుపోయాయి. నామమాత్రంగా పంట నష్టానికి ప్రాథమిక అంచనా నివేదికలు తయారు చేసి గత ప్రభుత్వం చేతులు దులుపుకుంది. గతంలో బ్యాంకు రుణాలు పొందిన రైతులకు పరిహారం వచ్చేది. పంటల బీమా ప్రీమియం చెల్లించినవారికి పరిహారం అందేది. ఈ సారి ఆ ఊసేలేదు. మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలు నామమాత్రంగా జరుగుతుండటంతో రైతులు దళారులను, రైస్ మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. దాంతో వ్యాపారులు సిండికెట్‌గా మారి తూకంలో తరుగు, నాణ్యత పేరుతో కిలోల కొద్దీ కోత విధిస్తూ దోచుకుంటున్న పరిస్థితి.

నిండా మునిగినా : లక్ష్మయ్య, రైతు, తాడిచెర్ల

నేను మూడెక రాల్లో వరి వేసిన. మొదట పంట మంచి గుండే. మధ్యలో వర్షాలు పడి తెగుళ్ల సోకాయి. వానలు అనుకూలంగా పడలేదు. వరి కోస్తే 25 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఎప్పుడైనా 80 క్వింటాళ్లు వచ్చేవి. దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

ఉన్నతి, తొలిమెట్టుపై టీచర్లలో సానుకూల దృక్పథం తేవాలి

పీఎంశ్రీ స్కూళ్లకు నిర్వహణ గ్రాంటును విడుదల చేయాలి విద్యాశాఖ కమిషనర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ :



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉన్నతి, తొలిమెట్టు కార్యక్రమాలపై ఉపాధ్యాయుల్లో మరికొంత సానుకూల దృక్పథం తేవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. పీఎం శ్రీ పథకంలో ఎంపికైన ఉన్నత పాఠశాలలకు నిర్వహణ గ్రాంటును వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఆరు, ఏడు తరగతుల వారికి, విద్యాప్రమాణాలు పెంచేందుకు అమలు చేస్తున్న ఉన్నతి కార్యక్రమంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. కొంతమంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం అవసరమే కానీ కొన్ని అనవసర అంశాలు, రోజువారీ పాఠ్యబోధనలో అవసరంలేని స్టెప్స్ ఉన్నాయంటూ అభిప్రాయపడుతున్నారని పేర్కొన్నారు. వాటిని తొలగిస్తే మంచిదనీ, అవసరం లేని టెస్టులు, రాతపనులను తగ్గిస్తే బాగుంటుందని కొందరు ఉపాధ్యాయులంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని రద్దు చేయడం మంచిదని మరికొందరు అభిప్రాయపడుతున్నారని తెలిపారు. తొలిమెట్టు ప్రవేశపెట్టి రెండో ఏడాదైనా ఈ కార్యక్రమాన్ని కూడా ఉపాధ్యాయులు పూర్తిగా రిసీవ్ చేసుకుని ముందుకు తీసుకుపోవడంలో తరతమ బేధాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ రెండు కార్యక్రమాల్లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లలో కూడా పూర్తి సానుకూలత కనిపించలేదని తెలిపారు. తొలిమెట్టు వల్ల ఈ విద్యాసంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగాల్సి ఉండేదని సూచించారు. కానీ స్థూలంగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ తగ్గినట్టు సమాచారముందని వివరించారు. కాబట్టి తగు చర్యలతో ప్రభుత్వ పాఠశాలల ఉన్నతికి తోడ్పడేదేలా పై రెండు కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. పీఎంశ్రీ పథకంలో ఎంపికైన ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు నిర్వహణ గ్రాంటును విడుదల చేయలేదని తెలిపారు. ఇది కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకమైనందున కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదో, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం తన 40 శాతం నిధులివ్వలేదో తనకు సమాచారం లేదని పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభించి ఆర్నెల్లు దాటిందని తెలిపారు.

పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలన్నీ విద్యార్థుల నమోదు ఎక్కువగా ఉన్నవేనని వివరించారు. నిర్వహణ గ్రాంటు విడుదల చేయకపోవడం వల్ల ఆ పాఠశాలలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. 1,200 పాఠశాలలే ఉన్నందున కమిషనర్ పరిధిలో ఉన్న నిధుల నుంచి గ్రాంటు ఇవ్వాలని కోరారు. తర్వాత రీయింబర్స్ చేసుకోవాలని సూచించారు. లేదంటే జిల్లా కలెక్టర్ల నుంచైనా ఇప్పించి తర్వాత వారికి రీయింబర్స్ చేయాలని తెలిపారు.

ట్రంప్ కేసులో జడ్జీలకు బెదిరింపులు

- సోషల్ మీడియాలో తీవ్రమైన పదజాలంతో పోస్టులు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనర్హుడు అని కొలరాడో కోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే కేసులో తీర్పు వెలువరించిన న్యాయమూర్తులకు పలువురి నుంచి బెదిరింపులు వస్తున్నట్టుసమాచారం. అలాగే జడ్జీలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో తీవ్రమైన పదజాలంతో కొందరు పోస్టులు పెడుతున్నారని అడ్వాన్స్‌డ్ డెమోక్రసీ అనే ప్రభుత్వేతర సంస్థ తెలిపింది. 'కొలరాడో కోర్టు తీర్పు వెలువరించినప్పటి నుంచి జడ్జీలకు వ్యతిరేకంగా పలువురు పోస్టులు పెడుతున్నారు. ఈ రకమైన వ్యాఖ్యలు ఆందోళనకరం. జడ్జీలకు, వారి కుటుంబ సభ్యులకు హాని తలపెట్టాలని రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం, వారి వ్యక్తిగత సమాచారంతోపాటు ఇంటి చిరునామా వంటి వివరాలను కొందరు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు' అని ఆ ఎన్‌జీవో అధ్యక్షులు, మాజీ ఎఫ్‌బీఐ అధికారి డానియెల్ జే. జోన్స్ తెలిపారు. రాజకీయ నాయకులు ఇలాంటి పోస్టులకు వ్యతిరేకంగా మాట్లాడితేనే.. వారి మద్దతుదారుల్లో హింసాత్మక ధోరణి తగ్గుతుందని జోన్స్ సూచించారు.

సోషల్ మీడియా సంస్థలు కూడా ఇలాంటి వ్యాఖ్యలు ప్రచారం కాకుండా నిరోధించాలని తెలిపారుజ

2021 జనవరిలో క్యాపిటల్ భవనంపై దాడికి సంబంధించిన కేసులలో తీర్పు ఇస్తూ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు ట్రంప్ అనర్హుడని కొలరాడో కోర్టు ప్రకటించింది. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ సెక్షన్ 3 నిబంధన ద్వారా అమెరికా చరిత్రలోనే ఇలాంటి తీర్పు ఇచ్చారు. అయితే ఈ తీర్పునకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు ట్రంప్ న్యాయవాదులు సిద్ధమయ్యారు. దీంతో ట్రంప్ భవితవ్యాన్ని అమెరికా సుప్రీంకోర్టు తేల్చనుంది.

జేవియర్ మిలైకి వ్యతిరేకంగా ప్రజాగ్రహం



- అర్జెంటీనాలో వెల్లువెత్తిన నిరసన

బ్యూనస్ ఎయిర్స్ : ప్రజా వ్యయాన్ని తగ్గిస్తాన్న వాగ్దానంపై అధికారం చేపట్టిన పచ్చి మితవాది జేవియర్ మిలైకి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనకు దిగారు. మిలై ఆర్థిక చర్యలను వ్యతిరేకిస్తూ బుధవారం వేలాది మంది అర్జెంటీనియన్లు రాజధాని బ్యూనస్ ఎయిర్ వీధుల్లో నిరసన చేపట్టారు. పేదలకు ఆర్థిక మద్దతు కల్పించాని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పలు వీధుల నుంచు అధ్యక్ష భవనం ఎదుట ఉన్న చారిత్రాత్మక మీటింగ్ పాయింట్ ప్లాజా డి మయో స్క్వేర్ ర్యాలీగా చేరుకున్నారు. మిలై ప్రమాణస్వీకారం చేసిన అదే ప్రాంతంలో నిరసన చేపట్టారు. మిలై నియంతలా వ్యవహరిస్తున్నారని నినాదాలిచ్చారు. భారీగా పోలీసులు ర్యాలీ వెంట నడిచారు. ఇది శాంతియుత ర్యాలీ అని, ఆందోళనలు, ఘర్షణలు కోరుకోవడం లేదని వామపక్ష ఆందోళన బృందం అధ్యక్షుడు ఎడ్వార్డో బెల్లిబోనీ తెలిపారు. అర్జెంటీనా నూతన అధ్యక్షుడిగా జేవియర్ మిలై డిసెంబర్ 10 బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఆర్థిక వ్యవస్థను సంస్కరించడానికి మరియు ఇటీవల నిరసనలను అణిచివేసేందుకు విస్తృత ప్రణాళికలను రచించినట్టు ప్రకటించారు. మిలై 'షాక్ థెరపీ'ని పలువురు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గతవారం అర్జెంటీనా కరెన్సీ విలువను 54 శాతం తగ్గిస్తున్నట్టుగా ప్రకటించారు. అలాగే సబ్సిడీలను, ప్రభుత్వ సేవలను రద్దు చేశారు. అర్జెంటీనా ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడాలంటే ఈ చర్యలు చేపట్టాల్సిందేనని మిలై సన్నిహిత మంత్రులు పేర్కొన్నారు. మిలై భద్రతా మంత్రి గతవారం నిరసనలను వ్యతిరేకిస్తూ ప్రోటోకాల్‌ను సమర్పించారు. రహదారులను బ్లాక్ చేయకుండా, ప్రదర్శనకారులను నిరోధించడానికి భద్రతా బలగాలను ప్రయోగించవచ్చని పేర్కొంది.

ఈ చర్యలను వామపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. నిరసన తెలిపే హక్కుని అడ్డుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి.

పీసీ సర్కార్ ను విచారించిన ఈడీ

కొల్‌కతా: ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పీసీ సర్కార్ (జూనియర్)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) శుక్రవారం విచారించింది. సర్కార్‌ను సాల్ట్ లేక్‌లోని తన కార్యాలయానికి పిలిపించుకున్న ఈడీ అధికారులు పిన్‌కాన్ గ్రూప్, టవర్ ఇన్ఫోటెక్ లిమిటెడ్‌గా కేంద్ర ఏజెన్సీలు గుర్తించిన రెండు కంపెనీలకు సంబంధించిన స్కామ్‌లలో ఆయన ప్రమేయం గురించి ప్రశ్నించారు. 790 కోట్ల రూపాయలకు పైగా మదుపరులను మోసగించిన చిట్ ఫండ్ మోసానికి సంబంధించి కొనసాగుతున్న విచారణలో భాగంగా సర్కార్‌ను ప్రశ్నించినట్టు ఒక అధికారి తెలిపారు.శుక్రవారం మధ్యాహ్నం సర్కార్ సాల్ట్ లేక్‌లోని ఈడీ కార్యాలయానికి చేరుకున్న వెంటనే ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఈ కుంభకోణాల్లో ఆయనకు ఏదైనా ప్రమేయం ఉందా లేదా అనేది మేము కనుగొనవలసి ఉంది" అని ఈడీ అధికారి పీటీఐ కి తెలిపారు. కొద్ది రోజుల క్రితం టవర్ గ్రూప్‌కు చెందిన సీనియర్ అధికారిని ఈడీ అదుపులోకి తీసుకుందని, అతనిని గ్రిల్ చేస్తున్నప్పుడు సోర్కార్ పేరు బయటపడిందని అధికారి తెలిపారు. 2021లో ఇదే కేసుకు సంబంధించి సర్కార్ బాలిగంజ్ నివాసంలో సీబీఐ సోదాలు నిర్వహించింది.

టీఎస్ఎంసీ ఎన్నికల్లో హెచ్‌ఆర్‌డీఏ ప్యానెల్ గెలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌డీఏ) ప్యానెల్ గెలిచింది. బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించిన ఎన్నికలు కావడంతో గత కొన్ని రోజులుగా లెక్కిస్తున్న సంగతి తెలిసిందే. కౌన్సిల్‌లో 13 మంది సభ్యులకు గాను జరిగిన ఎన్నికల్లో హెచ్‌ఆర్‌డీఏ నుంచి నిలబడిన 13 మందికి 13 మంది గెలుపొందడం విశేషం. పోలైన మొత్తం ఓట్లు 13,779 కాగా అందులో 3,311 ఓట్లు చెల్లనివిగా తిరస్కరించారు. చెల్లుబాటైన ఓట్లలో హెచ్‌ఆర్ డీఏ నుంచి పోటీ చేసిన డాక్టర్ ప్రతిభకు అత్యధికంగా 7,007, డాక్టర్ మహేశ్ కుమార్‌కు 6,735, డాక్టర్ రాజ్ కుమార్ కు 6,593, డాక్టర్ జి.శ్రీనివాస్‌కు 6,454 వచ్చాయి. ఇదే క్రమంలో హెచ్‌ఆర్‌డీఏ ప్యానెల్‌లోని మిగిలిన వారికి అత్యధిక ఓట్లు పడటంతో వారి గెలుపు ఖాయమైంది. ఈ సందర్భంగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా), తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీ-ఎస్ఆర్‌డీఏ) ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. టీఎస్ఎంసీ బలోపేతానికీ, రాష్ట్రంలో అర్హత లేని వైద్యం నుంచి ప్రజల ప్రాణాలను కాపాడంలో కొత్త సభ్యులు కీలక పాత్ర పోషిస్తారని వారు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

తీవ్రమైన ఆహార సంక్షోభం

కరువు పరిస్థితుల్లో గాజా ప్రజలు : నివేదిక



జెనీవా : గాజాలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొనవచ్చు. ఇప్పటికే గాజాలో 5,76,000 పాలస్తీనియన్లు (జనాభాలో మూడో వంతు) "తీవ్రమైన ఆకలి , కరువు" పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఓ నివేదిక పేర్కొంది. యూఎన్‌కి చెందిన 23 ఏజన్సీలు మరియు ప్రభుత్వేతర సంస్థలు సంయుక్తంగా గురువారం ఈ నివేదికను విడుదల చేశాయి. గాజాలోని మొత్తం 2.3 మిలియన్ల జనాభాలో తీవ్ర స్థాయిలో ఆకలి ఎదుర్కొంటోంది మరియు ప్రతిరోజూ కరువు ప్రమాదం పెరుగుతోందని నివేదిక స్పష్టం చేసింది.

గాజాలోని జనాభా మొత్తం ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని , ఆ జనాభాలో 5,76,600 మంది తీవ్రమైన ఆకలి లేదా కరువు పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొంది. గాజాకు అందించే మానవతా సాయాన్ని పెంచాలని ఐరాస అధ్యక్షుడు ఆంటోనియో గుటెరస్ పేర్కొన్న సంగతి తెలిసిందే. దీంతో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ)లో కాల్పుల విరమణ తీర్మానంపై ఓటింగ్ మరోరోజు ఆలస్యమైంది. గాజాలో తీవ్రమైన ఆహార అభద్రతతో ప్రభావితమైన కుటుంబాల నిష్పత్తి ప్రపంచవ్యాప్తంగా నమోదైన వాటిల్లో అతిపెద్దదని ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ (ఐపీసీ) గురువారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గాజాలో ఆకలి తీవ్రత ఇటీవలి సంవత్సరాల్లో ఆఫ్ఘనిస్తాన్, యెమెన్‌లలో కరువును కూడా అధిగమించిందని నివేదికలోని అంకెలు తెలుపుతున్నాయి. భారీ మొత్తంలో ప్రజలు కరువు బారిన పడటం ఇప్పటి వరకు చూడలేదని, కేవలం రెండు నెలల్లో గాజాలో ఆ పరిస్థితులు ఏర్పడ్డాయని వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్స్ చీఫ్ ఎకనామిస్ట్ అరిఫ్ హుస్సేన్ తెలిపారు. అంటే గాజాలో పరిస్థితి ఆందోళనకరమని, ప్రతిఒక్కరూ ఆకలితో అల్లాడుతున్నారని హుస్సేన్ పేర్కొన్నారు. తగిన పోషకాహారం అందకపోవడంతో వారు వ్యాధుల బారిన పడే ప్రమాదం అధికంగా ఉందని అన్నారు. వచ్చే ఆరువారాల్లో గాజాలోని ప్రతి ఒక్కరూ తీవ్ర ఆహార అభద్రతను ఎదుర్కొంటారని నివేదిక పేర్కొంది. నాలుగు నెలల యుద్ధం అనంతరం ఫిబ్రవరి 7 నాటికి గాజాస్ట్రిప్‌లోని మొత్తం జనాభా " ఆకలి సంక్షోభం లేదా అధ్వాన్న" పరిస్థితుల్లో ఉంటుందని 23 ఏజన్సీలు అంచనావేస్తున్నాయి. ఐపిసి ఐదు దశల ఆహార అభద్రత వర్గీకరణ ప్రకారం.. మూడవ దశలో సంక్షోభం, నాలుగు ఎమర్జెన్సీ, ఐదు విపత్తు లేదా కరువు పరిస్థితులు ఉన్నట్లు తెలిపింది. ఐపిసి ఏదైనా నిర్దిష్ట ప్రాంతం లేదా దేశం కోసం వర్గీకరించిన అధిక స్థాయి తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్న వ్యక్తులలో గాజా అత్యధిక వాటా కలిగి ఉందని నివేదిక పేర్కొంది. అంతర్జాతీయ మానవతా సంస్థ కేర్ (సీఏఆర్ఈ) ఈ గణాంకాలను ఆందోళనకరం అని పేర్కొంది.

గాజా ఆరోగ్య శాఖ డైరెక్టర్ జనరల్ కుటుంబంపై దాడి

పాత గాజాస్ట్రిట్‌లోని జాబాలియా నగరంలోని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ మునీర్ అల్ బుర్ష్ కుటుంబాన్ని ఇజ్రాయిల్ సైన్యం లక్ష్యం చేసుకుందని పాలస్తీనియన్ షెహబ్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఈ దాడిలో అల్ బుర్ష్ తీవ్రంగా గాయపడగా, ఆయన కుమార్తె సహా 16 మంది మరణించినట్టు పేర్కొంది.

మరో 50 మందికి తీవ్రగాయాలయ్యాయని ప్రకటించింది. గాజా నగరంలోని షేక్ రద్వాన్ జిల్లాలో అబు ఇస్కందర్ ప్రాంతంలో ఓ నివాసంపై ఇజ్రాయిల్ బాంబు దాడిలో తొమ్మిది మంది పాలస్తీనియన్లు మరణించినట్టు స్థానిక మీడియా తెలిపింది.

హిట్లర్, ముస్సోలినీని మించిన మోడీ-షా

నిరంకుశ, ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్న బీజేపీ

- పొగబాంబు ఘటనకు బాధ్యత వహించాలి
- దేశ ప్రజలకు కేంద్రం క్షమాపణ చెప్పాలి
- ఎంపీలపై సస్పెన్షన్‌ను ఎత్తేయాలి : వామపక్ష పార్టీల నేతల డిమాండ్
- హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో బీజేపీ నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం నిరంకుశంగా, ఫాసిస్టు పాలన కొనసాగిస్తున్నదని వామపక్ష పార్టీల నేతలు విమర్శించారు. హిట్లర్, ముస్సోలినీని మించిన నియంతలుగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా వ్యవహరిస్తున్నారని చెప్పారు. పొగబాంబు ఘటనకు మోడీ ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలనీ, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 143 మంది ఎంపీలపై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేయాలని కోరారు. 143 మంది ప్రతిపక్ష పార్లమెంటు సభ్యుల అప్రజాస్వామిక సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేయాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'వామపక్షాల ఐక్యత వర్థిల్లాలి, ఎంపీలపై సస్పెన్షన్‌ను ఎత్తేయాలి'అంటూ నినాదాలు చేశారు. 'పార్లమెంటు భద్రతపై ప్రశ్నించిన ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేయడం సిగ్గు... సిగ్గు..., ఎంపీలను సస్పెండ్ చేసిన బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఖండించండి, ప్రతిపక్ష ఎంపీల అప్రజాస్వామిక సస్పెన్షన్‌లను ఖండించండి'అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బీజేపీ ఎంపీలు అజాగ్రత్తగా ఉంటూ పాస్‌లను జారీ చేశారని చెప్పారు. దాన్ని ప్రశ్నించిన ఎంపీలను సస్పెండ్ చేయడం దుర్మార్గమని విమర్శించారు. బీజేపీ తీరు ఇలాగే కొనసాగితే ఎంపీల మీద దాడి జరుగుతుందనీ, కాల్చి చంపుతారని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లో బీజేపీ గెలుపుపై అనేక అనుమానాలున్నాయని అన్నారు. యంత్రాలు తారుమారైనట్టు తెలుస్తున్నదని చెప్పారు. పొగబాంబు ఎందుకు తెచ్చారో, అందుకు కారణాలేంటో తెలుసుకోవాలని సూచించారు. మోడీ, అమిత్‌షాలపై వ్యతిరేకతతో తెచ్చారా?, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా తెచ్చారా? అన్న వాస్తవాలను బయటికి తీయాలని డిమాండ్ చేశారు.

పొగబాంబు ఘటనపై ప్రధాని స్పందించాలి : నంద్యాల నర్సింహారెడ్డి

పార్లమెంటుకు అత్యంత భద్రత ఉండాలనీ, అందులోకి దుండగులు చొరబడి పొగబాంబు వేసిన ఘటనపై ప్రధాని, హోంమంత్రి స్పందించాలంటూ ప్రతిపక్ష ఎంపీలు కోరితే వారిని సస్పెండ్ చేయడం దుర్మార్గమని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి విమర్శించారు. అందరినీ బయటికి వెళ్లగొట్టి మూడు క్రిమినల్ చట్టాలను ఆమోదించారని అన్నారు. పార్లమెంటుకే భద్రత లేకుంటే దేశంలోని ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దేశాన్ని, సరిహద్దును, ప్రజలను కాపాడతామంటూ ఎలా భరోసా కల్పిస్తారని అడిగారు. ఈ ఘటనకు ప్రధాని, హోంమంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం వరకు పార్లమెంటు సమావేశాలుంటే, గురువారంనాడే నిరవధిక వాయిదా వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. శుక్రవారం ఇండియా కూటమి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలుండడం వల్లే పార్లమెంటు సమావేశాలను నిర్వహించలేదన్నారు. ప్రజాపంథా రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ నిరసన తెలపడమే నేరం అన్నట్టుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. దేశంలో ప్రతిపక్షం లేకుండా ప్రజాస్వామ్యం మనుగడ సాగించగలదా? పాలకులు ప్రజాస్వామ్యవాదులేనా?అని అడిగారు. ప్రజలను మేల్కొల్పాలనీ, ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్లోకి తేవాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జెవి చలపతిరావు మాట్లాడుతూ పొగబాంబు ఘటనపై ప్రధాని, హోంమంత్రి సమాధానం చెప్పలేక ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం దుర్మార్గమని విమర్శించారు. మూడు రాష్ట్రాల్లో గెలవడం, 370 ఆర్టికల్ రద్దును సుప్రీం సమర్థించడంతో కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు చేస్తున్నదని అన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్ధన్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత మహోత్సవాలు జరుపుతున్న వేళ 143 మంది ఎంపీలను బహిష్కరించిన చరిత్ర గతంలో ఎప్పుడూ లేదన్నారు. ఇది మోడీ సర్కారు ఫాసిస్టు చర్య అని విమర్శించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెంటనే స్పందించి సస్పెన్షన్లను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర నాయకులు తేజ మాట్లాడుతూ దేశంలో బీజేపీ ఫాసిస్టు విధానాలకు పాతర వేస్తే తప్ప ప్రజలకు విముక్తి లేదన్నారు. అధ్యక్షత వహించిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు మాట్లాడుతూ పార్లమెంటును రక్షించలేని ప్రభుత్వం దేశాన్ని ఎలా కాపాడుతుందని ప్రశ్నించారు. ఎంపీలను సస్పెండ్ చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలంతా నడుం బిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టీగల సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, ఆర్ శ్రీరాంనాయక్, టి స్కైలాబ్‌బాబు, జె బాబురావు, ఆర్ వెంకట్రాములు, బుర్రి ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, ఎన్ బాలమల్లేష్, విఎస్ బోస్, ప్రజాపంథా నాయకులు ఎస్ఎల్ పద్మ, ప్రదీప్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సంధ్య, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్పు రావాలి.. సీఐటీయూ గెలవాలి..

- ఉదయించే సూర్యుడు గుర్తు పై ఓటు వేసి గెలిపించాలి : సింగరేణి కార్మిక సంఘ ఎన్నికల ప్రచారంలో సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి బి.మధు



నవతెలంగాణ-మణుగూరు

మార్పు రావాలంటే.. సీఐటీయూ గెలవాలని, సింగరేణి సంస్థ గుర్తింపు ఎన్నికల్లో ఉదయించే సూర్యుడు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు మండలంలో శుక్రవారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) మణుగూరు బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఓసీ 2 వర్క్‌షాప్‌లో కార్మికుల ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ నెల 27న జరగబోయే సింగరేణి కార్మిక సంఘం ఎన్నికలు కార్మికుల హక్కులు కాపాడుకునే విధంగా ఆలోచన చేసి సీఐటీయూని గెలిపించాలని కోరారు. సొంతింటి కల పెరిక్స్ ఇన్‌కమ్ టాక్స్ రియంబర్స్‌మెంట్ ఇప్పిస్తామన్నారు. సింగరేణి కార్మిక పిల్లలకు సీబీఎస్ఈ సిలబస్‌తో నాణ్యమైన విద్య, 250 గజాల ఇంటి స్థలం, సింగరేణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, కారుణ్య నియామకాలు తదితర డిమాండ్లతో కూడిన హామీలను సీఐటీయూ కార్మికులకు ఇచ్చిందని తెలిపారు. సింగరేణిలో ప్రమోషన్లు వస్తే జీతం పెరగటం కన్నా జీతం తగ్గే పరిస్థితి ఎందుకు వచ్చిందని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ సంఘాల వాళ్ళని అడగాల్సిన అవసరముందని, దీనిపై ఆలోచించాలని కోరారు. అనంతరం యూనియన్ రాష్ట్ర నాయకులు కె.బ్రహ్మచారి మాట్లాడారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు టీవీఎంవీ ప్రసాద్, డివిజన్ కన్వీనర్ గద్దల శ్రీనివాస్, నాయకులు మాచారపు లక్ష్మణరావు, నందం ఈశ్వరరావు, విల్సన్ వై.రామ్మూర్తి, కొడిశాల రాములు, సూర్యనారాయణ, యు.నరసింహారావు, సత్రపల్లి సాంబశివరావు, హేమంతరావు, వెంకన్న, కార్మిక సోదరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అద్దె బస్సులకు టెండర్లు

- గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో 340 బస్సుల కోసం నోటిఫికేషన్
- జనవరి 3వ తేదీలోపు టెండర్లు దాఖలు చేయాలి
- అదేరోజు టెండర్ల ఖరారు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో 340 అద్దె బస్సులు కావాలని టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ టెండర్ల దాఖలుకు జనవరి 3వ తేదీ తుది గడువుగా నిర్ణయించారు. అదేరోజు సాయంత్రం టెండర్లు ఓపెన్ చేస్తారు. సికింద్రాబాద్, హైదరాబాద్ రీజియన్లలో నిర్దేశించిన రూట్లలో ఈ బస్సులు నడపాల్సి ఉంటుంది. మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు 91, సిటీ ఆర్డినరీ 20, సిటీ సబర్బన్ 162, సిటీ మఫిషిల్ 67 బస్సుల్ని అద్దెకు తీసుకుంటారు. 2023 భారత్ స్టేజ్-4, ఓబీడీ-2 లేదా ఆ తర్వాతి మోడల్ బస్సుల్ని పరిగణనలోకి తీసుకుంటారు. టీఎస్ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు ఈ టెండర్లలో పాల్గొనరాదని షరతు విధించారు. కిలోమీటర్ల లెక్కన బస్సులకు అద్దె చెల్లిస్తారు. మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సులకు కిలోమీటర్‌కు రూ.4.50 పైసలు, సిటీ సబర్బన్‌కు రూ.4.70 పైసలు, సిటీ ఆర్డినరీ మఫిషిల్‌కు రూ.5, పల్లెవెలుగుకు రూ.5.41 పైసలు చొప్పున చెల్లిస్తారు. మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులకు 8 సంవత్సరాల అగ్రిమెంట్ ఉంటుంది. తొలుత నాలుగేండ్లకే ఒప్పందం ఉంటుంది. ఆ తర్వాత బస్సు కండీషన్, ఇతర అంశాల అధారంగా రెండేండ్లకు ఒకసారి చొప్పున మరో నాలుగేండ్లు అగ్రిమెంట్‌ను పొడిగిస్తారు. సిటీ ఆర్డినరీ, సిటీ సబర్బన్, సిటీ మఫిషిల్ బస్సులకు 12 ఏండ్ల అగ్రిమెంట్ ఉంటుంది. వాటిని కూడా తొలుత నాలుగేండ్ల ఒప్పందం, ఆ తర్వాత బస్సు కండీషన్ ఇతర అంశాలను బట్టి రెండేండ్లకోసారి చొప్పున మరో 8 ఏండ్లు ఒప్పందాన్ని పొడిగిస్తారు. టెండర్‌లో పాల్గొనే వారు రూ.లక్ష ధరావతు చెల్లించాల్సి ఉంటుంది. సంస్థ వెబ్‌సైట్ http://tsrtc.telangana.gov.in లో ఇతర వివరాలు తెలుసుకోవచ్చు. ఆయా రూట్ల వివరాలను దీనిలో పొందుపర్చారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- ఎంపీల బహిష్కరణపై 'ఇండియా' నేతల ఆగ్రహం
- ఎంత విచ్ఛిన్నం చేయాలని చూస్తే ఇండియా అంత పటిష్టమవుతుంది : ఖర్గే
- 146 మందిని సస్పెండ్ చేసి 60శాతం ప్రజల గొంతు నులిమారు : రాహుల్
- బీజేపీ మళ్లీ గెలిస్తే అసలు పార్లమెంటు ఉంటుందా? : ఏచూరి ప్రశ్న
- ప్రజాస్వామ్య రక్షణకు ఎంతటి మూల్యానికైనా సిద్ధం : శరద్‌పవార్
- జంతర్ మంతర్ వద్ద ప్రతిపక్షాల నిరసన



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ దేశ చరిత్రలో తొలిసారిగా 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసిన నరేంద్ర మోడీ ప్రభుత్వ చర్యను ప్రతిపక్షాల ఫ్రంట్ 'ఇండియా' నేతలు తీవ్రంగా ఖండించారు. దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా.. బహిష్కరణకు గురైన ఎంపీలతో సహా ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన చేపట్టారు. రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఎన్సీపీ అధ్యక్షులు శరద్ పవార్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అధీర్ రంజన్ చౌదరి, డీఎంకె నేత తిరుచ్చి శివ, సీపీఐఎంఎల్ నేత భట్టాచార్య, జేఎంఎం నేత మహువా మాంఝీ, ఆప్ ఎంపీ సుశీల్ కుమార్ రింకు ఇతర ముఖ్య నేతలు ఈ నిరసనలో భాగంగా బీజేపీపై విరుచుకుపడ్డారు.

దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే సరైన పోరాటమనీ, కలిసి నిలబడితే మోడీ ఏమీ చేయలేరని ఖర్గే అన్నారు. "ఎంతగా విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తే, ఇండియా అంత పటిష్టమవుతుంది. భావ ప్రకటనా స్వేచ్ఛకు రాజ్యాంగం హామీ ఇచ్చింది. కానీ పార్లమెంటులో నోటీసు ఇచ్చినా.. చదవడానికి కూడా అనుమతించలేదు. రాజ్యసభ డిప్యూటీ స్పీకర్ జగదీప్ ధన్ ఖర్ రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించాలి' అని ఖర్గే విమర్శించారు.

ఎంపీలను బహిష్కరించి 60 శాతం ప్రజల గొంతును మోడీ అణచివేశారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. యువత నిరుద్యోగితను కూడా రాహుల్ ప్రస్తావించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఎంతటి మూల్యం చెల్లించడానికైనా సిద్ధమని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ స్పష్టంచేశారు.

ఇకపై పార్లమెంటు ఉంటుందా అనేదే సమస్య : ఏచూరి

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ.. ఎన్నికల్లో బీజేపీ మళ్లీ గెలిస్తే పార్లమెంట్ ఉంటుందా? లేదా? అన్నదే ప్రధాన ప్రశ్న అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే బీజేపీని గద్దె దించడం తప్పనిసరి అని చెప్పారు. ప్రజలు ఎన్నుకున్న ఎంపీలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాజ్యాంగ సారాన్ని మోడీ ధ్వంసం చేస్తున్నారు. బీజేపీని తరిమికొడతామని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామన్నారు.

డబ్బుంటేనే గెలుస్తామనే అపోహను పక్కనబెట్టండి

- సామాన్యుడూ ఎమ్మెల్యే కావొచ్చు
- నిర్దిష్ట లక్ష్యంతో కష్టపడితేనే గెలుపు
- ఎంత సంపాదించామన్నది కాదు..ఎంత పంచామన్నదే ముఖ్యం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల అలుమ్నీ మీట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డబ్బులుంటేనే రాజకీయాల్లో గెలుస్తామనే అపోహను పక్కన పెట్టాలని యువతకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూచించారు. నిత్యం ప్రజల మధ్యనే ఉండి సేవచేస్తే వారు తప్పకుండా ఆదరిస్తారన్నారు. ఇందిరమ్మ ఇంట్లో నివసించే సామాన్యుడూ ఎమ్మెల్యే కావొచ్చుననీ, అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని చెప్పారు. తాము పాలకులం కాదనీ, ప్రజా సేవకులమని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసం కలిసిరావాలనీ, ఈ విషయంలో అందరి సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు. దేశం మనదనీ, రక్షించుకోవాల్సిన బాధ్యత యువతదేనని పిలుపునిచ్చారు. పిల్లలంతా కష్టపడి చదవాలనీ, నిర్దిష్ట లక్ష్యం పెట్టుకుని ముందుకెళ్తే గెలుపు సాధ్యమని నొక్కి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాసంస్థలో మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) తొమ్మిదో వర్ధంతిని పురస్కరించుకుని అలుమ్నీ మీట్, గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. కాకా విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ప్రజల ఆశీర్వాదం, నిరుద్యోగుల పోరాటం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. నాలుగు కోట్ల ప్రజల ఆశీర్వాదంతో గెలిచామనీ, తమ పార్టీలో రాజకీయ ఉద్దండులున్నా యువతకు అవకాశమివ్వాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ, అధ్యక్షులు ఖర్గే తనకు సీఎం బాధ్యతలు అప్పగించారని తెలిపారు. తెలంగాణను అభివృద్ధి చేసే బాధ్యతను తన భుజాలపై పెట్టిన ప్రజలకు, కాంగ్రెస్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. వివేక్, వినోద్ రామాయణంలో లవకుశుల లాంటివారని కొనియాడారు. ఎంత సంపాదించామనేది కాదు.. సమాజానికి ఎంత పంచామనేది కాకా విధానమన్నారు. వెంకటస్వామి వర్ధంతి రోజు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం గొప్ప విషయమన్నారు. లాభాపేక్ష లేకుండా విద్యార్థులకు విద్యనందిస్తున్న ఘనత కూడా కాకా కుటుంబానికే దక్కుతుందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కాకా ముందున్నారనీ, ఢిల్లీలో కాంగ్రెస్ కార్యాలయానికి తన ఇంటినే ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటికీ కాంగ్రెస్ ఆఫీస్ కాకా పేరుతోనే ఉందన్నారు. దేశానికి గాంధీ కుటుంబం ఎలాగో..తెలంగాణకు కాకా కుటుంబం అలా అని కొనియాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు అండగా ఉంటామని భరోసానిచ్చారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గాడితప్పిన విద్యావ్యవస్థను తీర్చిదిద్దడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. విద్యార్థి ఉద్యమ కాలం నుంచి కాకాతో తనకున్న అనుబంధాన్ని ఆయన ఈ సందర్భంగా పంచుకున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..సింగరేణి బీఎఫ్ఐఆర్ పరిధిలోకి పోకుండా స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థగా ఎదగడంలో కాకా పాత్ర మరువలేనిదన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని బలంగా నమ్మిన నేతల్లో కాకా ఒకరన్నారు. పేదలకు కూడు, గూడు, కనీస సౌకర్యాలుండాలనే తపించిన నేత కాకా అని కొనియాడారు. ఎమ్మెల్యే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల చైర్మెన్ వివేక్ మాట్లాడుతూ..దేశంలో పెన్షన్, రేషన్ కార్డుల పథకాల రూపకల్పనలో కాకా పాత్రను వివరించారు. బీదలకు ఇండ్లు ఇప్పించాలనే, విద్య అందించాలనే తపన ఆయనలో బలంగా ఉండేదన్నారు. విద్యార్థులు కలలు కనాలనీ, సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.సరోజా వివేక్, ప్రజా గాయకులు విమలక్క, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి, రొనాల్డ్‌రాస్, పుష్పాల లక్ష్మీనారాయణ, అనిల్‌కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

చేసిన అప్పులు సరే.. సృష్టించిన ఆస్తులు చెప్పరా?

సీఎంకు దాసోజు శ్రవణ్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత ప్రభుత్వం చేసిన అప్పుల గురించి చెబుతున్న కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ సర్కార్ సృష్టించిన ఆస్తుల చిట్టాను మాత్రం చెప్పడం లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ దాసోజు శ్రవణ్ విమర్శించారు. శుక్రవారం ఆయన ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజలకు భరోసా కల్పించకపోగా గత ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసేందుకు సమయం కేటాయిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందన్నట్టుగా శ్వేతపత్రం మూడో చాప్టర్‌లో పొందుపరచడమనేది తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన ఆంధ్రా నాయకుల ఆలోచనా విధానమేనని విమర్శించారు. అదే నిజమైతే తెలంగాణ ఏర్పాటుకు సోనియా గాంధీ ఎందుకు తోడ్పడ్డారని? ఆయన ప్రశ్నించారు.

వేములవాడ వెళ్తూ..

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- ఏటూరు నాగారంలో మిన్నంటిన రోదనలు





(ఫైల్)

నవతెలంగాణ ఏటూరునాగారం ఐటీడీఏ/ఎల్కతుర్తి

వేములవాడ దైవదర్శనం కోసం వెళ్తుండగా రహదారిపై ఇసుక లారీ ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. మరో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం శాంతినగర్ (పెంచికలపేట) ప్రధాన రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగింది.ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన మంతెన శంకర్(55) కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య శ్రీదేవి, కుమారులు భరత్ (30) టీఎస్ఎండీసీ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తుండగా, రెండో కుమారుడు భార్గవ్ వాజేడులోని రెవెన్యూ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అలాగే మండల కేంద్రానికి చెందిన మంతెన కాంతయ్య (65) కంసాలి పనిచేస్తూ కుటుంబాన్ని సాకుతున్నాడు. అతడి భార్య మంతెన రేణుక.. ఈ దంపతులకు చాలా కాలం తర్వాత కూతురు రాధిక చందన (13) జన్మించింది. ఈమెను పాఠశాలకు కూడా చాలా ఆలస్యంగా పంపించారు. అయితే శంకర్ పెద్ద కుమారుడు భరత్ అయ్యప్పస్వామి మాలధరించడంతో మేడారం జాతర ముందు శ్రీరాజరాజేశ్వరి దర్శించుకోవడం కోసం వెళ్తున్నారు. కాగా, భరత్‌కు డ్రైవింగ్ రావడంతో తన పెద్దమ్మ కొడుకు కారు తీసుకొని దానిలో కుటుంబసభ్యులంతా గురువారం రాత్రి 8 గంటల సమయంలో ఏటూరునాగారం నుంచి వేములవాడకు బయలుదేరారు. ఏటూరునాగారం నుంచి కారులో హన్మకొండ చేరుకొని అక్కడ షాపింగ్ చేసుకొని వేములవాడ హైవేలో వెళుతుండగా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఎల్కతుర్తి మండలం శాంతినగర్(పెంచికలపేట) వద్ద ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ఇసుక లారీ కారును ఢీ కొట్టింది. దాంతో కారు నుజ్జు నుజ్జునుజ్జు కాగా డ్రైవింగ్ సీట్‌లో భరత్‌తో పాటు శంకర్, కాంతయ్య, రాధిక చందన అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు మంతెన శ్రీదేవి, మంతెన రేణుక, మంతెన భార్గవ్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. కాగా స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకొని.. కారులో ఉన్న క్షతగాత్రులను జేసీబీతో బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకి తరలించారు. దైవదర్శనానికి వెళుతూ జరిగిన సంఘటనతో బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గోదారి రాజకుమార్ తెలిపారు. కాగా, మంత్రి సీతక్క క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

దేశ రక్షణను మోడీ గాలికొదిలేశారు

ప్రజాస్వామ్య రక్షణ కోసం పోరాటం తప్పదు

- ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తేయాలి : ఇండియా కూటమి ధర్నాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశ రక్షణను ప్రధాని మోడీ గాలికొదిలేశారని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. ఈ క్రమంలో ఇండియా కూటమి తరపున ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం చేస్తామని తెలిపారు. పార్లమెంటుపై అగంతకులు దాడి చేసిన అంశాన్ని లోక్‌సభలో చర్చించాలంటూ ప్రశ్నించిన ఎంపీలను మోడీ సర్కారు అప్రజాస్వామికంగా సస్పెండ్ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారి సస్పెన్షన్‌ను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటుపై దాడి చేయడమంటే, ప్రజాస్వామ్యంపైన, రాజ్యాంగంపైన జరిగిన దాడిగానే భావించాలని చెప్పారు. పార్లమెంట్‌ను రక్షించుకోలేని బీజేపీ పాలకులు ఈ దేశాన్ని ఏం కాపాడుతారని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు పార్లమెంటులో ఇండియా కూటమి ఎంపీలను అప్రజాస్వామికంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఆ ఘటనపై ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభలో సభ్యులు అడిగిన దానికి సమాధానం చెప్పకుండా వారిని సస్పెండ్ చేశారని విమర్శించారు. ఈ దాడితో ప్రపంచ దేశాల్లో భారత దేశ విలువ ఎంత దిగజారిందనేది ఆలోచించాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 13న పార్లమెంటుపై దాడి జరిగితే ఇప్పటి వరకు ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రులు మౌనంగా ఉన్నారని విమర్శించారు. అసలేం దాడి జరగలేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. దేశ చరిత్రలో కనీవిని ఎరగని విధంగా లోక్‌సభ నుంచి 146 మంది సభ్యులను సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే కేసులు, పార్లమెంట్ నుంచి బహిష్కరణ... స్వేచ్ఛ, భావ ప్రకటన లేకుండా నియంతృత్వ పోకడలతో మోడీ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు దేశ సరిహద్దుల్లో ఏదో ఒక సంఘటన సృష్టించి దేశ ప్రజల్లో భావోద్వేగాన్ని రగిలించి అధికారంలోకి రావడం తప్ప ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలనే ఆలోచన బీజేపీకి లేదన్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సోనియా, అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీ వంటి అగ్రనేతలు రోడ్లపైకి వచ్చి ఈ దేశం కోసం మేమున్నామంటూ భరోసా కల్పించారని తెలిపారు. మీ కోసం నిలబడతామంటూ వారు ప్రజలకు బాసటగా నిలుస్తున్న విషయాన్ని గుర్తించాలని కోరారు. భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటంలో దేశభక్తులు, ప్రజాస్వామికవాదులు, అభ్యుదయవాదులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇది అంబేద్కర్ గుండెపై దాడి
మోడీ, అమిత్‌షాపై కూనంనేని ఆగ్రహం

పార్లమెంట్ మీద దాడి జరగడమంటే అంబేద్కర్ గుండెపైన దాడి జరిగినట్టేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. దాడికి కారణమేంటని ప్రశ్నిస్తే...మోడీ, అమిత్‌షా హిట్లర్, ముస్సోలినిలా ప్రవర్తించారని విమర్శించారు. పార్లమెంటుపై దాడికి పాల్పడిన అగంతకులకు బీజేపీ ఎంపీ పాస్ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన్ను ఏమైనా సస్పెండ్ చేశారా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీని ఏం చేశారని ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేశారని నిలదీశారు. తృణముల్ ఎంపీ ప్రశ్నిస్తే సభ్యత్వం రద్దు చేస్తారా? అని నిలదీశారు. మోడీ తప్పులను ఎండగట్టడం కోసం కలిసి నడుద్దామంటూ పిలుపునిచ్చారు. అగంతకుల దాడి మీద ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నాయన్న నేపథ్యంలో ఈ విషయంలో కావాలనే బీజేపీ కుట్ర చేస్తున్నదని ఆరోపించారు.

బీజేపీ సమాధానం చెప్పాల్సిందే..! : కోదండరాం

పార్లమెంట్ ఘటనపై బీజేపీ సమాధానం చెప్పాల్సిన అవసరముందని టీజేఎస్ అధ్యక్షులు కోదండరాం అన్నారు. కీలకమైన బిల్లులపై చర్చ జరుగుతుంటే, అందరిని బయటికి పంపించి బలవంతంగా వాటిని ఆమోదింప చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే విపక్ష సభ్యులను సభలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ కోఆర్డినేటర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ విపక్ష పార్టీలను ఏకం చేసినందుకు మోడీకి కృతజ్ఞతలు చెబుతున్నానని ఎద్దేవా చేశారు. ముమ్ముందు ఇండియా కూటమి రాజ్యమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని పుల్వామా దాడులు జరిగే అవకాశం ఉందని అనుమానం వ్యక్తంచేశారు. రామమందిరం పేరిట బీజేపీ రానున్న ఎన్నికల్లో గెలువాలనుకుంటుందని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో పొగ బాంబులు వేస్తే ప్రధాని మోడీ ఇంతవరకు సమాధానం చెప్పలేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా బీజేపీ పునాదులు కదలబోతున్నాయని హెచ్చరించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బీజేపీ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లురవి, ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, నాగరాజు, విజయరమణా రావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఊపర్ షేర్వానీ.. అందర్ పరేషానీ..!

ధనమూలమిదం జగత్!' అన్నారు పెద్దలు. ఇప్పుడు ఇదే ధనం ఒక పార్టీకి ఇంధనంలా ఉపయోగపడి ప్రజల్లో మైలేజ్ తెస్తుంటే, మరో పార్టీని ఇరకాటంలో పెడుతోంది. రాష్ట్ర శాసనసభలో ఇటీవల కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం గత పదేండ్ల ఆర్థిక స్థితిగతులపై వెలువరించిన శ్వేతపత్రం పాలకుల గత లోపభూయిష్టమైన ఆర్థిక విధానాలను ఎత్తి చూపింది. తన తొమ్మిదిన్నరేండ్ల ఏలుబడిలో బీఆర్ఎస్ సర్కార్ మొదటి రెండు మూడేండ్లు తెలంగాణను మిగులు రాష్ట్రంగా చెప్పుకుంటూ వచ్చింది. ఆ తర్వాత ఆ స్వరం మరింత పెరిగి 'మనది ధనిక రాష్ట్ర'మంటూ గొప్పలకు పోయింది. ఇలాంటి గొప్పలకు పోయి తెలంగాణను అప్పులకుప్పగా మార్చి తిప్పలు తెచ్చుకోవద్దంటూ ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు చెబుతున్నప్పటికీ పట్టించుకోకుండా 'అభివృద్ధి కోసం బరాబర్‌గా అప్పులు చేసి తీరతా'మంటూ నాటి గులాబీ ప్రభుత్వం చట్టసభల సాక్షిగా బల్లగుద్ది మరీ చెప్పింది. నిన్న కూడా ఆస్తులు పెంచుకోవడానికే అప్పులు చేశామని ఒక మాజీ మంత్రి 'ఇటువైపు' బల్లగుద్ది ఇంకోసారి చెప్పాడు.

> గత బీఆర్ఎస్ సర్కార్ మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ సర్కారుకు కూడా ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టటం, సంక్షేమ పథకాలను పక్కాగా అ మలు చేయటం, అభివృద్ధిని కుంటుపడకుండా చూడటమనేది అంత ఆషామాషీ కాదు. ఈ క్రమంలో ఆర్థిక స్థితిగతులపై శ్వేత పత్రాన్ని ప్రజల ముందు ఉంచిన రీతిలోనే... త్వరితగతిన అఖిల పక్షాన్ని ఏర్పా టు చేయటం ద్వారా వాస్తవ స్థితి గతులను ప్రజలకు వివరించాలి. ఒక తరగతినో, ఒక సెక్షన్‌నో సంతృప్తి పరచటానికి కాకుండా సమస్యలు, ప్రాధాన్యతల ఆధారంగా సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన జరగాలి.

ఈ క్రమంలో 'శ్వేతపత్రం' రూపంలో వెలువడ్డ ఆర్థిక స్థితిగతి...మన భవిష్యత్తు ఆందోళనకరంగా మారనుందని చెప్పకనే చెప్పింది. తెలంగాణ నెత్తిమీద మొత్తం రూ. 6,71,757 కోట్ల అప్పులున్నట్టు అది విశదీకరించింది. 2014-15లో రూ.72,658 కోట్లుగా ఉన్న రుణ భారం.. ఈ పదేండ్ల కాలంలో సుమారు పదింతలు పెరగటంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. పదేండ్ల కాలంలో ప్రభుత్వం ఖర్చు చేసిన డబ్బుకు అనుగుణంగా ఎలాంటి స్పష్టమైన ఆస్తులను సృష్టించలేదని శ్వేతపత్రం తేటతెల్లం చేయటం ఇక్కడ గమనార్హం. మరోవైపు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ ప్రతిపాదించిన బడ్జెట్లకు, వాస్తవ వ్యయానికి మధ్య దాదాపు ఇరవై శాతం అంతరముండటం సర్కారు వారి మాటల డాంబికాన్ని బట్టబయలు చేసింది. రాష్ట్ర రెవెన్యూ రాబడిలో దాదాపు ముప్పై ఐదు శాతం ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల కోసం వినియోగించాల్సి రావటంతో పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలకు కొంత వెసులుబాటు తగ్గింది. వేల కోట్ల రూపాయల వ్యయమయ్యే భారీ ప్రాజెక్టులపైన్నే పాలకుల దృష్టి ఉండటంతో ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు, హాస్టల్ విద్యార్థుల మెస్ బిల్లులు, ఆర్టీసీ, విద్యుత్ రాయితీలు, పంచాయతీల్లో చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా వాయిదా వేస్తూ వచ్చారు. పెరిగిన ఆర్థిక ఒత్తిడి ఫలితంగా రాష్ట్రంలో ప్రతీరోజూ ఆర్బీఐ కల్పించే 'వేస్ అండ్ మీన్స్'పై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొందని శ్వేతపత్రం పేర్కొంది. 2014లో రాష్ట్రం మొత్తం వంద రోజులకు వంద రోజులు సానుకూల బ్యాలెన్సులు కలిగున్న స్థితి నుంచి పది శాతం కంటే తక్కువ రోజులకు ఆ స్థితి పడిపోయిన వైనాన్ని ఆ పత్రం విశదీకరించింది.



ఇది ఇప్పటి వరకూ జరిగిన కథ. ఇక ఇప్పటి నుంచి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం... అందుకనుగుణంగా ఎలాంటి చర్యలు చేపడుతుందనేది కీలకం. ముఖ్యంగా బడ్జెట్‌లో సింహభాగం ఎన్నికల్లో హామీనిచ్చిన ఆరు గ్యారెంటీలకే సరిపోతుందనేది నిపుణుల అంచనా. ఏడాదికి సాలీనా రూ.70 వేల కోట్ల మేర వీటికి ఖర్చు చేయాల్సి వస్తుందంటూ కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ లెక్కలేసుకుంది. కానీ అంతకు మించి వ్యయమవుతుందనేది ఆర్థికశాఖ వర్గాల వాదన. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు కోసం ఏడాదికి రూ.15 వేల కోట్లను ఖర్చు చేసింది. ఇప్పుడు రేవంత్ సర్కార్... ఆ పథకం కింద ఆర్థిక సాయాన్ని పెంచి ఇవ్వాల్సి ఉన్నందున ఏడాదికి సుమారుగా రూ.20 వేల నుంచి రూ.25 వేల కోట్ల వరకూ అందుకోసం వెచ్చించాల్సి ఉంటుంది. రూ.500కే గ్యాస్ సిలిండర్ స్కీమ్ కోసం రూ.400 కోట్లు వ్యయమవుతుందని సమాచారం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం నెలకు దాదాపు రూ.90 కోట్ల చొప్పున ఏడాదికి రూ.1,080 కోట్లు అవసరమవుతాయన్నది ప్రభుత్వ వర్గాల అంచనా. ఇవిగాక రాష్ట్రంలోని 90 లక్షల మంది మహిళల (తెల్లరేషన్ కార్డులున్న వారు)కు నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం, నిరుద్యోగభృతి అనేవి హస్తం పార్టీ మ్యానిఫెస్టోలో కీలకంగా ఉన్నాయి.

అందువల్ల గత బీఆర్ఎస్ సర్కార్ మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ సర్కారుకు కూడా ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టటం, సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేయటం, అభివృద్ధిని కుంటుపడకుండా చూడటమనేది అంత ఆషామాషీ కాదు. ఈ క్రమంలో ఆర్థిక స్థితిగతులపై శ్వేత పత్రాన్ని ప్రజల ముందు ఉంచిన రీతిలోనే... త్వరితగతిన అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయటం ద్వారా వాస్తవ స్థితిగతులను ప్రజలకు వివరించాలి. ఒక తరగతినో, ఒక సెక్షన్‌నో సంతృప్తి పరచటానికి కాకుండా సమస్యలు, ప్రాధాన్యతల ఆధారంగా సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన జరగాలి. ఆ ప్రక్రియలో సామాజిక విలువ(సోషల్‌వాల్యూ) ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే పరిస్థితి మళ్లీ మొదటికొస్తుంది. 'ఊపర్ షేర్వానీ.. అందర్ పరేషానీ...' అనే తరహాలో.



రైతక్క

ఎన్ను ఇరిగేలా యవ్వసం ఎత్తుకొని
శ్రమను శెరిగి కుప్పజెయ్య
మట్టి పూసుకున్న
సెమట సుక్కల సందమామలు,

ఎకరాల అరక మోస్తూ
ఎండిన దుక్కి తిరుగ
కాయలు గాసిన చేతులతో
మట్టిలో ముత్యాలు తీసే యంత్రలైతారు,

నాలుగాకేళ్ల నడిసిన
పూటమెయ్య పురుగు దొరకక
అయితదో లేదోనని
అల్లర వేట్టుకునే అవనిలు,

కలుపుదీసి,
పసుపాకులో పాశం బువ్వై
కొమ్ము ఇరిసి,
బందారిలో బురుక పిట్టలైతారు,

నోటి కచ్చిన పంట మీద
కాలం ఎద్దు కాలుకు కర్రు వడ్డట్టు జేస్తే
ఆగని దు:ఖపు సురు దారాలను
కొంగుతోని అద్దుతు
అరిద్రపురుగై ఇంకో పంటకు
ఆశ పెట్టుకుంటారు,

గునుక పువ్వు కార్తెను
కోసి, వొట్టి, ఒకతాటేసి
వొలిసిన పైసలకు
పెట్టువడికి తెచ్చిన అప్పు ముట్టి
చంద్రవంక పున్నమైతే
నిమ్మరసం తాగినంత నిమ్మలమైతారు,

ఈ రోజుల్లో
కష్టమంతా రైతక్కలదే
గెట్టు మీద తెల్ల కొంగలై కూసుండి
జై కొట్టిపిచ్చుకుంటున్నోల్లే మిగతా అంత,
జై రైతక్క.. జైజై రైతక్క..

- జి.యం.నాగేష్ యాదవ్,
9494893625

మనస్మృతిపై మనుస్మృతి దాడి

మన స్మృతిని అంటే మన రాజ్యాంగాన్ని అంతం చేసి దాని స్థానంలో అత్యంత క్రూరమైన మనుస్మృతిని ప్రతిష్ఠించాలని ఆర్ఎస్ఎస్, హిందూత్వ శక్తులు బీజేపీ రూపంలో చేయని ప్రయత్నమంటూ లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే నేడు దేశ రాజకీయాల్లో కీలక అంశం మనస్మృతికి మనుస్మృతికి మధ్య జరుగుతున్న పోరాటమేనని చెప్పాల్సి వుంటుంది. బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా రెండు వందల ఏండ్లు పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యం మనది. తెల్లవాడి పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఆ మహత్తర పోరాటం, అనివార్యంగా మనదేశంలో తర తరాలుగా చలామణి అవుతున్న సాంఘీక దోపిడీపై పోరాటానికి అణగారిన ప్రజలను ఉత్తేజపరిచింది. అమానుషమైన కులవ్యవస్థను శతాబ్దాలపాటు నిలబెట్టిన మనువాదంపై దాని భౌతిక రూపమైన బ్రాహ్మణ సమాజం (చాతుర్వర్ణ వ్యవస్థ)పై పోరాటాలు 1920 నుండి పెద్దఎత్తున ప్రారంభం అయినాయి. ఈ పోరాటాల లక్ష్యాలకు ప్రతిరూపమే భారత రాజ్యాంగం. ఈ ప్రక్రియకు జరిగిన కృషిలో కీలకఘట్టం 1927 డిసెంబరు 25న మహద్ పట్టణంలో డా|| అంబేద్కర్ మనుధర్మ శాస్త్ర ప్రతులను వేలాది మంది సమక్షంలో తగులబెడట్టడం.

> ఆర్ఎస్ఎస్ రెండవ అధినాయకుడు, వారి సిద్ధాంతకర్త అయిన గోల్వాల్కర్ "మనువు మానవ చరిత్రలో మొట్ట మొదటి అత్యంత తెలివైన, మహోన్నతుడైన న్యాయకోవిదుడు" అని ప్రశంసించాడు హిందూత్వ సిద్ధాంతకర్త సావర్కర్ "హిందూ జాతికి సంబంధించినంత వరకు వేదాల తరువాత అత్యంత పూజనీయమైనది మనుస్మృతి. పురాతన కాలం నుండి మన దేశ సంస్కృతికి, సాంప్రదాయాలకు, తాత్విక ఆలోచనలకు, ఆచరణకు అది పునాది. మన దేశాన్ని తరతరాలుగా నడిపిస్తున్న ఆధ్యాత్మిక, పూజనీయమైన చట్టం అది. నేటికీ మనువు రూపొందించిన నియమాలు కోటాను కోట్ల మంది హిందువుల జీవితాలను ప్రభావితం చేస్తున్నది. అందువలన మనుస్మృతి అనేది హిందువుల చట్టం" అని స్పష్టంగా తేల్చి చెప్పాడు.

'మనుస్మృతి దహన్ దివస్'

1923లో బాంబే శాసనసభ అంటరానివారికి పబ్లిక్ చెరువులు, బావులు, బడులు, వైద్యశాలలు, కోర్టులలోనూ ప్రవేశించడానికి అనుమతిస్తూ తీర్మానం చేసింది. దీనికి కారణం 1920 దశాబ్దంలో కేరళ, తమిళనాడు, ఆంధ్ర, పంజాబ్, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు పెద్దయెత్తున ప్రారంభమయ్యాయి. శూద్రులకు, అతి శూద్రులైన అంటరాని తరగతుల అశేష జనానికి ఆలయ ప్రవేశం, తాగునీరు అందరితో సమానంగా పొందేందుకు పెద్ద ఉద్యమాలు జరిగాయి. ఈ నేపథ్యంలో పై తీర్మానం విడుదలైంది. మహారాష్ట్రలోని మహద్ మున్సిపాలిటీ తీర్మానం చేసినప్పటికీ దాన్ని అమలు చేయలేదు. ఈ నేపథ్యంలో 1927 మార్చి నెలలో అంబేద్కర్ అధ్యక్షతన మహద్‌లో రెండు రోజుల సభ జరిగింది. మూడు వేల మంది హాజరైన ఆ పట్టణంలోని ఉమ్మడి చెరువులో నీళ్ల తాగాలని చేసిన నిర్ణయంపై అగ్రవర్ణాలు దాడి చేశాయి. అనేక మంది గాయపడ్డారు. ఈ పరిస్థితులలో చెరువు వద్దకు వారు చేరుకోలేకపోయారు. వెంటనే పట్టణంలోని బ్రాహ్మణుల నాయకత్వాన చెరువు దగ్గరికి చేరి 108 కుండల ఆవు పేడ, మూత్రంతో పాటు పాలు, పెరుగు కలిపి శుద్ధి చేశారు. ఇది జరిగిన కొద్ది నెలలలోనే అంబేద్కర్ తిరిగి అదే పట్టణంలో అదే చెరువు వద్ద సత్యాగ్రహానికి పిలుపునిచ్చారు. ఈసారి పదివేల మందికి పైగా పోగయ్యారు. వారి సమక్షంలో డిసెంబర్ 25న మనుస్మృతి పత్రాలను డా||అంబేద్కర్ బహిరంగంగా తగులబెట్టడం జరిగింది. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పెద్దలారా... మహద్ లోని ఈ చెరువు నిజానికి ప్రజల ఆస్తి. ఈ పట్టణంలోని హిందూ అగ్రకుల పెద్దలు, వారితో పాటు ముస్లింలకు, అనుమతిచ్చారు. గొర్రెలకు, మేకలకు, బర్రెలకు తాగేందుకు అనుమతిచ్చారు. కాని అస్పృశ్యులమనే పేరిట మనకు అనుమతి వ్వలేదు. మనం తాగితే చెరువు ఎండిపోతుందని కాదు వారి బాధ. పవిత్రమైన వారితో తక్కువ జాతి వాళ్లమైన మనం సమానమన్నది రాకుడదన్నదే వారి కోరిక. అలాగే ఈ చెరువులో నీళ్ల తాగినంత మాత్రాన మనం అమరులైపోము. ఈ చెరువులో నీళ్ల తాగకుండానే దశాబ్దాలుగా మనం బతికే వున్నాం. అయితే మనం చెప్పాలనుకున్నది కూడా వారి లాగానే మనం కూడా మనుషులం. ఈ చర్య ద్వారా సమానత్వమనే ఒక సూత్రాన్ని మనం తేటతెల్లం చేయదల్చుకున్నాం. అంటరాని తనమనేది చిన్న విషయం కాదు. మనం నేడు చేరుకున్న ఈ స్థితికి కారణమైన పేదరికం, తక్కువ వారమనే దానికి తల్లివంటిది ఈ అంటరాని తనం. దీన్నుంచి బయట పడాలంటే ఇలా చేయక తప్పదు. ఇది మన ప్రయోజనం కోసం మాత్రమే కాదు. ఇది మొత్తం జాతి ప్రయోజనానికి దోహదపడుతుంది". అని ఆయన ప్రకటించారు. ఆ విధంగా ఆయన నాయకత్వాన ఇతర రాష్ట్రాలలో అనేక మంది సంఘ సంస్కర్తల నాయకత్వాన సాగిన ఆ పోరాటాలు అంబేద్కర్ అన్నట్లు మన దేశంలో ఓ సామాజిక విప్లవానికి నాంది పలికాయి. అంటరానితనాన్ని నిర్మూలించటం మాత్రమే కాదు. భారత సమాజాన్ని విప్లవాత్మకంగా సమానత్వం, సౌభ్రాతృత్వ, స్వేచ్ఛలపై పునర్ నిర్మించడానికి ఈ పోరాటాలు దోహదం చేస్తాయి.



ఆర్. రఘు
9490098422

మనుధర్మ శాస్త్రం కొన్ని వేల ఏండ్లుగా భారత సమాజాన్ని అత్యంత తీవ్రమైన అసమానతలలో కూడిన వ్యవస్థగా రూపొం దించింది. దీన్నే "ద్వారం లేని, మెట్లు కూడా లేని ఒంటి స్థంభం మిద్దె. ఏ అంతస్థులో పుట్టిన వాడు ఆ అంతస్థులోనే చావాలి." అన్న టువంటి వ్యవస్థ అని అంబేద్కర్ పేర్కొన్నారు. మార్క్సిస్టు మేధావి ఈఎంఎస్ నంబూద్రిపాద్ కూడా ఈ వ్యవస్థను ఓ నిచ్చెన వంటిదిగా తన గ్రంథం వేదభూమిలో అభివర్ణించారు. అటువంటి వ్యవస్థను కూల్చడం దాని స్థానంలో జాతి, వర్ణ, కుల భేదాలు లేని సమసమాజాన్ని నిర్మించడానికి ఈ ఉద్యమాలు ప్రేరేపిస్తున్నాయి.

మలుపు తిప్పిన దశకం

1920-30ల మధ్య మన స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అనేక కీలకమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆ తరువాత జరిగిన చరిత్ర యావత్తుపై ఈ పరిణామాల ప్రభావమే కీలకం. 1917 రష్యాలో జయప్రదమైన కార్మికవర్గ మహావిప్లవం అది సృష్టించిన సోషలిస్టు వ్యవస్థ పర్యవసానంగా 1920లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. భారత కార్మిక వర్గం అఖిల భారత స్థాయిలో ఏఐటీయూసీని ఏర్పాటు చేసుకుంది. బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు ఉవ్వెత్తున లేచాయి. 1919 జలియన్ వాలాబాగ్ మారణకాండపై ఉగ్రులైన భారత ప్రజలు వివిధ రూపాల్లో తిరగబడ్డారు. ఇవి గమనించిన గాంధీజీ నాయకత్వాన కాంగ్రెస్ పార్టీ సహాయ నిరాకరణకు పిలుపునిచ్చింది. మరోపక్క టర్కీలో ఖలీఫా ప్రభుత్వాన్ని కూలదోయటానికి పూనుకుంటున్నదని బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి ఖిలాఫత్ ఉద్యమం ప్రారంభమైంది. బ్రిటీషు పాలకులు ఈ ఘటనలతో ఒంటరైపోయారు. ఉక్కిరి బిక్కిరయ్యారు. ఈ నేపథ్యంలో పుట్టిన కుక్కమూతి పిందె 'రాష్ట్రీయ' స్వయం సేవక్ సంఘ్'. 1925లో పుట్టిన ఆర్ఎస్ఎస్ ఏర్పాటుకి వున్న మూడు లక్షణాల్లో ఒకటి బ్రిటీష్ సామ్రాజ్యానికి అండగా నిలబడటం. అంటే స్వతంత్ర పోరాటానికి వెన్నుపోటు పొడవడం. నాడు నేడు కూడా వారు స్వాతంత్ర్య పోరాటాన్ని ఒక ఫేక్ పోరాటంగా అభివర్ణిస్తూంటారు. స్వాతంత్ర్య పోరాటం పేరిట జరుగుతున్న ఆ పోరాటంలో హిందూ యువకులు తమ శ్రమను వృథా చేసుకోవద్దని, ఈ దేశం నుండి ముస్లింలను, క్రైస్తవులని గెంటేసేందుకు రానున్న కాలంలో పోరాడాల్సి వుంటుందని, అది నిజమైన స్వాతంత్ర్య పోరాటమని నిస్సిగ్గుగా వారు ప్రకటించారు. ఇక రెండవది. ఇటలీ, జర్మనీలో లాగా ఒక ఫాసిస్టు రాజ్యాన్ని భారత దేశంలో నిర్మించాలన్నది వారి లక్ష్యం. జర్మనీలో హిట్లర్ పది లక్షలకి పైగా యూదులను, ఇతర జాతులను సమూలంగా నిర్మూలించి ఎలాగైతే ఆర్య రక్త పవిత్రతను కాపాడాడో, ఆ విధంగా మన దేశంలో కూడా హిందూ జాతి పవిత్రతను కాపాడి నాజీ తరహా హిందూత్వ



రాజ్యాన్ని నిర్మిస్తామని నాటి నుంచి చెబుతూనే వున్నారు. మూడవది.1920లో ప్రారంభమైన కుల వ్యవస్థకి వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రజా చైతన్యాన్ని అణచి మరల మన దేశంలో బ్రాహ్మణాధిక్య సమాజాన్ని అంటే చాతుర్వర్ణ వ్యవస్థను నిర్మించాలని, అందుకు మనుస్మృతే ఆదర్శంగా తీసుకోవాలన్నది వారి కోరిక.

ఆర్ఎస్ఎస్ రెండవ అధినాయకుడు, వారి సిద్ధాంతకర్త అయిన గోల్వాల్కర్ "మనువు మానవ చరిత్రలో మొట్టమొదటి అత్యంత తెలివైన, మహోన్నతుడైన న్యాయకోవిదుడు" అని ప్రశంసించాడు హిందూత్వ సిద్ధాంతకర్త సావర్కర్ "హిందూ జాతికి సంబంధించి నంత వరకు వేదాల తరువాత అత్యంత పూజనీయమైనది మను స్మృతి. పురాతన కాలం నుండి మన దేశ సంస్కృతికి, సాంప్రదా యాలకు, తాత్విక ఆలోచనలకు, ఆచరణకు అది పునాది. మన దేశాన్ని తరతరాలుగా నడిపిస్తున్న ఆధ్యాత్మిక, పూజనీయమైన చట్టం అది. నేటికీ మనువు రూపొందించిన నియమాలు కోటాను కోట్ల మంది హిందువుల జీవితాలను ప్రభావితం చేస్తున్నది. అందువలన మనుస్మృతి అనేది హిందువుల చట్టం" అని స్పష్టంగా తేల్చి చెప్పాడు.

> 1927 మార్చి నెలలో అంబేద్కర్ అధ్యక్షతన మహద్‌లో రెండు రోజుల సభ జరిగింది. మూడు వేల మంది హాజరైన ఆ పట్టణంలోని ఉమ్మడి చెరువులో నీళ్లు తాగాలని చేసిన నిర్ణయంపై అగ్రవర్ణాలు దాడి చేశాయి. అనేక మంది గాయపడ్డారు. ఈ పరిస్థితులలో చెరువు వద్దకు వారు చేరుకోలేక పోయారు. వెంటనే పట్టణంలోని బ్రాహ్మణుల నాయకత్వాన చెరువు దగ్గరికి చేరి 108 కుండల ఆవు పేడ, మూత్రంతో పాటు పాలు, పెరుగు కలిపి శుద్ధి చేశారు. ఇది జరిగిన కొద్ది నెలలలోనే అంబేద్కర్ తిరిగి అదే పట్టణంలో అదే చెరువు వద్ద సత్యాగ్రహానికి పిలుపునిచ్చారు. ఈసారి పదివేల మందికి పైగా పోగయ్యారు. వారి సమక్షంలో డిసెంబర్ 25న మనుస్మృతి పత్రాలను డా||అంబేద్కర్ బహిరంగంగా తగులబెట్టడం జరిగింది.

భారత రాజ్యాంగం రాజ్యాంగ సభలో ప్రవేశపెట్టిన (26 నవంబర్ 1949) నాలుగో రోజు 30నవంబర్1949న ఆర్ఎస్ఎస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' రాజ్యాంగంపై దుమ్మెత్తి పోసింది. "ఈ రాజ్యాంగంలో భారతీయత గురించి ఏమీ లేకపోవడం దౌర్భాగ్యం. ఇది అనేక దేశాల రాజ్యాంగాల నుంచి తీసుకున్న అతుకులబొంత. ఇది హిందువులకి ఆమోదయోగ్యం కాదు. మనుస్మృతే నిజమైన మన రాజ్యాంగం" అని రాసింది.

మనుస్మృతిని పాతరెయ్యాలి

డా|| బి.ఆర్.అంబేద్కర్ మనుస్మృతిని తగులబెట్టి దాదాపు వంద ఏండ్లు గడిచాయి. స్వాతంత్ర్యానంతరం అధికారంలో కొచ్చిన భారత పాలకులు విస్పష్టమైన ప్రజాతంత్ర, లౌకిక, సోషలిస్టు రాజ్యాంగం రూపొందించబడి వున్నా తమ వర్గ ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని అమలు చేయడంలో జరిగిన వైఫల్యాలే మనువాదులు పుంజుకోవడానికి దోహదం చేశాయనడంలో తప్పులేదు. ఇప్పటికే కాంగ్రెస్‌తో సహా బూర్జువా లౌకిక పార్టీలు రోజురోజుకీ బలపడుతున్న హిందూత్వశక్తులను తుదముట్టించడానికంటే బీజేపీని రాజకీయంగా ఎన్నికల్లో ఓడిస్తే సరిపోతుదన్నట్టుగా అలోచిస్తున్నారు తప్ప హిందూత్వ శక్తుల ప్రాబల్యాన్ని లౌకిక ప్రజాతంత్ర సిద్ధాంతాల బలంతో ఎదుర్కోవాలని అనుకోకపోవడం దురదృష్టకరం. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నిల్లో కూడా ప్రధానంగా కాంగ్రెస్ మధ్యప్రదేశ్‌లో, రాజస్థాన్‌లో, ఛత్తీస్‌గఢ్‌లో మృదు హిందూత్వ ధోరణిని ప్రదర్శించడం ఓ పెద్ద ఉదాహరణ. అలాగే ఎన్‌డీఏకి వ్యతిరేకంగా ఏర్పడిన 'ఇండియా' కూటమిలో కూడా వివిధ రాష్ట్రాలలో అధికారం చెలాయిస్తున్న పార్టీలు హిందూత్వ సిద్ధాంతాన్ని తుద ముట్టించడానికి స్పష్టమైన లౌకిక ప్రజాతంత్ర వైఖరులు తీసుకోకపోవడం విచారకరం. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీలు, వామ పక్ష, ప్రజాతంత్ర శక్తులను కూడదీసి లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి పూనుకోవటంలో నాయకత్వ పాత్ర తీసుకోవాల్సి వుంటుంది. అంబేద్కర్ రచించిన (ఆయన ఉపన్యాసం) కుల నిర్మూలనకు మేధావి అరుంధతీరాయ్ అన్నట్టు 'విప్లవకారులుగా చెప్పుకుంటున్న వారు బ్రాహ్మణత్వంపై విమర్శకు పదునుపెట్టాలి. అలాగే బ్రాహ్మణత్వానికి వ్యతిరేకంగా పోరాడేవారు పెట్టుబడిదారి వ్యవస్థపై విమర్శకు పదును పెట్టాలి. అందుకు బాబాసాహెబ్ అంబేద్కర్‌ను తప్పనిసరిగా చదవాలి'

> కాంగ్రెస్‌తో సహా బూర్జువా లౌకిక పార్టీలు రోజురోజుకీ బలపడుతున్న హిందూత్వ శక్తులను తుదముట్టించడానికంటే బీజేపీని రాజకీయంగా ఎన్నికల్లో ఓడిస్తే సరిపోతుదన్నట్లుగా అలోచిస్తున్నారు తప్ప హిందూత్వ శక్తుల ప్రాబల్యాన్ని లౌకిక ప్రజాతంత్ర సిద్ధాంతాల బలంతో ఎదుర్కోవాలని అనుకోకపోవడం దురదృష్టకరం. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నిలలో కూడా ప్రధానంగా కాంగ్రెస్ మధ్యప్రదేశ్‌లో, రాజస్థాన్‌లో, ఛత్తీస్‌గఢ్‌లో మృదు హిందూత్వ ధోరణిని ప్రదర్శించడం ఓ పెద్ద ఉదాహరణ. అలాగే ఎన్‌డీఏకి వ్యతిరేకంగా ఏర్పడిన 'ఇండియా' కూటమిలో కూడా వివిధ రాష్ట్రాలలో అధికారం చెలాయిస్తున్న పార్టీలు హిందూత్వ సిద్ధాంతాన్ని తుద ముట్టించడానికి స్పష్టమైన లౌకిక ప్రజాతంత్ర వైఖరులు తీసుకోకపోవడం విచారకరం.


(1927 డిసెంబర్ 25న మనుస్మృతిని అంబేద్కర్ తగలబెట్టిన రోజు)

అహంకారంలో కూరుకుపోతున్న జవాబుదారీతనం!

రామాయణంలో రావణాసురుడు...మహాభారతంలో దుర్యోధనుడు... వీరిరువురు అగ్ర రాజ్యాధిపతులుగా నలుదిశలా వెలుగొందారని పురాణాలు చెబుతున్నాయి. కానీ ఒక చిన్న అహంకారాన్ని జయించలేక, గత చరిత్రను, సాటి సహచరులను లెక్కచేయకుండా, చిన్నచూపు చూస్తూ, విర్రవీగుతూ మితిమీరిన ప్రవర్తనకు మూల్యం చెల్లించుకున్నారు పాపం! చర్చకు అవకాశం ఇవ్వని ఆధునిక రాజ్యాధిపతులు ముసోలిని, అడల్ఫ్ హిట్లర్, గడాఫీ చివరకు ముషారఫ్ వంటి అనేకమంది కూడా తమ అహంకారానికి తామే బలైపోయారు. అయితే ఇప్పుడు ఎవరైనా అలాంటి అహంకారంతో పరిపాలన సాగిస్తుంటే వారికి కూడా అలాంటి గతి పట్టాలని కోరుకునే భావవాదంతో చెబుతున్న మాట కాదు. 'అలాంటి వారి పాలన అంతమయ్యేనాటికి జరిగే నష్టాన్ని వారితో పాటు ప్రజానీకం కూడా గుర్తించాలి, అలా గుర్తించినప్పుడు నివారణ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది' అనే భౌతికకోణంలో మాత్రమే వివరిస్తున్నాను.

ప్రజాస్వామ్యమంటే ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పరిచి ఆ ప్రభుత్వం వారికి నచ్చిన తీరులో పరిపాలన సాగించడం కాదు. జవాబుదారితనం లేని పాలన ప్రజాస్వామ్యం అనిపించుకోదు. పార్లమెంట్‌లో అధికార పక్షం ప్రతి పాదనలు చేసి ఆ ప్రతిపాదనలపై తమకు నచ్చిన రీతిలోనే చర్చలు జరిపి చట్టరూపు దాల్చేలా చేయడం కూడా నిజమైన ప్రజాస్వామ్యం కాదు. ప్రజాస్వామ్యమంటే మెజార్టీ కలిగిన సభ్యులంతా కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడము అనేది రాజ్యాంగబద్ధమైనది. అందులో ఎలాంటి సందేహం లేదు. ప్రజాస్వామ్య పరిపాలన అంటే మైనారిటీల (తక్కువ సంఖ్య కలిగిన ప్రతిపక్ష సభ్యుల) అభిప్రాయాలను గౌరవిస్తూ మెజారిటీ నిర్ణయానికి కట్టుబడి ఉండడమని గుర్తించాలి. నోరు మంచిదైతే ఊరు మంచిదైతదని సామెత. కానీ నోరు పెద్దదైతే అధికారం మాది అనే విధంగా దేశంలో పాలన సాగుతోందా! ప్రతిపక్ష పార్టీలు అంటే ప్రజల తిరస్కారానికి గురైన వారు కాదు. ప్రజల చేత ఎన్నుకోబడి పార్లమెంటులోని అందరి సభ్యుల లాగానే సమాన హోదా, హక్కు కలిగిన వాళ్లు. అయితే ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వామ్యం లేకపోవచ్చు. అంతమాత్రాన ప్రభుత్వ భాగస్వాముల కన్నా తీసిపోయిన వారు కాదు. ఇంకా చెప్పాలంటే ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులకు పార్లమెంట్‌లో చర్చపై ఎక్కువ అవకాశం ఇవ్వాలి. అప్పుడే రాటుదేలిన నిర్ణయాలు చట్టరూపం దాల్చుతాయి.


కానీ స్వతంత్ర భారత చరిత్రలో పార్లమెంటు ఒక సెషన్‌కు సంబంధించి దాదాపు 146 మంది సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేయడం ఇదే మొదటి సారి. ఈ సస్పెన్షన్ కూడా ఎంతో పెద్ద నేరారోపణల కారణంగా కాదు. ప్రతిష్టాత్మక పార్లమెంటు భవనంలోకి, అందులోనూ పార్లమెంటు సభ్యులు ప్రసంగించే స్థలంలోకి, సాధారణ పౌరులు దూసుకొచ్చి టీయర్‌గ్యాస్‌తో గందరగోళం సృష్టించిన అంశంపై సంబం ధిత మంత్రి ప్రతిస్పందించాలని పట్టుబట్టిన కారణంగా, అడిగిన వారందరినీ సభ నుంచి సస్పెండ్ చేయడం జరిగింది. అగంతకుడి దుశ్చర్య నేరమా? దానిని ప్రశ్నిస్తూ జవాబు కోరిన ప్రతిపక్ష సభ్యులది నేరమా? జవాబు చెప్పడానికి నిరాకరిస్తున్న సంబంధిత మంత్రిది న్యాయమా? ఒక పార్లమెంటు సభ్యురాలి ఈ మెయిల్‌కు సంబంధించిన వివరాలు గోప్యంగా లేవన్న కారణంగా ఆమె పార్లమెంటు సభ్యత్వా న్ని రద్దు చేయగలిగిన ప్రభుత్వం, అగంతకుడు ప్రవేశించి పార్లమెం టు సభ్యులందరినీ పొట్టనబెట్టుకునే చర్యకు పాల్పడినప్పుడు కూడా స్పందించడానికి నిరాకరిస్తే అది ఎలాంటి ప్రజాస్వామ్యం? దురహంకార స్వామ్యం కాదా? ఒక పార్లమెంటు సభ్యుడు ఎన్నికల సభలో చేసిన ప్రసంగాన్ని కోర్టుకీడ్చి ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయగలిగిన ప్రభుత్వం తమ పార్టీ పార్లమెంటు సభ్యుడే అగంతకులకు అనుమతినిచ్చి పార్లమెంటు ప్రతిష్టను దిగజార్చినప్పటికీ ఆయనపై ఎలాంటి చర్యకు ఉపకరించకపోవడం పక్షపాత ప్రభుత్వస్వామ్యం కాదా?



జి.తిరుపతయ్య
9951300016

బహిష్కృత పార్లమెంట్ సభ్యులందరూ పార్లమెంటు భవనం బయట కూర్చుని రాజ్యసభ అధ్యక్షుడిని మిమిక్రీ (ఇమిటేట్) చేశారనే వాదనపై అందరూ గొల్లుమంటున్నారు. రాజ్యాంగ హోదాను అవమాన పరిచారంటూ రాష్ట్రపతికి కూడా చెప్పేస్తున్నారు. మరి పార్లమెంట్ భవనంలోకి దూసుకొచ్చి సభ్యుల బల్లలపై పరుగులు తీస్తున్న అగంతకుడి దుశ్చర్య పార్లమెంటు గౌరవ హోదా కరిగిన స్వీకర్ ఇతర అధికార గణ మందిరి ప్రతిష్ట దెబ్బతిన్నట్లు కాదా? నిజానికి ఇది దేశ ప్రతిష్టను భద్రత వైఫల్యాలను ప్రశ్నార్థకం చేసింది. పాకిస్తాన్ చైనా సరిహద్దులను కాపాడే ప్రభుత్వమిదే అని నమ్మబలికే వారు కాస్త ఆత్మ విమర్శ చేసుకోవాలి. దీనిపై ఎంతో వినమ్రతతో పార్లమెంటు లోపల పార్లమెంటు బయట దేశ ప్రజలందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాల్సి ఉండే. కానీ ఎవరైనా డిమాండ్ చేస్తే అది ఎంతటి ఉపయోగకరమైన లేదా ప్రతిష్టాత్మకమైన విషయమైనా సరే దానిపై స్పందించడానికి ప్రస్తుత పాలకులు చాలా మొండిగా వ్యవహరిస్తున్నారు. మణిపూర్ తగలబడి పోతుంటే 'ప్రధాని ఒక్కమాటైనా మాట్లాడాలి, ఏ చర్యలు తీసుకుంటున్నారో పార్లమెంటుకు తెలపాలి' అని అడిగి నప్పుడు ఏ మాత్రం కదలలేదు. చివరికి ప్రతిపక్షాలన్నీ కలిసి ఇదే అంశంపై అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు కూడా సమాధా నమిస్తూ మణిపూర్ అంశాన్ని మాత్రం ప్రస్తావించలేదు. ఇలాంటి ధోరణి దేనికి సంకేతం? మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్న పార్లమెంటు సభ్యుడిని రక్షించడమే కాకుండా సదరు రెజ్లర్లను పూర్తిగా విస్మరించి వారిపై పోలీసు చర్య తీసుకొని నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రారం భించుకున్నారు తప్ప వారి గురించి ఒక్కమాటైనా ప్రస్తావించలేదు.

> స్వతంత్ర భారత చరిత్రలో పార్లమెంటు ఒక సెషన్‌కు సంబంధించి దాదాపు 146 మంది సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేయడం ఇదే మొదటిసారి. ఈ సస్పెన్షన్ కూడా ఎంతో పెద్ద నేరారోపణల కారణంగా కాదు. ప్రతిష్టాత్మక పార్లమెంటు భవనంలోకి, అందులోనూ పార్లమెంటు సభ్యులు ప్రసంగించే స్థలంలోకి, సాధారణ పౌరులు దూసుకొచ్చి టీయర్‌గ్యాస్‌తో గందరగోళం సష్టించిన అంశంపై సంబంధిత మంత్రి ప్రతిస్పందించాలని పట్టుబట్టిన కారణంగా, అడిగిన వారందరినీ సభ నుంచి సస్పెండ్ చేయడం జరిగింది. అగంతకుడి దుశ్చర్య నేరమా? దానిని ప్రశ్నిస్తూ జవాబు కోరిన ప్రతిపక్ష సభ్యులది నేరమా? జవాబు చెప్పడానికి నిరాకరిస్తున్న సంబంధిత మంత్రిది న్యాయమా?



హిండెన్‌బర్గ్ రిపోర్ట్ వెలువడిన అనంతరం అదాని కంపెనీల బాగోతం బయటపడిన సందర్భంగా కూడా ప్రతిపక్ష పార్లమెంటు సభ్యుల అభ్యర్థనను తోసిరాజనడంతో పార్లమెంటు ఒక సెషన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. కానీ ప్రభుత్వం మాత్రం స్పందించడానికి ముందుకు రాలేదు. అంతకుముందు కాలంలో యుద్ధ విమానాలు రఫెల్ డీల్ వ్యవహారంపై కూడా పార్లమెంట్ ఒక సెషన్ మొత్తం పూర్తిగా స్తంభించిపోయింది. 'మీరు ఏదైనా అడిగితే దానికి మేము ససేమిరా అంటాము, అన్న చందాన పార్లమెంట్ వ్యవహారాలు నడుస్తున్నాయి. ఇది చాలా దురదృష్టకరం. రైతు నల్ల చట్టాలపై కూడా ప్రతిపక్ష సభ్యులపై ఇలాంటి దాష్టీకమే ప్రదర్శించారు. కానీ పార్లమెంటు వెలుపల ఏడాది పొడుగునా దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమం జరగడంతో తలవంచాల్సి వచ్చింది. ప్రతిపక్ష సభ్యుల అభ్యర్థనను కాలరాయడం ఒకవైపు చేస్తూ అధికార పక్షం ప్రవేశపెట్టే బిల్లులన్నింటిపై నామమాత్రపు చర్చ జరిపి తాము అనుకున్న విధంగానే సభ చేత ఆమోదింపచేయడం నేటి కాలంలో రివాజుగా మారింది.

భారత శిక్షాస్మృతికి సంబంధించిన ప్రధాన చట్టాలన్నిటిని వారికి అనుకూలంగానే పాస్ చేయించుకున్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ల నియామకాలపై కూడా ఏకపక్షంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సదరు కమిటీ నుండి తొలగించి న్యాయశాఖ మంత్రిని జోడిస్తూ నిర్ణయాన్ని చేసేసారు. పార్లమెంటు ఆమోదించింది కూడా. ఆర్థిక అభివృద్ధి జరుగుతుందన్న సంకేతాలు వెలువడుతున్న చోట ఇలాంటి పెదవి విరుపుడు ఏమిటి? అని భావించేవారు గుర్తుంచుకోవాల్సింది ఏమంటే, అధికార పక్షం మరింత సంయమనంతో పని చేస్తే 16వ ఆర్థిక సంఘం ప్రతిపాదించిన '80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ' అవసరం ఉండదు. ఈ సూక్ష్మ వ్యత్యాసాన్ని గుర్తిస్తే తప్ప ప్రభుత్వ వైఫల్యం ఎంతో బోధపడదు.

www.praja.khammam@gmail.com
అనుదినం...జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఖమ్మం
శనివారం 23, డిసెంబర్ 2023

రాష్ట్రపతి ఆతిథ్యం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



శీతాకాల విడిది లో భాగంగా హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆహ్వానం మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, స్పీకర్ తో కలిసి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం రాష్ట్రపతి నిలయానికి వెళ్లారు. వారితో కలిసి రాష్ట్రపతి ఆతిథ్యాన్ని స్వీకరించారు.

నేడు సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో మంత్రి పొంగులేటి పర్యటన

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ చేరుకుంటారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3:45 గంటలకు.. కూసుమంచి చేరుకుంటారు. అక్కడి మల్లారెడ్డి ఫంక్షన్ హాల్లో క్రిస్మస్ కానుకలు, షాదీ ముబారక్, సౌభాగ్య లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. ఈ మేరకు క్యాంప్ ఆఫీస్ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

విద్యుత్ స్టోర్స్‌లో 'ఔట్ డోర్' రాజ్యం

కాంట్రాక్టర్ల గుప్పిట్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్టోర్స్

- నిబంధనలకు విరుద్ధంగా పరికరాల తరలింపు
- వేళాపాళ లేకుండా సామగ్రి..పట్టింపులేని అధికారులు
- విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క దృష్టి సారించాలి

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి





ఖమ్మం జిల్లాలో విద్యుత్ శాఖ స్టోర్స్ నిర్వహణ అస్తవ్యస్తంగా సాగుతోంది. వేళాపాళ లేకుండా కాంట్రాక్టర్లకు విద్యుత్ పరికరాలు ఇస్తున్నారు. సమయపాలన పక్కకు పెట్టి స్టోర్స్‌లో 'చీకటి' బాగోతాన్ని కొనసాగిస్తున్నట్టు సంబంధిత అధికారులపై ఆరోపణలు వస్తున్నాయి. ఔట్ డోర్ ఏఈ నూకారపు శ్రీను కనుసన్నల్లోనే ఈ చాటుమాటు వ్యవహారం నడుస్తుందని పలువురంటున్నారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, పై అధికారులను మేనేజ్ చేస్తూ ఈ అక్రమ బాగోతం నడుపుతున్నారనే అభియోగాలు ఉన్నాయి. ఏకంగా ఏఈకి సంబంధించిన ట్రాక్టరే నెలకు 15 సార్లు స్టోర్‌కు వస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

రైతుల పేరు చెప్పి దర్జాగా దోపిడీ...

సమయపాలన లేకుండా ఇష్టారాజ్యంగా పరికరాలు పంపిణీ చేస్తుండటంపై ప్రశ్నిస్తే రైతులపై లేని ప్రేమను ఒలకబోస్తూ దూరాభారం నుంచి వస్తారనే.. సమాధానం చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రైతుల నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోకుండా ఉచితంగా ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతరత్ర విద్యుత్ పరికరాలను అమర్చాల్సి ఉన్నా.. కాంట్రాక్టర్లు, ఏఈలు చేతులు తడపందే పరికరాలు ఇచ్చే పరిస్థితిలేదని బాధితులు వాపోతున్నారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకే స్టోర్స్ నుంచి వాహనాలు బయటకు వెళ్లాల్సి ఉన్నా రాత్రి 8 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సొంత జిల్లాలో ఈ రాత్రి దందాపై దష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పర్యవేక్షణ లోపం..

విద్యుత్ శాఖ స్టోర్స్ నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపిస్తోంది. కొన్నిచోట్ల అధికారుల అండతోనే ఈ చీకటిదందా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రాథమికంగా అవుట్ డోర్ ఏఈ వచ్చి పోయే వాహనాలు, లోడింగ్, అన్ లోడింగ్ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తారు. వీరు ఆయా డివిజన్లలో పదుల సంఖ్యలో ఉన్న కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు తీసుకుని సమయపాలన పాటించకుండా.. రాత్రివేళల్లో విద్యుత్ పరికరాలు ఇస్తున్నారు. స్టోర్స్‌లో విలువైన వస్తువులు ఉంటాయి కాబట్టి అవి దారితప్పుతాయనే ఉద్దేశంతో సాయంత్రం గరిష్టంగా 6 గంటలు దాటితే క్లోజ్ చేస్తారు. కానీ ఖమ్మం జిల్లాలోని స్టోర్స్ మాత్రం పగలు, రాత్రిలేకుండా కొనసాగిస్తుండటం, రాత్రి 6 దాటాక కూడా స్టోర్స్ నుంచి విద్యుత్ మెటీరియల్ బయటకు వెళ్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'నవతెలంగాణ' నిఘా పెట్టడంతో స్టోర్స్ నుంచి వాహనాలు వెళ్తున్న దశ్యాలు కనిపించాయి. ప్రతిరోజూ రాత్రి ఇలాగే వెళ్తుంటాయని చూసినవాళ్లంటున్నారు. స్టోర్స్‌లో రూ.కోట్ల విలువైన వస్తువులు ఉంటాయి కాబట్టి చీకట్లో ఎలాంటి కార్యకలాపాలు కొనసాగించొద్దనే నిబంధన ఉంది. కానీ ఖమ్మం జిల్లా స్టోర్స్ అవుట్ డోర్ ఏఈ ఎన్.శ్రీనివాస్ కు మాత్రం ఇవేవీ పట్టడం లేదనే ఆరోపణలున్నాయి. తనకు నచ్చిన కాంట్రాక్టర్లకు ఎప్పుడుపడితే అప్పుడు విద్యుత్ పరికరాలు ఇస్తున్నాడనే ప్రచారం ఉంది. పర్యవేక్షణ చేయాల్సిన డీఈ (టెక్నికల్), ఏడీలతో పాటు విజిలెన్స్ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగానే రూ.కోట్ల విలువైన పరికరాలు వేళకాని వేళల్లో బయటకు తరలుతున్నాయనే అంటున్నారు. ఈ తోడ్పాటుకు గానూ స్టోర్స్ నుంచి కొందరు అధికారులకు రోజుకు రూ.30వేల వాటా ధనాన్ని పంచుకుంటున్నట్లు తెలుస్తోంది.

నచ్చిన కాంట్రాక్టరైతే ఓకే..

ఖమ్మం జిల్లాలోని టౌన్, ఖమ్మం రూరల్, వైరా, సత్తుపల్లి తదితర డివిజన్ లలో కలిపి 40 నుంచి 50 మంది కాంట్రాక్టర్లు ఉంటారు. వీరు ముందుగా పరికరాలు అమర్చి.. ఆ తర్వాత బిల్లులు పెట్టుకుంటారు. వీరిలో ముడుపులు ఇచ్చే కాంట్రాక్టర్లకు వెంటనే పరికరాలను సమకూర్చడంతో పాటు బిల్లులు కూడా తక్షణం మంజూరయ్యేలా సంబంధిత స్టోర్స్ అధికారులు సహకరిస్తుంటారనే ఆరోపణలున్నాయి. 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్టు దీనిలో ఎవరి వాటా వాళ్లకు దక్కుతున్నట్టు అభియోగాలున్నాయి.

దూరం నుంచి వస్తారనే..!

రిజర్వేషన్స్, గేట్ పాస్ లు అన్నీ ఉంటాయి. ఒక్కొక్కసారి హమాలీలు లోడింగ్ లేటు చేస్తారు. రెండు జిల్లాలకు ఒకే చోట స్టోర్స్ కావడం వల్ల దూరం నుంచి వస్తారనే కారణం కావచ్చు. పూర్తి వివరాలు కనుక్కుంటాను.

- సురేందర్, ఎస్ఈ, జిల్లా విద్యుత్ శాఖ

నియంతలా ప్రధాని మోడీ

- ఎంపీల సస్పెన్షన్ అప్రజాస్వామికం
- ఖమ్మంలో ఇండియా కూటమి పక్షాన నిరసన, ర్యాలీ
- పాల్గొన్న సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్, ప్రజాపంథా, లోక్‌సత్తా

నవతెలంగాణ- ఖమ్మం



ప్రధాని మోడీ నియంతలా వ్యవహరిస్తున్నారని పార్లమెంట్ లోపల, బయట ప్రశ్నించిన వారి గొంతు నొక్కేప్రయత్నం చేస్తున్నారని ఇండియా కూటమి పక్షాన నాయకులు విమర్శించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 146 మంది విపక్ష ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెన్షన్ చేసి ప్రజా వ్యతిరేక చట్టాలను ఆమోదింప చేశారని ఆరోపించారు. శుక్రవారం పార్లమెంట్‌లో బీజేపీ వైఖరిని నిరసిస్తూ ఖమ్మం అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పక్షాల నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్‌పై కొందరు దుండగులు దాడి చేస్తే ఆ దాడికి వివరణ ఇవ్వాలని అడిగిన విపక్ష పార్లమెంట్ సభ్యులను అసలు పార్లమెంట్‌కే రాకుండా చర్యలు తీసుకుంటున్నారని, పార్లమెంట్ దాడిపై మోడీ ఎందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నించారు. పార్లమెంట్‌పై దాడి మోడీ సర్కార్ వైఫల్యానికి ప్రతీక అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతున్నదని, ఉపాధి కల్పనా రంగాలు రోజురోజుకూ వట్టిపోతున్నాయని, దీనిపై మోడీకి దృష్టి లేదన్నారు. ఈడీ, ఐటి, పోలీసులను పెట్టుకొని పాలన సాగిస్తున్నారని, మరోసారి మోడీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమేర్పడు తుందన్నారు. ఇప్పటికే చట్టాలను సవరిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని, మందబలంతో బెదిరించేందుకు ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య మనుగడ సాధించాలంటే బీజేపీ ఓడిపోవలసిందేనని వారు స్పష్టం చేశారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ నుండి పాత ధర్నాచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, కాంగ్రెస్ నాయకులు పోట్ల నాగేశ్వరరావు, పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, నల్లమల వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, లోక్‌సత్తా నాయకులు నల్లమోతు తిరుమలరావు, వివిధ పార్టీల నాయకులు దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్.కె.జానిమియా, కొండపర్తి గోవిందరావు, మహ్మద్ సలాం, శింగు నర్సింహారావు, సిహెచ్.సీతామహాలక్ష్మి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఆవుల అశోక్, సి.వై.పుల్లయ్య, చావా నారాయణ, మందడపు మనోహర్‌రావు, మిక్కిలేని నరేందర్, చంద్రం, దొబ్బల సౌజన్య, సీతారాములు, ఉస్సేన్, పలువురు కాంగ్రెస్ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికి ఎస్సీ వర్గీకరణ

కారేపల్లిలో ఘనంగా పీవీరావు జయంతి



కారేపల్లి : రాజకీయ లబ్ధికి కొందరు ఎస్సీ వర్గీకరణ జపం చేస్తున్నారని మాలమహానాడు జిల్లా నాయకులు తలారి చంద్రప్రకాశ్ విమర్శించారు. కారేపల్లిలో శుక్రవారం మలమహానాడు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పోతుల విశేశ్వర్‌రావు(పీవీరావు) 17వ వర్ధంతిని మాలమహానాడు మండల కన్వీనర్ మైప పీరయ్య అధ్యక్షతన నిర్వహించారు. సంఘం జెండాను మండల అధ్యక్షులు సోమందుల రాములు ఎగరవేశారు. పీవీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ల అర్పించారు. ఈసందర్భంగా జరిగిన సభలో తలారి చంద్రప్రకాశ్ మాట్లాడుతూ ఎస్సీ విభజనను ఐక్యంగా తిప్పికొడదామన్నారు. ఈకార్యక్రమంలో సంఘ నాయకులు బగిళ్ల వెంకటేశ్వర్లు, సోమందలు వెంకటేశ్వర్లు, సోమందుల నాగరాజు, చెవుల చందు, గుంజా రత్తయ్య, తొగర రమేష్, పప్పుల నిర్మల, బిందె రమేష్, తలారి అనిల్, పొక్కిల యుగుంధర్, తొగరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యలపై సమీక్ష

సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

నామమాత్రంగా హాజరు

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి సామినేని హరిప్రసాద్ అధ్యక్షతన సభ్యుల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. మన ఊరు మన బడి పథకంలో యడవల్లి హైస్కూల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్ చెరుకుపల్లి వెంకటేశ్వర్లు ఏఈ నాగేశ్వరరావుని అడగ్గా పూర్తి చేస్తామని సమాధానం ఇచ్చారు. ముదిగొండ కేంద్రంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని గ్రామపంచాయతీకి స్వాధీనం చేయాలని వైస్ ఎంపిపి మంకెన దామోదర్, వైద్యాధికారి అంకం అరుణాదేవి దృష్టికి తీసుకెళ్లగా పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంగన్వాడి సెంటర్లో ఖాళీగా ఉన్న టీచర్స్, ఆయా పోస్టులను భర్తీ చేయాలని ఎంపిటిసి సభ్యులు దేవరపల్లి ఆదినారాయణరెడ్డి సిడిపిఓ కమలప్రియను అడగ్గా మినీ అంగన్వాడిలను ప్రధాన అంగన్వాడిలో కేంద్రాలుగా మార్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని, టీచర్స్, ఆయా పోస్టులు ప్రభుత్వం నోటిఫికేషన్తో భర్తీ అవుతాయన్నారు. విద్యుత్ శాఖ పరిధిలో యడవల్లి, ముదిగొండ విద్యుత్ సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని యడవల్లి సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైస్‌ఎంపిపి మంకెన దామోదర్ కోరారు. ఎన్ఎస్పి కాల్వ పరిధిలో ముదిగొండ గ్రామం నుండి వెళ్తున్న కాలువలో మురికి నీరు, చెత్తాచెదారంతో దుర్వాసన వస్తుందని వాటిని తొలగించాలని ఎన్ఎస్పి ఏఈ వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లగా తొలగించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. యాసంగి పంటల సాగు సీజన్లో సాగర్ నీళ్ళు లేకపోవడంతో సాగులో ఆరుతడి పంటలు వేసుకోవాలని ఏవో మందుల రాధ సూచించారు. కాగా మండలంలో 25 గ్రామపంచాయతీలు, 17 మంది ఎంపిటిసి సభ్యులు ఉండగా, కేవలం 9 మంది సర్పంచులు,5 ఎంపిటిసి సభ్యులు సర్వసభ్య సమావేశానికి హాజరు కావటం గమనార్హం. సర్పంచుల పదవీకాలం జనవరి 31తో పూర్తవుతున్న సర్పంచులకు, ఈ సమావేశం ఆఖరి సమావేశం కానుంది. పదవీకాలం పూర్తవుతున్నందున సమావేశానికి హాజరు కావడానికి సర్పంచులు ఆసక్తి చూపలేదు. గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు రాక, పెండింగ్ ఉండటంతో సర్పంచులు సతమతమవుతున్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి మంకెన దామోదర్, ఎంపిడిఓ విడివి అశోక్ కుమార్, జడ్పిటిసి సభ్యురాలు పసుపులేటి దుర్గ, ఎంపిఓ పి.సూర్యనారాయణ, ఏవో మందుల రాధ, డిటి సహిద్ రహిమాన్, వైద్యాధికారులు అంకం అరుణదేవి, కె ధర్మేంద్ర, పశువైద్యాధికారి పి.అశోక్, ఆర్డబ్ల్యూఎస్, మండల పరిషత్, ఎన్ఎస్పి, పిఆర్,మిషన్ భగీరథ ఏఈలు విజయరాజు, వెంకటకృష్ణ, రావూరి వేణుగోపాల్, సిహెచ్ రాంబాబు, భాస్కర్‌రావు, విద్యుత్ శాఖ ఏఈలు మేకపోతుల శ్రీనివాసరావు, వి.నారాయణ, ఎంపిటిసి సభ్యులు బిచ్చాల బిక్షం, పచ్చా నాగమణి, కోయ రమేష్, దేవరపల్లి ఆదినారాయణరెడ్డి, పెద్దపొంగు రాంబాబు, పలు గ్రామాల సర్పంచులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి

జిల్లా విద్యాధికారి రవిబాబు

నవతెలంగాణ-వైరా



వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఖమ్మం జిల్లా ఇంటర్ విద్యాధికారి రవిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఒకేషనల్ విద్యార్థులకు సంబంధించిన ఓజెటి ప్రోగ్రాం (ఆన్ జాబ్ ట్రైనింగ్) ఏ విధంగా జరుగుతుందో, విద్యార్థులను మరియు అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల యొక్క సామర్థ్యాన్ని పరీక్షించారు. సిలబస్ ఎంత అయింది, మొదలైన విషయాలను కూలంకషంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని అధ్యాపకులకు సూచించారు .సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ త్వరగా పూర్తి చేయాలని అధ్యాపకులను ఆదేశించారు. అదే విధంగా ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ ప్రాక్టికల్ ల్యాబ్‌ల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు స్టడీ అవర్స్ నిర్వహించాలని మరియు చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహించాలని అధ్యాపకులను ఆదేశించారు. అదే విధంగా అదనపు తరగతుల నిర్మాణాన్ని కూడా పరిశీలించారు. కళాశాలలో రికార్డులను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ బి.వీరభద్రరావు, అధ్యాపకులు జి.అనిల్‌కుమార్, జి.శ్రీనివాసరావు. బి.బాబురావు, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, కె.శ్రీకాంత్, బి.ఈశ్వరరావు, ఎస్కే రోషన్, ఎం.వెంకట ముత్యం, జి.సుధాకర్ పాల్గొన్నారు.



రెజొనెన్స్‌లో టాలెంట్ ఒడిస్సి సంబరాలు

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని శ్రీనగర్ కాలనీలో రెజొనెన్స్ పాఠశాలలో టాలెంట్ ఒడిస్సి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ వివిధ రకాల నమూనాలను, ప్రాజెక్టులను చూపరులను అబ్బురపరిచేలా తయారు చేశారు. చిన్న వయసులోనే ఎంతో విజ్ఞానంతో వారు ప్రదర్శించిన ప్రతిభను అనేక మంది కొనియాడారు. తొలుత జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి అబ్దుల్ జావీద్ పాష , పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.ప్రసన్నరావు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూసమస్యలను త్వరితగతన పరిష్కరించాలి : ఆర్‌డివో

నవతెలంగాణ-ముదిగొండ

తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతుల భూసమస్యల దరఖాస్తులను పరిశీలించి త్వరతిగతిన పరిష్కరించాలని ఆర్‌డీవో గణేష్ అన్నారు. ముదిగొండ తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులను సవరించాలని, విధి నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని గణేష్ హెచ్చరించారు. కార్యాలయంకు వచ్చే ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో తాసిల్దార్ ఎర్రపాటి రామారావు, డిటి సయ్యద్ రహిమాన్, ఆర్ఐలు ఎస్కే వహీదా బేగం, బందెల ఉషారాణి సిబ్బంది పాల్గొన్నారు.

యువత అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలి

జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ అధికారి సునీల్ రెడ్డి

నవతెలంగాణ- ఖమ్మం

యువత అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ అధికారి సునీల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో జిల్లా క్రీడల, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలను క్రీడలు, యువజన సర్వీసుల శాఖ అధికారి, జిల్లా పౌరసంబంధాల అధికారి ఏం.ఎ. గౌస్ తో కలిసి, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో యువజన సంఘాల అధ్యక్షులు ఉమాశంకర్, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, డిఆర్ఎస్ అకాడెమీ చైర్మన్ సతీష్, ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షులు సుధీర్, అథ్లెటిక్, వాలీబాల్, టిటి కోచ్ లు గౌస్, అక్బర్, మూర్తి, అధికారులు, యువజన కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

లే-అవుట్ల అనుమతులను నిర్ణీత గడువులోగా నిబంధనల మేరకు పూర్తి చేయాలి

కలెక్టర్ విపి గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

లే-అవుట్ల అనుమతులను నిర్ణీత గడువులోగా, నిబంధనల మేరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విపి.గౌతమ్ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి లే అవుట్ అప్రూవల్ కమిటీ సమావేశం నిర్వహించి, ఖమ్మం నగరపాలక సంస్థ, వైరా, మధిర, సత్తుపల్లి మునిసిపాలిటీలు, సుడా పరిధిలో లే-అవుట్ల ఆమోదం కోసం అందిన (23) దరఖాస్తులను పరిశీలించారు. నిబంధనల మేరకు సమర్పించబడిన దరఖాస్తులను కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లే-అవుట్ల ఆమోదం కోసం రెవెన్యూ, విద్యుత్, ఇర్రిగేషన్, రోడ్లు భవనాల, టౌన్ ప్లానింగ్ తదితర అనుబంధ శాఖల నుండి అనుమతులకై సమర్పించిన దరఖాస్తులను ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, స్థల పరిశీలన చేసిన మీదట 21 రోజుల లోపు అనుమతులను జారీచేయాలని, తదనుగుణంగా జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమోదించడం జరుగుతుందని అన్నారు. గ్రీనరీ కోసం కేటాయించిన స్థలాన్ని వెంటనే స్వాధీనపర్చుకొని మొక్కలు నాటాలన్నారు. లేఅవుట్ డెవలపర్స్ కూడా నిబంధనల మేరకు చట్టబద్ధంగా సమగ్ర ప్రణాళికబద్ధంగా ల్యాండ్ డెవలప్మెంట్ పనులు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, జెడ్పి సిఇఓ అప్పారావు, డిపిఓ హరికిషన్, పీఆర్ ఎస్ఇ చంద్రమౌళి, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, డిటిసిపిఓ ప్రసాద్, టిపిఓ వికాస్, సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపల్ కమీషనర్లు సుజాత, రమాదేవి, కరుణాకర్ రెడ్డి, తహశీల్దార్లు, ఇరిగేషన్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడి టీచర్ కళావతి మృతికి నివాళి

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామంలో అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. మరణవార్త తెలిసిన వెంటనే సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, సిఐటియు పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు, గ్రామ శాఖా కార్యదర్శి గుమ్మా నరసింహారావు అమరజీవి ఈలప్రోలు కళావతి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారితోపాటు మల్లెంపాటి వీరభద్రరావు, మల్లెంపాటి ప్రసాదరావు, మచ్చా మణి, మల్లెంపాటి రామారావు, ఇమ్మడి వీరభద్రం, సంక్రాంతి కృష్ణమూర్తి, వైరా మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్, పి.కృష్ణ, డి.నరసింహారావు, కామినేని రవి, పాపగంటి రాంబాబు, కె.నారాయణ, కే.మోతి చిత్తారు మురళి, పనితి సైదులు, చింతయ్య, డి.గోపి వైరా మండలం అంగన్వాడీ కేంద్రాల టీచర్లు పూలమాలలు వేసి ఘనమైన నివాళులు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

నవతెలంగాణ-కారేపల్లి

భార్యను అనుమానిస్తూ తీవ్ర వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై శుక్రవారం కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కారేపల్లి పోలీసులు తెల్పిన వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లికి చెందిన గుగులోత్ నరేష్, రవీనా భార్య భర్తలు. కొన్ని నెలలుగా భర్త నరేష్, భార్యను అనుమానిస్తూ తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నాడు. భర్త వేధింపులు తాళ్ల లేక భార్య రవీనా కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితరాలి ఫిర్యాదు మేరకు కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైరా డంపింగ్‌యార్డులో యాచకుని మృతి

నవతెలంగాణ-వైరా

వైరా ప్రాజెక్ట్ ఏటి బ్రిడ్జి వద్ద మునిసిపల్ డంపింగ్ యార్డులో యాచకుడు మృతి చెందినట్లు వైరా ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి డంపింగ్ చెత్తలో మరణించి ఉన్న విషయాన్ని గుర్తించిన వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ప్రసాద్ సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి సంఘటనా స్థలంలోనే శవ పరీక్ష చేయించి ఖననం చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేరుగా వరివిత్తే విధానంతో అధిక లాభాలు

కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ విజయ్‌చంద్ర

నవతెలంగాణ- నేలకొండపల్లి



నేరుగా వరి విత్తె విధానంతో రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకొని తక్కువ కాలపరిమితిలో అధిక లాభాలు సాధించవచ్చని కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ విజయ్ చంద్ర అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నేలకొండపల్లి వ్యవసాయ శాఖ సహకారంతో ఐపీ ఫౌండేషన్ గ్రాంట్ తోర్నటన్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరుగా వరి విత్తే విధానంలో తడి పొడి పద్ధతిలో కలుపు మొక్కల, ఎరువుల యాజమాన్యంతో పాటు నీటి యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దేశబోయిన అరుణకుమారి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం.దుర్గాభవాని, బి.శిరీష, బి.శశిరేఖ, బి.సాయి, నిఖిల, ఎం. రామకృష్ణ, ఏ.అరవింద్, బి.అవినాష్, ఐ.ఉదయ్ కిరణ్, పిఐ ఫౌండేషన్ నిర్వాహకులు హర్షదీప్, రేష్మ రైతులు పాల్గొన్నారు.

వికసిత భారత్‌లో రైతులను చైతన్య పరుస్తున్న అధికారులు

నవతెలంగాణ-వైరా

వికసిత భారత్ కార్యక్రమాన్ని మండలంలోని తాటిపూడి గ్రామంలో అన్ని శాఖల అధికారులతో వ్యవసాయాధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడిఎ బాబురావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి, అమలులో పెట్టే ఉద్దేశ్యం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. మండలంలో పిఎం కిసాన్ లబ్దిదారులు 6,888 మంది ఉన్నారని, ఒక్క తాటిపూడి గ్రామంలో 278 మంది ఉన్నారని వివరించారు. ఈ కెవైసి పెండింగ్, పోస్టల్ ఎకౌంట్స్ తీసుకోవాల్సిన వారి వివరాలు వెల్లడించారు. అంతేగాక నానో యూరియా వాడకం, నేచురల్ ఫార్మింగ్, సాయిల్ హెల్త్ కార్డు అవసరాన్ని వివరించారు. అనంతరం మిరప క్షేత్రాన్ని దర్శించారు. కార్యక్రమంలో రైతులు బండి గోపాలకృష్ణ, తూము నరసింహారావు, కేవికే శాస్త్రవేత్తలు రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారిణి దుర్గా భవానికి సన్మానం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం సరైన ప్రోత్సాహం అందిస్తే విద్యార్థులు వివిధ రంగాలలో రాణిస్తారని వ్యాస రచయిత యం.రాంప్రదీప్ అన్నారు.ఎర్రుపాలెం మండల పరిధిలోని భీమవరం గ్రామంలో వేమిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 9వ తరగతి విద్యనభ్యసిస్తున్న గుంటుపల్లి గోపవరం గ్రామానికి చెందిన సిహెచ్. దుర్గా భవాని ఖోఖో క్రీడా పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రం తరుపున జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకుని సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.సుభద్రాదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస పోటీలు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసన్ మాట్లాడారు. జలగంనగర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

విద్యార్థులను ప్రోత్సాహించేందుకే బహుమతులు

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల హైస్కూల్‌కు గ్రామానికి చెందిన వల్లభనేని చైతన్య లక్ష్మి శుక్రవారం రూ.25 వేలను స్కూల్ పేరు మీద ఫిక్స్‌డ్ చేసి ప్రతి సంవత్సరం వచ్చే వడ్డీతో పదవ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహం బహుమతిగా ఇచ్చేందుకు బ్యాంకులో ఫిక్స్ చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మాజీ సర్పంచ్ వల్లభనేని భద్రయ్య చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మెన్ కృష్ణ, వల్లభనేని అప్పారావు, ఉపాధ్యాయులు చావా శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, రాధాకృష్ణ, డి.శ్రీనివాసరావు, పద్మ కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా పట్ల అవగాహన

నవతెలంగాణ-కామేపల్లి

ప్రజలు కరోనా పట్ల తీసుకోవలసిన జాగ్రతలపై కామేపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ నెల్లూరి చందన అవగాహన కల్పించారు. కరోనా విజృంభిస్తున్నందున ప్రజలకు ముందస్తు వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలని, వేడి వేడి పదార్థాలు తినాలని, జలుబు దగ్గు, జ్వరం, ఆయాసం అనిపిస్తే వెంటనే ప్రభుత్వ వైద్యసిబ్బందికి తెలియచేసి వెంటనే అవసరమైతే చికిత్స పొందాలని అన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల సుభ్రతను పాటించాలన్నారు. గ్రామాలలో వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని విధినిర్వాహణలో సమయపాలన పాటించాలని అలత్వం వహిస్తే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి శుక్రువారం గ్రామ పంచాయతీ, వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నెహ్రూ, వైద్యసిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి సర్వం సిద్ధం

- ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులకు దర్శనం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మహాదివ్య క్షేత్రమైన స్వయంభుగా వెలసిన జమలాపురం శ్రీ వెంక టేశ్వర స్వామి వారి ఆలయం నందు నిర్వహించే వైకుంఠ ముక్కోటి ఏకాదశి మహోత్సవానికి సర్వం సిద్ధం చేసి స్వామి వారిని ఉత్తర ద్వారా దర్శనం ద్వారా భ క్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయ కార్యనిర్వా హణాధికారి జగన్మోహన్‌రావు తెలిపారు. ముక్కోటి ఏ కాదశి పర్వదినానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉత్తర ద్వార దర్శనానికి దేవస్థానం ఆధ్వర్యంలో సకల ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామి వారిని దర్శించుకోవాలని తెలిపారు.

వైరా మున్సిపాలిటీలో పర్యటించిన మదన్ లాల్

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14 వార్డులో గుగులోత్ వారి రిసెప్షన్‌లో పాల్గొని నూతన దంపతులు దుర్గాప్రసాద్, బిందు ప్రత్యూషలను ఆశీర్వదించారు. ఎనిమిదో వార్డులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన నందిగామ మనోహర్‌ను పరామర్శించారు. వాసవి కళ్యాణ మండపంలో జరిగిన యంద్రపుడి రామచంద్రరావు దశ దిన కార్యక్రమంలో పాల్గొని నివాళు లర్పించారు. రెండో వార్డులో చనిపోయిన ఓర్సు వెంకట నారాయణ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వైరా మండలం, పట్టణ అధ్యక్షులు బాణాలు వెంకటేశ్వర్లు, మద్దేల రవి, మున్సిపాల్టీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీత రాములు, కట్టా కృష్ణార్జునరావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, వనమా విశ్వేశ్వరరావు, మాదినేని దుర్గాప్రసాద్, కొత్త వెంకటేశ్వరావు, భూమాత కృష్ణమూర్తి, మరికంటి శివ, వజినేపల్లి చక్రవర్తి, కొణతాలపల్లి సుబ్బారావు, ఆదూరి ప్రేమ్ కుమార్, నూకల ప్రసాద్, నూకల వాసు, యంద్రపూడి శంకర్, మిట్టపల్లి కిరణ్ కుమార్, వల్లేపు రాము, పాములు వెంకటేశ్వర్లు, బత్తుల లింగారావు, బత్తుల వెంకటేష్, యంద్రతి గోపాలరావు, దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొన్న మల్లు నందిని

నవతెలంగాణ-తల్లాడ

ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మధిర నియోజకవర్గం శాసనసభ్యులు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని పాల్గొన్నారు. అనంతరం తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు కాపా సుధాకర్, సత్తుపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివ వేణు, వేంసూరు మండల అధ్యక్షులు కేసర చంద్రశేఖర్‌రెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షులు అలావత్ వెంకటేశ్వరరావు, మర్యాదపూర్వకంగా కలిశారు.



మల్లు నందినికి సత్కారం

తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణిమల్లు నందిని విక్రమార్కని ఎమ్మెల్యే క్యాంపస్ ఆఫీస్‌లో శుక్రవారం శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండప అధ్యక్షుడు కురువెళ్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి నాళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పబ్బతి జగదీష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు వీరందరూ నందిని విక్రమార్కను కలిసి బొకే అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.

పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులు దూరం

- ఎంపీడీవో సిలార్ సాహెబ్

నవతెలంగాణ-మధిర

పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులు దూరమవుతాయని ఎంపీడీఓ సిలార్ సాహెబ్ అన్నారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మధిర మండలంలోని కాజీపురం, మాటూరు, మాటూరుపేట గ్రామాలలో శు క్రవారం ఎంపీడీవో సిలార్ సాహెబ్ ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్లు, ఐకెపి సిబ్బందితో కలిసి గ్రామ ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇళ్లల్లో ఉండే నీటితొట్లలోని నీటిని నిల్వ ఉండకుండా, పాత టైర్లు, కొబ్బరి బోండాలు లాంటి వస్తువుల్లో నీరు నిలువ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన సైడ్ డ్రైనలను ఎప్పటికప్పుడు పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.



అండర్పాస్ రహదారిని పరిశీలించిన ఆర్డీఓ

నవతెలంగాణ-ముదిగొండ

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రైతుల పొలాలకు వెళ్లినందుకు కోరిన అండర్పాస్ రహదారిని ఆర్డీవో గణేష్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రహదారి ప్రదేశ నిర్మాణాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. అండర్పాస్ రహదారిని త్వరగా పూర్తిచేసి రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేయాలని ఆయన నేషనల్ హైవే అధికారులకు సూచించారు. ఆయన వెంట తాసిల్దార్ ఎర్రపాటి రామారావు, ఆర్ఐ ఎస్కె వహీదాబేగం, రైతులు బట్టు బాబురావు, రావులపాటి స్వరాజ్, రావూరి రామారావు, కొమ్మూరు వెంకయ్య గ్రామ మాజీ సర్పంచ్ గుర్రం వెంకయ్య, పుచ్చకాయల రమేష్, భద్రయ్య నేషనల్ హైవే అధికారులు ఉన్నారు.

మంత్రి పొంగులేటికి హౌసింగ్ ఉద్యోగుల వినతి

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



గృహ నిర్మాణశాఖ సహాయ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తమ సమస్యల పరిష్కారం కోసం హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. హైదరాబాదులో శు క్రవారం మంత్రిని కలిసిన ఉద్యోగులతో మంత్రి పలు అంశాలపై చర్చించారు. సమస్యలపై భవిష్యత్తులో సుదీర్ఘంగా చర్చించుదామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆ శాఖ ఉద్యోగులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఉద్యోగ సంఘం అధ్యక్షులు గవ్వ రవీందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి, కోశాధికారి కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీ వెంకయ్య, అత్తార్, ఫయూమ్, కార్యదర్శి రఘువీర్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలి

- మౌలిక సదుపాయాలు కల్పించాలి
- ప్రమోషన్ కోసం ఇన్ సర్వీస్ వారికి ప్రత్యేక టెట్ నిర్వహించాలి
- ప్రతినెల వేతనాలు, పెండింగ్ బిల్స్ చెల్లించాలి
- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీవీ.నాగమల్లేశ్వరరావు

నవతెలంగాణ-కల్లూరు



ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం చేయడానికి కొత్త ప్రభుత్వం చొరవచూపి దృష్టి పెట్టాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జీవీ. నాగమల్లేశ్వరరావు అన్నారు. యుటిఎఫ్ మండల మహాసభ శుక్రవారం ఇమేజ్ గార్డెన్‌లో మండల కార్యదర్శి కే.విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జీవి.నాగమలేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతం రోజురోజుకు పడిపోవడానికి కారణం ప్రభుత్వ విధివిధానాలనే అన్నారు. మౌలిక వసతులు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ వంటి వసతులు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాల వైపే విద్యార్థులు తల్లిదండ్రుల దృష్టి మళ్లించవచ్చునని తెలిపారు. ఎంఈఓ పోస్టులు భర్తీ కాకపోవడం పర్యవేక్షణ లోపం సంవత్సరాల తరబడి ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకి అపనమ్మకం ఏర్పడింది అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకుగాను ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి మెగా డీఎస్సీని సత్వరం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ప్రమోషన్స్ సత్వరం ప్రకటించేలా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించాలని, నూతన ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, శ్రామిక ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. పిఆర్సీని సాధ్యమైనంత త్వరగా ప్రకటించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఈ కుబేరులో పెండింగ్‌లో ఉన్న బిల్లుని విడుదల చేయాలని ఒకటో తేదీన వేతనాలు చెల్లించేందుకు ప్రయత్నం చేయాలని కోరారు. బదిలీ అయి రిలీవ్ కాకుండా ఉన్న ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, పండిట్, పీఈటి పోస్టులను పాఠశాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్యక్రమాల నివేదికను ఆమోదించుకొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి జిల్లా నాయకులు వివి.రామారావు శ్రీకాకుళం సతీష్, కొప్పుల శ్రీనివాస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల నాగేశ్వరరావు, కొడిశాన విజయ్ కుమార్, అమర్నాథ్ ఇందుప్రియ, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యాసంస్థలకు సంబంధించి 32 తీర్మానాలు మహాసభ ఆమోదించింది. మహాసభలు ప్రారంభం సందర్భంగా రిటైర్డ్ సీనియర్ ఉపాధ్యాయులు చింతలపూడి పురుషోత్తం యుటిఎఫ్ పతాకావిష్కరణ చేశారు.



నూతన కమిటీ ఎన్నిక

యుటిఎఫ్ కల్లూరు మండలం నూతన కమిటీ ఎన్నిక టీఎస్ యుటిఎఫ్ మండల కమిటీని ఆఫీస్ బేరర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాయల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కోడిశాన విజయకుమార్, ఉపాధ్యక్షులుగా ఎం.అమర్నాథ్ బి.ఇందుప్రియ కోశాధికారిగా వేముల శ్రీనివాస్ కార్యదర్శులుగా ఏ. రాజు, బి.రాంబాబు, ఏ.శుభాన్, ఆర్.సత్యనారాయణ, జి. వెంకటయ్య, బి.జ్యోతి, ఎన్నుకున్నారు. మండల ఆడిటర్‌గా జి.సుధీర్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 32 మంది మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఎన్నికల వ్యయ ఖాతాల రీక్యాన్సిలేషన్‌పై అవగాహన

- ఎన్నికల వ్యయ నోడల్ అధికారిణి విజయకుమారి

నవతెలంగాణ-ఖమ్మం



ఎన్నికల వ్యయ ఖాతాల రీక్యాన్సిలేషన్ గురించి అవగాహనా కార్యక్రమంను ఎన్నికల వ్యయ నోడల్ అధికారిణి విజయకుమారి నిర్వహించారు. అభ్యర్థులు ఎన్నికల వ్యయ రిజిస్టర్లను ఫలితాలు ప్రకటించిన 30 రోజులలో సమర్పించాలన్నారు. శుక్రవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థుల ప్రతినిధులతో జిల్లా సహకార అధికారిణి ఎన్నికల వ్యయ వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల వ్యయ వివరాలను ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం సకాలంలో సమర్పించాలన్నారు. ఎన్నికల అభ్యర్థుల బ్యాంకు ఖాతా స్టేట్మెంట్ మేనేజర్ సర్టిఫై చేసి, అభ్యర్థి సంతకం చేయాలని, వోచర్ల పై తప్పనిసరిగా పోటి చేసిన అభ్యర్థి లేదా వారి ఏజెంట్ సంతకం చేయాల్సి ఉంటుందని, ఎన్నికల ఖర్చుల వివరాలు నమోదు చేసిన ఏ, బి, సి రిజిస్టర్లలో ప్రతి పేజీపై తప్పనిసరిగా అభ్యర్థి సంతకం ఉండాలని అన్నారు. డిసెంబర్ 29న అబ్జర్వర్ సమక్షంలో అభ్యర్థి ఖర్చుల వివరాలు రీకన్సిలేషన్ ఉంటుందని, దీనికి పూర్తి వివరాలతో అభ్యర్థుల ప్రతినిధులు హాజరుకావాలని, రీకన్సిలేషన్‌పై అభ్యంతరాలను రాత పూర్వకంగా అందించాలని తెలిపారు. జనవరి 2 లోపు పూర్తిస్థాయిలో అభ్యర్థులు ఎన్నికల ఖర్చు వివరాలు, అఫిడవిట్‌ను సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆడిట్ ఉపసంచాలకులు హుస్సేన్‌నాయక్, అసిస్టెంట్ ఎక్స్ పెండిచరు అబ్జర్వర్లు, అకౌంట్స్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కే. శ్రీకాంత్

నవతెలంగాణ-తల్లాడ



రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎస్ జిల్లా కార్యదర్శి కే .శ్రీకాంత్ డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ తల్లాడ మండల ఆఫీస్ బ్యానర్స్ సమావేశం తల్లాడ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు. పెండింగ్ సమస్యలు డీఏ, పిఆర్సి, సిపిఎస్, బదిలీలు, పదోన్నతులు, వెంటనే చేపట్టాలన్నారు. జిల్లా బాధ్యులు సుధాకర్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బొల్లెపోగు సుధాకర్, నివేదిక ప్రవేశపెట్టారు. సీనియర్ ఉపాధ్యాయులు ఎం. నరసింహారావు, జీఎం మురళి కృష్ణ, కార్యదర్శి బి.కృష్ణార్జునరావు, మండల ఆడిటర్ ఎస్కే.రఫీ, కేవీ.మోహన్‌రావు, కే .రాధ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

తల్లాడ : మండల పరిధిలోని అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్యసాయి ట్రస్ట్ వారు శుక్రవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ మాదిరాజ అశోక్, మల్లంపాటి వాణి, ప్రధానోపాధ్యాయులు, నిమ్మ కంటి దామోదర ప్రసాద్, మాదినేని నరసింహారావు, పులి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజం జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెంలో డీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజం జన్మదినమైన గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తేనె నాగేశ్వర్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ వెంకట కృష్ణ, సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్ హృదయ్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎక్స్పో

నగరంలోని నిర్మల్ హృదయ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ ఎక్స్పో 23- 24 ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అల్లం పాటు రమేష్‌రెడ్డి ప్రారంభించారు. తొలుత పిల్లలు వివిధ రకాల సైంటిస్టుల వేషాలతో వచ్చారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ కళారూపాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రులు విద్యార్థులు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వంగా సాంబశివరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వంగా పద్మజ, శ్రావణి, పాఠశాల డైరెక్టర్ వంగా సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సర్వజ్ఞ పాఠశాలలో...

ఖమ్మం, విడి.వోస్ కాలనీలోని సర్వజ్ఞ పాఠశాలలో శుక్రవారం శ్రీనివాసరామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా పాఠశాల డైరెక్టర్స్ రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు నీలిమా, ఆర్‌వీ. నాగేంద్రకుమార్‌లు మాట్లాడారు.

హార్వెస్ట్‌లో గణిత సైన్స్ వేడుకలు

భారత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 136వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హార్వెస్ట్ పాఠశాలలో ప్రాంగణంలో గణిత, సైన్స్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ ఆర్ అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్స్ వై.మహేష్(కెమిస్ట్రీ), వై.రవీందర్‌రెడ్డి (ఫిజిక్స్), ఎన్సీఆర్బీ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఎనుముల వెంకటేశ్వర్లు, జె. యాకోబు, హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్, పార్వతీరెడ్డి ఎక్స్పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్స్ మాట్లాడుతూ నిత్యజీవితంలో గణితము , సైన్సు ఎంతో ప్రాముఖ్యతలు ఉన్నాయని, మూఢవిశ్వాసాలను ప్రారద్రోలేది సైన్స్ మాత్రమేనని, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరువ కావడానికి ఇటువంటి ఎక్స్పో వేడుకలలో పాల్గొనడం ఎంతో అనుభవాన్ని, ఉత్సాహాన్ని, నేర్చుకోవాలనే జిజ్ఞాసను పెంపొందిస్తాయని, చక్కని వేదికను ఏర్పాటు చేసిన హార్వెస్టు విద్యార్థులగల నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్ , ప్రిన్సిపల్ ఆర్. పార్వతీరెడ్డి మాట్లాడుతూ రామానుజన్ విశిష్ట గణిత శాస్త్ర సేవలకుగాను కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ వారు "బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ బై రిసెర్చ్' అవార్డుతో గౌరవించిందని తెలిపారు. రామానుజన్ గౌరవార్థం ప్రతీసంవత్సరం తమ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ ఎక్స్పో వేడుకలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్ట్ ఇంచార్జెస్ ఉమామహేశ్వరరావు, నాగరాజు, శ్యామల, అరుణదీప్తిలు పాల్గొన్నారు.

కామేపల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాల, కామేపల్లి ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గణిత శాస్త్రజ్ఞుడు రామానుజన్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బిజె. విద్యాసాగర్, ఎన్ఎస్ఎస్ పిఓ కె. వినోద్ బాబు, అధ్యాపకులు రాణి, అనిత, ఎం. శ్రీనివాస్, డి. శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్కే అక్బర్ పాషా, ఎండి .రషీద్, లాలయ్య, కౌసర్ సుల్తానా, లైబ్రేరియన్ గోపాలకృష్ణ, ఆఫీస్ సిబ్బంది రాందాస్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైరాటౌన్ : వైరా మధు విద్యాలయంలో శ్రీనివాస రామానుజన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత దినోత్సవంలో భాగంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి వీరభద్రరావు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి గణిత ప్రదర్శనలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడారు.గణిత ప్రదర్శనల నమూనాలను వీక్షించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గణిత శాస్త్రం పైన క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య విద్యాసంస్థల ఉపాధ్యక్షులు మల్లెంపాటి ప్రసాదరావు, కరస్పాండెంట్ మల్లెంపాటి రంజిత్, కోశాధికారి మల్లెంపాటి నర్మద, డివిఆర్ చారి, రాంబాబు, రాజేంద్రప్రసాద్, సౌజన్య, గణిత శాస్త్రం అధ్యాపకులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవి, లలిత, సపూరా, అజిత తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి : మండల కేంద్రంలో గల గ్లోబల్ రెయిన్‌బో పాఠశాలలో శుక్రవారం ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ ఎండి.ఎర్షాద్ అహ్మద్ శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, పాఠశాల ఇంచార్జ్ పాపారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధిర : భరత్ విద్యా సంస్థల అధినేతలు శీలం విద్యాలత, వెంకటరెడ్డి ఆదేశానుసారం శు క్రవారం పాఠశాలలో నేషనల్ మ్యాథ్స్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, మాథ్స్ టీచర్స్ శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం గణిత శాస్త్ర ప్రాధాన్యతను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్.రవీందర్‌రెడ్డి, ఉమా, స్రవంతి, త్రివేణి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య పాఠశాలలో...

మధిర పట్టణంలో శ్రీచైతన్య పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. మాథ్స్ డే సందర్భంగా విద్యార్థులు వివిధ విభాగాలకు చెందిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటిలో త్రికోణమితి, వృత్తములు రకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెండవ తరగతికి చెందిన విద్యార్థి సాయి హర్షిత్ - జియో బోర్డ్ ప్రాజెక్ట్ అందరినీ అలరించింది. ఈ వేడుకల్లో భాగంగా హైస్కూల్ విద్యార్థులు వేసిన గణిత రంగవెల్లులుగా పాఠశాల ప్రాంగణంలో తీర్చిదిద్ది ఈ వేడుకలకు వన్నె తెచ్చారు. మధిర సీఐ వసంత్ కుమార్ మాథ్స్ ఎక్స్పోను ప్రారంభించి, మాథ్స్ గొప్పతనాన్ని, చిన్నప్పటి నుండి మాథ్స్ సరియైన పద్ధతిలో నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు తెలియ చేశారు. వివిధ ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఆకెళ్ళ భారతి, డీన్ గూడెల్లి శ్రీనరేష్, సి. బ్యాచ్ ఇంచార్జ్ తిరుపతిరావు, గణిత శాస్త్ర విభాగ ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ఈ వేడుకలకు పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టరస్ మల్లెంపాటి శ్రీవిద్య, డిజిఎమ్. చేతన్, కో ఆర్డినేటర్ కృష్ణారావు విద్యార్థులు పట్ల హర్షాన్ని వ్యక్త పరిచారు.

జెడ్పీహెచ్ఎస్‌లో...

గణిత మేధావి, గణిత విజ్ఞానఘని శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధిర హవా నందు జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు షేక్.నాగూర్ వలి మాట్లాడారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీని గణిత ఉపాధ్యాయులు ఆర్ . విజయలక్ష్మి, ఎస్.నరసింహారావు, కొలగాని శ్రీనివాసరావు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జీవన ప్రశాంతి, ఎం.రాజశేఖరరావు, షంషాద్ బేగం, గుర్రం శ్రీనివాస్, కె.రాజ్యలక్ష్మి వందనపు సునీత పాల్గొన్నారు.

వేంసూరు : అల్లు రాఘవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు వేంసూరు సత్తుపల్లి మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ప్రథమతో పాటు కన్సోలేషన్ బహుమతులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.సుధాకర్‌రెడ్డి పాఠశాల సిబ్బంది అభినందించారు.

వైరా : గణిత శాస్త్ర పితా మహులు శ్రీనివాస రామానుజన్ 136 వ జయంతి ని పురస్కరించుకుని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి. భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గణిత శాస్త్రంలో శ్రీనివాస రామానుజన్ ప్రతిభను కొనియాడారు. విద్యార్థులకు మాథ్స్ క్విజ్ ని ఏర్పాటు చేసి బహుమతుల అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి. భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాజీమాథ్యూ, ఎట నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

























www.praja.khammam@gmail.com
అనుదినం...జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం 23, డిసెంబర్ 2023

నేడు అన్నదాన కార్యక్రమం

- పాల్గొననున్న ఎమ్మెల్యే జారే

నవతెలంగాణ-చండ్రుగొండ

ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మద్దుకూరు గ్రామంలో గల భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం పాల్గొంటున్నారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు భక్తులు పాల్గొనాలని కోరారు.



గురుదేవ్ విద్యాలయంలో ఘనంగా గణిత దినోత్సవం

నవతెలంగాణ-చర్ల



గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామనజం జయంతిని పురస్కరించుకొని నిర్వహించే గణిత దినోత్సవం స్థానిక గురుదేవ్ విద్యాలయం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రధానోపాధ్యాయులు గిరి వరప్రసాద్, అకడమిక్ కో ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం శ్రీనివాస రామానుజం చిత్ర పటానికి పుష్పాలంకరణ చేసారు. గణిత దినోత్సవాన్ని మ్యాథ్స్ హెచ్ఓడి బి.మేఘన, గణిత బోధన సిబ్బంది పి.స్వాతి, మౌనిక, నిఖిత, ఇందిరా, భార్గవి విద్యార్థులతో కలసి ఘనంగా ప్రారంభించారు. సుమారుగా 200 మంది విద్యార్థులు 80 ప్రాజెక్ట్ వర్క్సను ప్రదర్శించారు. గణిత బోధన సిబ్బందిని, విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అకడమిక్ కో ఆర్డినేటర్ అభినందించారు.

మంత్రులు, ఎమ్మెల్యేను కలిసిన కాసాని

నవతెలంగాణ-దమ్మపేట





తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గండుగులపల్లి గ్రామానికి చెందిన తుమ్మల అనుచరుడు కాసాని నాగప్రసాద్ శుక్రవారం హైదరాబాదులో తుమ్మల ఛాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని, అశ్వారావుపేట ఎమ్మెల్యే ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం కాసాని మంత్రి తుమ్మల దృష్టికి దమ్మపేట మండలంలో ఇటీవల తుఫాను వల్ల నష్టపోయిన పంటల వివరాలు రైతుల సమస్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుకు ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-అశ్వారావుపేట

అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సమాచారం మేరకు శుక్రవారం ఎస్‌హెచ్ఓ ఎస్సై శ్రీకాంత్ స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న 13 ఇసుక ట్రాక్టర్లను డిప్యూటీ తహశీల్దార్ సుచిత్ర సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠినచర్యలు తప్పవని పోలీసులు ఇసుక వ్యాపారులను హెచ్చరించారు.

మహాలక్ష్మి పథకంతో రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లు

- ఆటో యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-పినపాక



కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన మహాలక్ష్మి పథకం అమలుతో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న వేలాది మంది ఆటో డ్రైవర్ల బతుకులు దుర్భరంగా మారాయని పినపాక మండలంకు చెందిన ఆటో డ్రైవర్లు శుక్రవారం ఈ.బయ్యారం క్రాస్ రోడ్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ నాయకులు వల్లెపోగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమల్లోకి తెచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆటో డ్రైవర్ల పొట్ట కొడుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. రోజు ఆటో నడుపుకుంటూ వచ్చే ఆదాయంతో తమ కుటుంబాలను పోషించుకుంటూ స్వయం ఉపాధి పొందేవారమని అన్నారు. కానీ ఈ మహాలక్ష్మి పథకంతో మహిళలు ఆటోలు ఎక్కడం లేదని దీంతో తాము ఉపాధి కోల్పోయి తమ కుటుంబ పోషణ భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని అదేవిధంగా ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అర్హత కలిగిన వారిని ఆర్టీసీ డ్రైవర్లు, హెల్పర్లుగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

యాజమాన్య తొత్తు సంఘాలను ఓడించి టీబీజీకేఎస్‌ను గెలిపించాలి

- బ్రాంచి ఉపాధ్యక్షులు వూకంటి ప్రభాకర రావు

నవతెలంగాణ-మణుగూరు



జాతీయ కార్మిక సంఘాలు చంద్రబాబు నాయుడు దగ్గర తాకట్టు పెట్టిన వారసత్వ ఉద్యోగాలను కేసీఆర్ అనేక మంది న్యాయనిపుణులు సంప్రదించి కారుణ్య నియామకాలు పేరిట సాధించి సింగరేణి కార్మిక వర్గానికి అందించడం జరిగిందని అయన చలువ వల్లనే నేడు సింగరేణి నందు యువ రక్తం కనపడుతుందని ఆ ఘనత టీబీజీకేఎస్ కే దక్కుతుందని మణుగూరు టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షులు వూకంటి ప్రభాకర రావు తెలిపారు. శుక్రవారం కేసీహెచ్‌పీ నందు గెట్ మీటింగ్ సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవుఫ్, వీర భద్రయ్య, నాయకులు బాలాజీ, ఆది శంకర్, డి.వి, శ్రీనివాస్, టిబిజికెయస్ శ్రేణులు, అభిమానులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు క్రిస్మస్ కానుకలు పంపిణీ

నవతెలంగాణ-దమ్మపేట

నేడు ఉదయం 11 గంటలకు దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామంలో క్రిస్మస్ పండుగని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ కానుకను అశ్వరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ చేతుల మీదుగా అందజేయనున్నట్టు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ఆదినారాయణ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అధికార హోదాలో నిర్వహిస్తున్న తొలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరీ సోదరీమణులు పాల్గొనవలసిందిగా తెలియజేశారు.

సంక్షేమ పథకాలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-టేకులపల్లి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాల అమలులో భాగంగా గ్రామాలలో ఉన్న వారికి అవగాహన కల్పించేందుకు తలపెట్టిన వికాసిత భారత సంకల్ప యాత్ర వాహనం శుక్రవారం మండలంలోని తావూరియా తండా, తడికలపూడి గ్రామాలలో పర్యటించి భారత ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాల పైన ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భీమా సౌకర్యాలు అలాగే బ్యాంకు రుణాలు పంటలపై రుణాలు మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ ఆరోగ్యం విద్య వైద్యం తదితర కార్యక్రమాల మీద క్షుణ్ణంగా వీడియో ద్వారా, అధికారులు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీరబాబు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్ రెడ్డి, స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ శ్రీనివాస రామారావ్, ఆర్డిఓ ఫైనాన్షియల్ మేనేజర్ రాజాబాబు ,టేకులపల్లి ఎస్బిఐ మేనేజర్ అనిల్ కుమార్, నీలేష్ ఏపీఎం రవికుమార్, ఏపీవో శ్రీనివాస్ క్లస్టర్ సిసి శ్రీలత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

నవతెలంగాణ-పాల్వంచ



కోవిడ్ పట్ల అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ చాంబర్‌లో కోవిడ్ ముందస్తు నియంత్రణ చర్యలపై వైద్యశాఖ అధికారులతో నియంత్రణ చర్యలపై శుక్రవారం సమీక్షించారు. జిల్లాలో కోవిడ్ వ్యాప్తి చెందకుండా ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మే నెల నుంచి కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాలేదన్నారు. ఇప్పుడు కోవిడ్ లక్షణాలున్నవారికి పరీక్షలు చేయాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో కోవిడ్ బెడ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కోవిడ్ నియంత్రణకు డ్రగ్స్, ఆక్సిజన్, వెంటిలేటర్లు, పీపీఈ కిట్లు, మాస్కులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ముక్కోటి ఉత్సవాలకు వచ్చే భక్తులు కోవిడ్ నిబంధనలు పాటించాలని చెప్పారు. తప్పనిసరిగా మాస్కులు ధరించాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి శిరీష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







పరమ పావనం గోదావరి నది తీరం

తెప్పోత్సవాన్ని కన్నులారా తిలకించి తరించిన భక్తజనం

వైభవంగా హంస వాహనంపై విహరించిన భద్రాద్రి రామయ్య





నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అపురూపం సీతారాముల జలవిహారం అన్నట్టుగా దక్షిణ అయోధ్యగా విరజిల్లుతున్న భద్రాద్రి క్షేత్రంలో అత్యంత ప్రాధాన్యత గల ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలలో కీలక ఘట్టమైన స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమం వేలాది మంది భక్తుల వీక్షణలో వైష్ణవ వేద మంత్రాల మధ్య ఆధ్యాత్మికంగా కొనసాగింది. సీతారాముల నది విహారాన్ని పురస్కరించుకొని ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి పల్లకిలో ఊరేగింపుగా మేళ తేలాలతో కోలాటాల నృత్యాలతో భక్తుల కళకళ ధ్వనులతో అర్చకుల వేదమంత్రోత్సవాలతో హంస వాహనంపైకి చేరుకున్న సీతారామచంద్రస్వామి గోదావరి నదిలో విహరించారు. వీక్షణ మధురమైన అపురూప తెప్పోత్సవ ఘటన తిలకించిన భక్త జనాలు భక్తి పారవశంతో పులకించిపోయారు. శ్రీరామనామ స్మరణతో గోదావరి తీర ప్రాంతం మారుమోగింది. ఈ నెల 13వ తారీకు నుండి ప్రారంభమైన అధ్యయనోత్సవాలలో అవతారాలను ముగించుకున్న సీతారామచంద్ర స్వామి వారు పవిత్ర గోదావరిలో శుక్రవారం సాయంత్రం 6 తెప్పోత్సవ కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక చింతతో అట్టహాసంగా నిర్వహించారు. హంస వాహనంపై ఆసీనులైన సీతారామచంద్రస్వామి వారిని పూజిస్తూ ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రాలు ఉచ్ఛరిస్తుండగా స్వామి వారు నది తీరాన వ్యవహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. దేవస్థాన చరిత్రలోనే అత్యంత ప్రాధాన్యత గల సీతారాముల తెప్పోత్సవ కార్యక్రమాన్ని ఎటువంటి ఆటంకాలు కలగకుండా దేవాదాయ శాఖ తోపాటు పోలీస్ రెవిన్యూ పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేసే విజయవంతం చేశాయి. రాష్ట్ర వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక విధుల నిమిత్తం వచ్చిన పోలీసు బలగాల పహారాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలను చేపట్టారు. స్వామివారి ప్రసాదాలు భక్తులందరికీ అందించేందుకు వివిధ ప్రాంతాల వద్ద ప్రసాద కౌంటర్లను ఏర్పాటు చేశారు. స్వామివారి నది విహార కార్యక్రమంలో దేవస్థానం వారు ఏర్పాటు చేసిన బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హంస వాహనంపై ఆసీనులైన సీతారామచంద్రస్వామి వారిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, ఐటీడీఏ పీఓ ప్రతికా జైన్, ఆలయ ఈఓ రమాదేవీ, జిల్లా ఎస్పీ వినీత్.జీ, అడిషనల్ కలెక్టర్ రాంబాబుతో పాటు స్థానిక శాసనసభ్యులు తెల్లం వెంకటరావు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బ్రిలియంట్ విద్యాసంస్థలలో గణిత దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండలంలోని సారపాక బ్రిలియంట్ హైస్కూల్, జూనియర్‌లో భారతీయ గణిత శాస్త్రవేత్త అపర మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జాతీయ గణిత దినోత్సవంను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు గణిత ప్రాజెక్టులను ఎంతో అద్భుతంగా ప్రదర్శించారు. ఉదయ గిరి, నీలగిరి, ఆరావళి టీం విద్యార్థుల మధ్య నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ వంటి పోటీలలో కూడా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ టీంను గెలిపించుకున్నారు. అనంతరం బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత బీఎస్ఆర్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ దశాంశ పద్ధతిని, త్రికోణమితిని కనిపెట్టి గణిత శాస్త్ర అభివృద్ధి మానవాళి పెరుగుదలలో దాని ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు ఆయన వివరించారు. మీరందరూ కూడా శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆయన కోరారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మెన్ బీఎస్ఆర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి కే ఆదర్శం మణుగూరు

నవతెలంగాణ-మణుగూరు



పారిశ్రామిక ప్రశాంతతకు పెట్టిన పేరైన మణుగూరు సింగరేణిలో ఏరియా పరంగా చూస్తే 'చిన్న'గా ఉన్నప్పటికీ ఉత్పత్తి సాధనలో ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న 11 ఏరియాలకంటే 'మిన్న'గా లాభాల సాధనలో అగ్రగామిగా నిలుస్తూ రికార్డుల పరంపర సృష్టిస్తోంది. 1975-76వ సంవత్సరంలో 175 మంది మంది కార్మికులతో ప్రారంభమైన ఏరియా నాడు 5860 పురోగమించింది. 13,865 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన ఏరియా నేడు 117 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి అంచనా ప్రకారం మణుగూరు ప్రాంతంలో మొత్తం 45 కోట్లు బొగ్గు నిక్షేపాలుండగా ఇప్పటివరకు కేవలం పది కోట్లు టన్నుల బొగ్గు మాత్రమే వెలికి తీశామని అధికారులు అంటున్నారు. మణుగూరు ఏరియా ఏర్పడి ఇప్పటికే 50 సంవత్సరాలు పూర్తిచేసుకోగా మరో వందేళ్ల భవిష్యత్ ఉంది. మణుగూరులో ప్రారంభించిన తొలి బొగ్గుగని ప్రకాశంఖని నెం.1వ ఇంక్లైన్. రక్షణ వారోత్సవాల సందర్భంగా గత ఆరేళ్లుగా (మధ్యలో ఏడాది మినహా) అత్యుత్తమ గనిగా ఎంపికవుతూ సింగరేణిలోని 60 భూగర్భగనుల్లో విశిష్టస్థానం సంపాదించుకొంది. ఈ గనిలో 1100 మంది కార్మికులు పనిచేస్తున్నారు. 1974లో నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు చేతులమీదుగా ప్రారంభమైన ఈ గనిలో 400 లక్షల టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. గనిలో ఇప్పటిదాకా 10 శాతం బొగ్గు మాత్రమే వెలికితీసినట్లు లెక్కలు తెలుపుతున్నాయి. పవిత్ర గోదావరి నది ఒడ్డున ఉన్న పికె-2 గని 1988-89, 1997-98, 1998-99 మూడుసార్లు స్ట్రయిక్ ఫ్రీ(సమ్మె ఎరుగని) గనిగా విశిష్ట అవార్డుల నందుకొని రికార్డుల పరంపర సృష్టించింది. ఈ గనిలో 850 మంది కార్మికులు పనిచేస్తున్నారు. మూడు భూగర్భగనులతో 6000 మంది కార్మికులతో బొగ్గును వెలుగు తీసేవారు భూగర్భ గనుల స్థానంలో ఉపరితల గనులు ఆక్రమించుకున్నాయి. యంత్రాల వినియోగం విపరీతంగా పెరిగింది. ఉత్పత్తి వేగం పెరిగింది. కార్మికుల సంఖ్య తగ్గింది. కాంట్రాక్టర్ల సంఖ్య వేగంగా పెరుగుతుంది. రాష్ట్ర స్థాయిలోనే మణుగూరు ఉత్పత్తి ఉత్పాదికత రికార్డుల పరంపర కొనసాగుతూనే ఉంది. సింగరేణి ఏరియాలోనే మణుగూరుకు ప్రత్యేక స్థానం దక్కింది. బొగ్గు రవాణా లోనూ మణుగూరు రికార్డులను నెలకొల్పింది. రెగ్యులర్ కార్మికుల సంఖ్య 2396కు పడిపోయింది. కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య 4000కు చేరింది. ప్రస్తుతం ఓసి టు ఓసి ఫోర్ మణుగూరు ఓసి కొండాపురంలో నిర్వహించబడుతున్నాయి. వీటి కాలపరిమితి ఐదు సంవత్సరాలకి ఉన్నాయి కొత్త ఉపరితల గనులు పర్యావరణ అనుమతుల కోసం సింగరేణి సంస్థ ప్రయత్నించడం లేదు. మొత్తం ప్రైవేటు కరణ కావడంతో ప్రభుత్వ రంగ సంస్థలను సింగరేణి ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలు పనిచేస్తున్నాయి. కాంట్రాక్ట్ కార్మికులు రోజురోజుకు పెరుగుతు న్నారు. కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. ఓబి వెలుకితీతలోను ప్రైవేట్ కంపెనీలు అగ్రభాగాన ఉన్నాయి దేశవ్యాప్తంగా ప్రైవేటు కరణలో భాగంగా మణుగూరులో ఓసి ఫోర్ మణుగూరు ఓసిలలో ప్రైవేట్ కంపెనీలో బొగ్గుని వెలుగుతీస్తున్నాయి. పర్యావరణ క్రమశిక్షణ పాటించకుండా సింగరేణి నిర్లక్ష్యం వివరించడంతో మణుగూరు పరిసర ప్రాంతాల్లో నీరు గాలి విపరీతమైన కాలుష్యానికి గురవుతుంది. ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రభుత్వాలు యాజమాన్యం పట్టించుకోవడం లేదు. సిఎస్ఆర్ నిధులతో మణుగూరు మండలంలోని ఓసి ప్రభావిత గ్రామాలకు మంచినీరు, విద్యుత్తు, సోలార్ పవర్ ప్లాంట్‌లు మౌలిక వసతులు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని ప్రజలు ప్రజాసంఘాలు కోరుతున్నాయి.



పైరవీలు చేసే దళారీలను నమ్మొద్దు

- ఫ్రెండ్లీ పోలీసింగ్ భద్రాద్రి జిల్లా పోలీసుల లక్ష్యం
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించం
- చర్ల సీఐ బి.రాజగోపాల్

నవతెలంగాణ-చర్ల



తమ పబ్బం గడుపుకునేందుకు కొంతమంది మధ్య దళారీలు ప్రజలను మాయమాటలతో మోసం చేస్తూ పైరవీలు చేస్తున్నారని, అటువంటివారిని నమ్మవద్దని, ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి తమ వద్ద సమస్య పరిష్కరించుకోవాలని చర్ల సిఐ బి.రాజగోపాల్ కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలకు ఏ విధమైన సమస్యలు ఏర్పడి పోలీస్ స్టేషన్‌కు రావలసిన అవసరం ఏర్పడితే దళారులను ఆశ్రయించవద్దని, నేరుగా తమను కలిసి సమస్యలు తెలుపుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జి, ఓఎస్డి టి.సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పి పరితోష్ పంకజ్ ఆధ్వర్యంలో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తాము, తమ సిబ్బంది కట్టుబడి పని చేస్తున్నామని, ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణలో తమ సేవలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కొంతమంది వ్యక్తులు పోలీస్ స్టేషన్‌లో పైరవీలు చేస్తామంటూ ప్రజలను మభ్యపెడుతూ దళారీలుగా అవతారమెత్తారని తమ దృష్టికి వచ్చిందని, అటువంటివారు తమ పద్ధతులు మార్చుకోకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడేది లేదని హెచ్చరించారు. అలాగే మండలం పూర్తి ఏజెన్సీ ప్రాంతం కావడంతో కొంతమంది వ్యక్తులు మావోయిస్టు కార్యకలాపాలకు సహాయ సహకారాలు అందిస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమకు సమాచారం ఉన్నదని, ఇప్పటికైనా వారిలో మార్పు రాకపోతే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమస్యలపై తమ దగ్గరికి వచ్చిన ప్రజలను కుటుంబ సభ్యుల వలె, ఫ్రెండ్లీ పోలీసింగ్ తో సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఒక్కరూ నేరుగా తమని కలిసి సమస్య విన్నవించుకోవచ్చని సూచించారు.

ఈ సమావేశంలో ఎస్సైలు టి.వి.ఆర్ సూరి, నర్సిరెడ్డి, వెంకటప్పయ్య, పోలీస్ సిబ్బంది రవీంద్ర, బాలకృష్ణ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు మాధవరావు 52వ వర్ధంతి

నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని నాచారం గ్రామంలో సీపీఐ(ఎం) నాయకులు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, అమరజీవి కామ్రేడ్ ముండూరు మాధవరావు 52వ వర్ధంతి కొండారు ఎల్లమంద అధ్యక్షతన జరిగింది. మొదట మాధవరావు స్మారక స్తూపం వద్ద పార్టీ జెండాను సీనియర్ నాయకులు ఎంద్రాతి అప్పారావు ఎగురవేశారు. మాధవరావు చిత్రపటానికి వారి శ్రీమతి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ, ఎంద్రాతి అప్పారావు మాట్లాడారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం నిర్బంధం ఉన్న రోజుల్లో ఆనాటి జామిందార్లు జాకీర్దారులు పెత్తందారులకు వ్యతిరేకంగా భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికుల కోసం రైతుల కోసం పేద ప్రజల కోసం వారి వారి సమస్యలపై మిలిటెంట్ మిలిటెంట్ పోరాటాలు మాధవరావు నిర్వహించారన్నారు. 12 ఏళ్ళ వయసులోనే ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలోని కడలూరు జైలు జీవితం గడిపారని గొప్ప మహానుభావుడని ఆదర్శనీడని ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిల్లి నాయుడు, మోరంపూడి సూర్యనారాయణ, మోరంపూడి రామ్మోహన్రావు, బేతిని కుటుంబరావు, ఎంద్రాతి సత్యనారాయణ, కోమటి వెంకటేశ్వరరావు, చలపాటి జగన్, మొండూరి మాధవరావు కుమార్తెలు ఇందిరా, ప్రభావతి కుమారులు శివాజీ, రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.

తల్లిని హత్య చేసిన కేసులో కుమారునికి జీవిత ఖైదు

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్

తల్లిని హత్య చేసిన కేసులో కుమారునికి జీవితాఖైదు విదిస్తూ కొత్తగూడెం ప్రధాన జిల్లా న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పు చెప్పారు. 26-12-2020న భద్రాచలంకు చెందిన యర్రంశెట్టి వెంకట రత్నం నాయుడు తన ఫిర్యాదులో తాను వ్యాపారనిమిత్తం షాపుకు వెళ్ళేటప్పుడు వచ్చేప్పుడు తన తల్లి పార్వతమ్మ (65)ను పలుకరించి వెళ్ళేవాడినని 24-12-2020న కుడా మాట్లాడి వెళ్లానని తెల్లవారి వచ్చి చూసేసరికి తన మంచం నుంచి కింద పడి చనిపోయి ఉందని ఎవరి పై అనుమానం లేదని అప్పటి భద్రాచలం టౌన్ ఎస్.ఐ.వి.వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్‌లో చంపినట్లుగా రాగ, దర్యాప్తులో తన తమ్ముడు చంపినట్లుగా, తన తమ్ముడు యర్రంశెట్టి శ్రీనివాసరావు తన భార్య, కూతురి ముందు తన తల్లి పార్వతమ్మ ఇచ్చిన డబ్బులు అడిగిందుకు కక్ష పెంచుకొని, తల్లి ఇంటికి వెళ్లి, చంపి బంగారు ఆభరణం, ప్రామిస్సరీ నోట్ తీసుకొని వెళ్ళాడని వాటిని రికవరీ చేసారని అప్పటి ఇన్స్పెక్టర్ టి.స్వామి ఛార్జ్ షీట్ కోర్టులో దాఖలు చేశారు. కోర్టులో 19 మంది సాక్షులను విచారించారు. శ్రీనివాస రావు పై నేరం రుజువు అయినదని, కోర్టులో జీవిత ఖైదు, 6 వేయిల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసెక్యూషన్‌ను పబ్లిక్ ప్రాసెక్యూటర్ పోసాని రాదా కృష్ణ మూర్తి నిర్వహించారు. లైజన్ ఆఫీసర్ ఎస్.వీరబాబు కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ (పి.సి.) సుధీర్ బాబులు సహకరించారు.

మైనారిటీ గురుకుల సిబ్బంది వేతనాలు వెంటనే విడుదల చేయాలి

- మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీ గురుకులాల్లో పని చేస్తున్న సిబ్బంది జీతాలను వెంటనే విడుదల చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా శుక్రవారం నాడు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 204 మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న సుమారు 7570 మంది బోధన మరియు, బోధనేతర సిబ్బందితో పాటు గురుకుల సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు విడుదలకు నోచుకోలేదని అన్నారు. 3 రోజుల్లో క్రిస్మస్ పండుగ సమీపిస్తుండంతో వేతనాలు అందక ఉద్యోగులు ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మైనారిటీ గురుకుల సిబ్బంది వేతనాలు విడుదల అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం 23, డిసెంబర్ 2023





వ్యవసాయ కార్మికులకు సమగ్ర శాసనం చేయాలి

- కూలి బంధు ప్రకటించాలి
- ఇంటి స్థలం, సాగు భూములు పంపిణీ చేయాలి
- వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు సమగ్ర శాసనం చేయాలని, రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు కూలి బంధు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మంచికంటి భవన్‌లో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సాగు భూమి, ఇండ్ల స్థలాలు లేని పేదలకు సాగభూమి, ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. రాష్ట్రంలో పది లక్షల మంది వ్యవసాయ కార్మికులు ఉన్నారని, వారందరికీ సాగు భూమి, ఇండ్ల స్థలాలు లేక పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. కొత్త ప్రభుత్వం మంచి నిర్ణయాలు తీసుకోవడం హర్షిస్తున్నామని తెలిపారు. గ్రామీణ పేదలకు కనీస సౌకర్యమైన ఇంటి స్థలాలు, సాగు భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఏ సంక్షేమ పథకమైనా భూమి లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బి.చిరంజీవి, నిమ్మల వెంకన్న, ఆలేటి కిరణ్, సహాయ కార్యదర్శి గడ్డం స్వామి, బత్తుల వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు బందెల చంటి, వేణు, షారోని, సరళ, లక్ష్మయ్య, నాగరత్నమ్మ, అబీద, తదితరులు పాల్గొన్నారు.





నాడు ప్రపంచ పరిశ్రమల పటంలో ప్రధమ స్థానం

- నేడు బొగ్గు బ్లాకుల దారదత్తంతో అధమ స్థానం
- కనుమరుగౌతున్న కోల్ ఇండియా, సింగరేణి గనులు
- పట్టింపులేని గుర్తింపు సంఘాలు

నవతెలంగాణ-ఇల్లందు

ప్రపంచ పరిశ్రమల పటంలో ప్రధమ స్థానం పొందిన కోల్ ఇండియా ప్రయివేటీకరణ విధానాలతో అధమ స్థానంలోకి వెళ్ళింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రధాని మోడీ నేతృత్వంలో కోల్ ఇండియాలో ప్రయివేటీకరణ జోరందుకుంది. దేశవ్యాపితంగా 161 బొగ్గు బ్లాకులు, సింగరేణిలో సత్తుపల్లి, కోయగూడెం రెండు ప్రవేటీకరించారు. త్వరలో ప్రారంభించనున్న ఇల్లందులోని పూసపల్లి ఓసి సైతం ప్రయివేటకు అప్పగించడానికి యాజమాన్యం పూనుకుంటోంది. దీంతో ప్రాభవం కోల్పోతోంది. ఇల్లందుకు 10కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆనాటి కుగ్రామం కారేపల్లిలో దేశంలోనే తొలిసారిగా 1870లో బొగ్గును కనుగొన్నారు. బ్రిటీష్ కాలంలో దేశంలో ప్రప్రధమంగా బొగ్గుగనులు 1871లో కనుగొన్నారు. 1886లో దక్కన్ కంపినీ పేరుతో బొగ్గు నిక్షేపాలు వెలికితీశారు. ఆనాడు బొగ్గుట్ట, నేడు ఇల్లందు. అనంతరం 1920లో సింగరేణి కాలరీస్ లిమిటెడ్ పేరుతో మార్చి షేర్లను లండన్‌కు తరలించారు. 1945లో నిజాం ప్రభుత్వం షేర్లను కొనుగోలు చేసింది. ఆనాడు దేశంలో మొట్టమొదటి ప్రభుత్వరంగ సంస్థగా సింగరేణి కాలరీస్‌ను ప్రకటించారు. 1949లో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. 1956లో సింరేణి కాలరీస్ కంపిని లిమిటెడ్‌గా మార్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50-49 శాతాలుగా వాటాలు తీసుకున్నాయి. ఆనాడు 11వేలు మంది కార్మికులు పనిచేశారు. ఆనాడు దర్జాగా బతికిన కార్మికులు, ప్రజలు నేడు దీనావస్థకు చేరారు. కేవలం 599 మంది కార్మికులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో గుర్తింపు సంఘాలుగా గెలిచిన ఏఐటియుసి, టిబిజికెఎస్‌లు ప్రయివేటీకరణ అడ్డుకోలేకపోయారని, కార్మికులకు ఇన్‌కం ట్యాక్సు రద్దు తదితర సమస్యలు పరిష్కరించలేకపోయారని కార్మికులంటున్నారు.

నిల్వ ఉంచిన పీడిఎస్ రైస్ పరిశీలించిన అధికారులు

- లెక్కల్లో కనిపించని 120 బస్తాల బియ్యం
- అక్రమ నిల్వల బియ్యం సీజ్

నవతెలంగాణ-కొత్తగూడెం

పేద ప్రజలకు అందాల్సిన పౌరసరఫరాల బియ్యాన్ని అక్రమార్కులు నిల్వ ఉంచి, బ్లాక్ మార్కెట్‌కు, రైసు మిల్లులకు తరలిస్తుంటారు....గత రెండు సంవత్సరాలుగా నిల్వ ఉన్న పీడిఎస్ రైస్‌ను స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారులు తనిఖీచేసీ అక్రమంగా నిల్వ ఉంచిన పీడిఎస్ బియ్యాని సీజ్‌చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని రామవరంలో ఉన్న 21వ రేషన్ షాప్‌కు సంబంధించిన పీడిఎస్ రైస్ గత రెండు సంవత్సరాల క్రితం 120 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఆనాటి అధికారులు. ఈ రేషన్ షాపుకు రెండు దఫాలుగా రేషన్ కోటా కంటే అదనంగా సరఫరా చేసినట్లు గతంలో వెలుగులోకి వచ్చిన విషయం పాఠకులకు విధితమే. అధికారులు అక్రమంగా బియ్యాన్ని గోడౌన్‌కు తరలించకుండా వదిలేశారు. మున్సిపల్ పరిధిలోని 21 నెంబర్ షాపును ఇక్కడి నుంచి మరోచోటికి తరలించడంతో సీజ్ చేసిన బియ్యం ఇక్కడే ఉంచేశారు. ఇదంతా అధికారులకు సమాచారం లేకుండా నిల్వ ఉంచారని ఆరోపనలు ఉన్నాయి. ఈ బియ్యం పూర్తిగా తడిచి పోయాయి. ముక్కవాసన రావడం, పందికొక్కుల పాలు కావడంతో దుర్వాస నను వెదజల్లు తుండడంతో స్థానికులు అధికా రులకు సమాచారం అందిం చారు. శుక్రవారం సివిల్ సప్లై జిల్లా అధికారులు నిల్వ ఉన్న బియ్యాన్ని పరిశీ లించారు. రేషన్ బియ్యం నిల్వతో పాటు పాడైన విషయంపై జిల్లా సివిల్ సప్లై అధికారిని రుక్మిణి దేవి, సివిల్ సప్లై డిటి శ్రీనివాస రావులు విచారణ ప్రారం భించారు. నిల్వ ఉండడంతో పాటు పాడైన బియ్యాన్ని పరిశీలించారు. రేషన్ డీలర్ కృష్ణతో మాట్లాడారు. గతంలో పట్టుకున్న బియ్యం తాలూకు వివరాలను పూర్తిస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. పేదలకు చెందాల్సిన బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన వారిని వెలికితీసి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



త్రివేణిలో గణిత దినోత్సవం వేడుకలు

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

స్థానిక లక్ష్మీదేవి పల్లిలో గల త్రివేణి పాఠశాలలో భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గత ఐదు రోజులుగా గణిత ఉత్సవాలు జరుపుతున్నారు. పలు రకాల గణిత ప్రక్రియలతో కోలాహలంగా త్రివేణి ప్రాంగణం ముస్తాబయింది. నూతన ఆవిష్కరణలతో ఆవిష్కరితమైంది. నవతరానికి యువ మేధా సంపన్నులు విద్యార్థినీ, విద్యార్థులని డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి కొనియాడారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి జగదీష్, సిఆర్‌ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సింగ్, వై.వి.సురేష్, వైస్ ప్రిన్సిపల్ సౌజన్య పాల్గొన్నారు.

మండల వ్యాప్తంగా ఘనంగా గణిత దినోత్సవం

నవతెలంగాణ-పినపాక



జాతీయ గణిత దినోత్సవాన్ని పినపాక మండల వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు, ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో గల ఎక్సలెంట్ భాషా హై స్కూల్, రాధిక కాన్సెప్ట్ హై స్కూల్‌లో గణిత భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇండియన్ మ్యాథమెటికల్ జీనియస్ శ్రీనివాస రామానుజన్ జయంతిని జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటారని విద్యార్థులకు వివరించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిత్య జీవితంలో గణితం ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. గణిత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలోఎక్సలెంట్ గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మెన్ ఎండీ యూసఫ్ షరీఫ్, డైరెక్టర్స్ ఎండీ ఖాదర్, ఎండీ యాకుబ్ షరీఫ్, ముక్కు నర్సారెడ్డి, బండారు నరేంద్ర, ప్రిన్సిపాల్ అంకం సురేష్, రాధిక హై స్కూల్ కారస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నిరోషారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు వెలుగులు...కార్మికులకు చీకట్లు

- స్వప్రయోజనాలకే పరిమితమైన గుర్తింపు సంఘాలు
- యేటా సంబరాలతోనే సరి
- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణిలో బొగ్గుగనులకు పుట్టినిల్లు ఇల్లందు. కారేపల్లి రహదారిలో బొగ్గు నిక్షేపాలు తొలుత కనుగొన్నప్పటికి బొగ్గు తవ్వకాలు 1889లో ఇల్లందులోనే ప్రారంభమైయ్యాయి. 135 ఏండ్ల చరిత్ర కలిగిన ఇల్లందు(బొగ్గుట్ట) నాడు కళకళలాడింది. నేడు పూర్తిగా నాటి పూర్వవైభవాన్ని కోల్పోయింది. నేడు ఓసిలతో మట్టి గుట్టలుగా మారి దీనావస్థలో ఉంది. కేంద్రం ప్రభుత్వం, కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలు రూ.లక్షల కోట్లు గడించాయి. వాటి దాహం తీరకపోవడంతో బొగ్గుగనుల్లో సంస్కరణలను ప్రవేశపెట్టి, కార్మికుల హక్కులను కాలరాశాయి. భూగర్భగనులను మూసివేసింది. కార్మికులను కుదిస్తూ నిర్వీర్యం చేసింది. నేడు 135వ ఆవిర్భదినోత్సవాన్ని జరుపుకుంటోంది.

సంస్కరణలతో భూగర్భగనులు మూసివేత

యేటా ఉత్పత్తి పెరుగుతున్నా తగ్గుతున్న కార్మికులు

135 సంవత్సరాల చరిత్రకల సింగరేణిని బొందల గడ్డగా మార్చిన ఘనత గుర్తింపు సంఘాలకే దక్కిందని కార్మికులంటున్నారు. గుర్తింపు సంఘాలుగా ఉన్నంతకాలం స్వప్రయోజనాలకే పాటుపడ్డారని కార్మికులు అంటున్నారు.



వీరికి ప్రోత్సాహం ఇచ్చి వెన్నంటి ఉన్నది నేటి మాజి సిఎం చంద్రబాబు. సింగరేణిలో సంస్కరణలు 1998లో ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు ప్రవేశపెట్టారు. తొలుత ప్రయివేటీకరణకు గురైంది ఖమ్మం జిల్లా టేకులపల్లి సమీపంలోని కోయగూడెం ఓసి. సింరేణిలో గుర్తింపు సంఘాలు యాజమాన్యానికి బాసటగా నిలవడంతో సంస్కరణల బాట పుంజుకొంది. ఖమ్మం, వరంగల్, కరీంనగ్, ఆదిలాబాద్ జిల్లాలలో 56 భూగర్భ బొగ్గుగనులు ఉండగా నేడు 30కి పడిపోయింది. ఓసిలు సంఖ్య 16 కి చేరింది. సంస్కరణల నేపధ్యంలో భూగర్భ గనుల్లో హెచ్ఎల్‌డి(లోడ్ హైడర్ డంపర్) ప్రవేశపెట్టారు. తొలుత ఇల్లందు 21 భూగర్భగనిలో 1983లో ప్రవేశపెట్టారు. ఒక యంత్రం 50 మంది కోల్ ఫిల్లర్ల శ్రమ శక్తికి సమానం. సింగరేణిలో 40 వరకు ఉన్నట్లు సమాచారం. భూగర్భగనిలో యంత్రాలతోపాటుగా ఓసిల సంఖ్య పెరిగింది. 1.50లక్షల మంది ఉన్న కార్మికులు నేడు



39 వేలకు పడిపోయింది. యాంత్రీకరణతోపాటుగా బొగ్గు ఉత్పత్తి అధికమైంది. కార్మికుల సంఖ్య తగ్గింది. కాంట్రాక్టు కార్మికుల సంఖ్య 25 వేలకు చేరింది. సింగరేణి కార్మికులకు మినిమం రూ.25 వేల వేతనం కాగ ప్రయివేటీకరణ మూంగా కాంట్రాక్టు కార్మికులకు కేవలం రూ.8 వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారు. వారు శ్రమ దోపిడికి గురౌతున్నారు.

ప్రతి యేటా సంబరాలతోనే సరి

నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం

సింగరేణి వ్యాపితంగా భూగర్భ గనులను కుదించి, ఓసిలు ప్రవేశపెట్టి నిర్వీర్యం చేసి కార్మికులను ఇంటికి పంపిన యాజమాన్యం ఎం సాధించిందని ప్రతి యేటా సంబరాలు చేసుకుటోందని కార్మికులు అంటున్నారు. ప్రతి యేటా సింగరేణి యాజమాన్యం అవిర్భావ దినోత్సవాల పేరుతో వేడుకలకు రూ.లక్షలాది ఖర్చుపెట్టడం సరికాదంటున్నారు. శ్రమ చేస్తున్న కార్మికులకు లాభాల బోనస్‌లో కొంత మొత్తం అధికంగా చెల్లించడంలో మీనమేషాలు లెక్కిస్తారు. కమీషన్లకు కక్కుర్తిపడి ఓపెన్‌కాస్టులకు ప్రాధాన్యమిస్తూ కార్మికుల పొట్టకొట్టడమే కాకుండా పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారని మండిపడుతున్నారు. పట్టణాలను బొందలగడ్డగా మార్చుతున్నారు. ఇల్లందు పట్టణ, గ్రామాల అభివృద్ధికి షేప్ నిధులకు కొర్రీలు పెట్టి విస్మరించడం దారుణమంటున్నారు. ఎం సాధించారని ప్రతియేటా సంబరాలు చేస్తున్నారని యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్నారు.

కొత్తగనులు ప్రారంభింపజేయడం ద్వారా సంబరాలు చేస్తే ఆదర్శంగా ఉంటుంది

బ్రిటీష్ కాలం నాటి వైభవాన్ని సాధించడంకోసం సింరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యాజమాన్యం కొత్తగనుల ప్రారంబోత్సవాలతో సంబరాలు చేస్తే ఆదర్శంగా ఉంటుంది. ప్రతి యేటా కొత్తబావులు, కార్మికుల సంఖ్య పెంచాలి. రక్షణతో కూడిన 5గంటల పని కల్పించడం. కార్మికుల పిల్లలకోసం ఏర్పాటైన డిపెండెంట్ ఎంప్లాయిమెంటును తాజాగా పునరుద్దరించడం సంతోషకరం. అధికారులకు, శాశ్వత ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు వేతన, ఇతర సౌకర్యాలలో వ్యత్యాసాలు తొలగించాలి. క్యాంటిన్‌లో నాణ్యమైన తినుబండారాలు అందరికి అందేవిధంగా ఉండాలి. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు ఉచిత వైద్యసౌకర్యం తదిర కార్మిక సంక్షేమ పథకాలు. బొగ్గుగనుల పరిసర ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించడం ద్వారా సింగరేణి సంబరాలు జరపాలని కార్మికులు, ప్రజలు కోరుతున్నారు.

గుంపులుగా గుమికూడవద్దు

- సోమవారం నుండి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు
- సూపరింటెండెంట్ డాక్టర్ పూర్ణ చంద్

నవతెలంగాణ-అశ్వారావుపేట



ప్రజలు గుంపులుగా గుమిగూడవద్దని సూపరింటెండెంట్ డాక్టర్ పూర్ణచంద్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి కరోనా కలకలం సృష్టించడంతో వైద్యారోగ్యశాఖ అప్రమత్తం అయింది. ఇప్పటికే గతంలో కోవిడ్ చికిత్సకు కేటాయించిన కేంద్రాల్లో ఇప్పటికే రోగులకు కావాల్సిన వైద్య సౌకర్యాలను సిద్ధం చేస్తుంది. ఈ క్రమంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ పూర్ణ చంద్ శుక్రవారం నవతెలంగాణ వివరణ కోరగా సోమవారం నుండి కరోనా వైరస్ ఏంటి జెన్ నిర్ధారణ పరీక్షలు చేయడం ప్రారంభిస్తామని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కోవిడ్ నిర్ధారణ అయితే వైద్యం అందజేయడానికి బెడ్ లు, ఆక్సిజన్ సిద్దంగా ఉందని తెలిపారు. గుంపులు గుంపులు గుమికూడవద్దని, ఊపిరి తిత్తుల, గుండె, సుగర్ వ్యాధులు ఉన్న వారు రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-మణుగూరు

ఎక్సలెంట్ హై స్కూల్ పైలట్ కాలనీ బ్రాంచ్ నందు శుక్రవారం గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ ఎండి ఖాదర్ మాట్లాడుతూ ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు అయిన డిసెంబర్ 22వ తేదీన ప్రతి సంవత్సరం జాతీయ గణిత శాస్త్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర ఉపాధ్యాయులు భద్రరాజు, రాజారత్నం, జయచిత్ర, విజయ, శ్రీలతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మా ప్రాధాన్యతను తెలిపే పాటలకు చిన్నారులు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ యూసఫ్ షరీఫ్, యాకూబ్ పాషా, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో గణిత శాస్త్ర దినోత్సవం

శ్రీ చైతన్య పాఠశాల గుట్ట మల్లారం నందు శుక్రవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సాయి కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి కృష్ణ ప్రసాద్, డీన్ నరేష్, సి బ్యాచ్ ఇంచార్జ్ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాంటిసోరి గ్రూఫ్ ఆప్ స్కూల్స్, శ్రీ సత్య భాస్కర పాటశాలలో

మాంటిసోరి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ శ్రీ సత్య భాస్కర పాఠశాల నందు జాతీయ గణిత దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ విశిష్టతను మేధస్సును ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు చక్కటి సందేశం విద్యార్థులకు ఇచ్చారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి పాఠశాల ప్రధా న ఉపాధ్యాయులు ఐసాక్ థామస్, డైరెక్టర్ ముల్లంగి శివారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐసాక్ థామస్, డైరెక్టర్ ముల్లంగి శివారెడ్డి, గణిత ఉపాధ్యా యునీ, ఉపాధ్యాయులు సన్మానించారు. పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : మండల కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు విద్యార్థినీ, విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ గురించి ఆయన కనుగొన్న విషయాల గురించి తెలియజేశారు. గణితం అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి అయినటువంటి మల్లెల శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీల సస్పెన్షన్ రాజ్యాంగ విరుద్ధమైన చర్య

- ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్న బిజెపి ప్రభుత్వం
- సస్పెన్షన్ ఎత్తివేసి దేశ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలి
- ప్రతిపక్ష పార్టీల జిల్లా నేతలు
- సీపీఐ, సీపీఐ(ఎం), కాంగ్రెస్, ఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-కొత్తగూడెం



పార్లమెంటులో 146 మంది ఎంపిలను ఊకుమ్మడిగా సస్పెండ్ చేయడం బిజెపి నిరంకుశ పాలనకు నిదర్శనమని, ప్రశ్నించే గొంతుకలు చట్టసభనుంచి వెలివేసి హిట్లర్ తరహా పాలనను కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తోందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, కాంగ్రెస్ జిల్లా నాయకులు అంతోటి పాల్, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చల రంగయ్య, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకలు కందగట్ల సురేందర్ అన్నారు. 146 మంది ఎంపిలను పార్లమెంటు నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ వామపక్షాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం బస్టాండ్ సెంటరులో అమరవీరుల స్తూపం వద్ద ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించే విదంగా ఎంపిలను సస్పెండ్ చేసిందని విమర్శించారు. పార్లమెంటుపై దాడి చేసేందుకు పాసులు జారీచేసిన ఎంపీని పార్లమెంటులో ఉంచి, ఈ చర్యలను ప్రశ్నించిన ఎంపిలను బయటకు గెంటివేయడమేంటని ప్రశ్నించారు. ఇండియా కూటమి ఐక్యతను జీర్ణించుకోలేని బిజెపి ప్రభుత్వం పరోక్ష దాడులను పూనుకుంటోందని ఆరోపించారు. మోడీ ఫాసిస్టు పాలనను, అప్రజాస్వామిక, మతోన్మాద పాలనను అంతం చేసి ప్రజాస్వామ్యాన్ని గౌరవించే పాలన ఈ దేశానికి అవసరమని, రానున్న ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక, నిరంకుశ పాలనకు స్వస్తి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఎన్డీయే కూటమికి చరమగీతంపాడాలని, ఎంపీల సస్పెన్షన్ ఎత్తివేసి, దేశ ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని నేతలు డిమాండ్ చేశారు. అనంతరం అమరవీరుల స్తూపం నుంచి మధువన్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, భూక్యా రమేష్, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, ఎస్.లక్ష్మి, స్వామి, వీరభద్రం, వీరన్న, సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్యా శ్రీనివాస్, కె.రత్నకుమారి, ఎస్‌కె.ఫహీమ్, ప్రజాపంథా, న్యూ డిమోక్రసీ పార్టీల జిల్లా నాయకులు మాచర్ల సత్యం, మల్లికార్జున్, బానోత్ కిషన్, భూక్యా రాజేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో, ప్రజా వ్యతిరేక విధానాలను చేపడుతున్నదని, కాంగ్రెస్, మిత్రపక్షాల కార్యకర్తలు, ప్రజలు కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండకట్టాలని డీసీఎంఎస్ వైస్ చైర్మెన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పార్లమెంట్‌లో 146 మంది ఇండియా కూటమి ఎంపీలను అప్రజాస్వామ్యంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ పాల్వంచలో శుక్రవారం కాంగ్రెస్, సీపీఐ, తెలుగుదేశం కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, నందా నాయక్, ఐఎన్టియుసి నాయకులు తెలుగుదేశం నాయకులు కనగాల అనంతరాములు, రత్నం నాయకులు ముత్యాల విశ్వనాధం, వీసంశెట్టి పూర్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.





లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థలలో గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భారతదేశానికి చెందిన అపర గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల నందు గణిత శాస్త్ర వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి శ్రీనివాస వరప్రసాద్, మాగంటి రమేష్ బాబు, జూనియర్ కాలేజి గణిత అధ్యాపకులు ఎండీ.బషీర్ ప్రారంభించారు. తర్వాత మాగంటి రమేష్ బాబు, ఎండీ.బషీర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రామానుజన్ గణితంలో సాధించిన విజయాలను గణిత శాస్త్ర అభివృద్ధికై చేసిన కృషిని వివరించారు. కావున కఠోర తపస్సుతో మనిషి అనుకున్నది సాధించగలడని దానికి శ్రీనివాస రామానుజన్ నిదర్శనమని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు వృత, త్రిభుజ, దీర్ఘ చతురస్రాకారంలో నిలోచోని అబ్బురపరచినారు. విద్యార్థులు చేసినటువంటి పాలిగన్స్ నమూనాలు, పైథాగరస్ సిద్ధాంతం, ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్, వాస్తవ సంఖ్యలు, వైశాల్యము, చుట్టుకొలత, త్రికోణమితి, సంభావ్యత, మొదలైన అంశాలపై ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దళిత బంధు స్కీమ్‌లో పేర్లు కేటాయించిన వారికి దళిత బంధు అందించండి

నవతెలంగాణ-పినపాక



గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దళిత బంధు పథకంలో పేర్లు కేటాయించిన వారికీ దళిత బంధు అందించాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ప్రశాంత్ మాట్లాడుతూ ఎంపీడీవో, కలెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, తమకు కేటాయించిన, మంజూరైన యూనిట్లను వెంటనే గ్రాంట్ రిలీజ్ చేయవలసిందిగా పినపాక మండల దళిత ప్రజలు తరుపున కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులుపాల్గొన్నారు.

పైడిగూడెంలో సెల్ టవర్‌ను పేల్చేందుకు మావోయిస్టుల విఫల యత్నం

- ఛతీస్‌ఘడ్‌లో పలు సెల్ టవర్లు పేల్చి వేత

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన పైడిగూడెం గ్రామంలో గల సెల్ టవర్‌ను పేల్చి వేసేందుకు వచ్చి విఫల యత్నం చేశారు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో గుర్తు తెలియని కొంతమంది వ్యక్తులు సెల్ టవర్ ప్రాంతానికి వచ్చి బీరు సీసలతో తయారు చేసిన పెట్రోలు లాంతర్లు విసిరారు. ఆ సమయంలో చుట్టుపక్కల మహిళలు



పెద్దగా కేకలు వేయడంతో వారు అక్కడి నుండి వెళ్లిపోయారు. దీంతో చెలరేగిన మంటలను స్థానికులు అర్పి వేశారు. దీంతో పాటు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుక్మా, బీజాపూర్ జిల్లాలో పలు సెల్ టవర్లను మావోయిస్టు తగుల పెట్టారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శనివారం డిసెంబర్ 23, 2023 www.navatelangana.com

నేత్ర పర్వంగా తెప్పోత్సవం..

హంస వాహనంపై స్వామివారు జల విహారం..

జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన గోదావరి నది తీరం..

నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయమైన పవిత్ర పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. సీతారామ లక్ష్మణ స్వామి వారిని పవిత్ర గోదావరి నది తీరంలో హంస వాహనంపై ఐదు సార్లు జలవిహారం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పర్ణశాల రామయ్య తెప్పోత్సవంలో భాగంగా సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాల నడుమ సన్నాయి వాయిద్యాల సందడితో శ్రీరామ నామస్మరణతో గోదావరి నది తీరానికి తోడుకొని వచ్చారు. హంస వాహనంపై స్వామివారిని కూర్చోబెట్టి గోదారమ్మకు ప్రత్యేకంగా పూజలు హారతులు నిర్వహించారు. స్వామివారి పల్లకి సేవకు భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. పర్ణశాల గోదావరి ప్రాంతం జై శ్రీరామ నామస్మరణతో మార్మోగింది ఈ కార్యక్రమంలో తాసిల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో ముత్యాలరావు, సీఐ దోమల రమేష్, ఎస్ఐ కేశవ్, ఆలయ ఉత్సవాల ప్రత్యేక అధికారులు శ్రవణ్ కుమార్,అనిల్ కుమార్, ఉత్సవాల ప్రత్యేక అధికారి, మణుగూరు ఎంపీడీవో చంద్రమౌళి, చర్ల తాసిల్దార్ అనంత రామకృష్ణ, టిసి సీతమ్మ సర్పంచ్ వరలక్ష్మి, సీతమ్మ సాగర్ డిఈ నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ రాజ్ సుహాస్,విద్యుత్ శాఖ ఏఈ మోహన్‌రెడ్డి, పర్ణశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేణుకా రెడ్డి,ఆలయ ముఖ్య అర్చకులు శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, ఇతర అర్చకులు,ఆలయ సూపరిడెంట్ కిషోర్, పంచాయతి కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య, ఆలయ ఇంచార్జ్ ప్రసాద్తో పాటుగా భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీనివాస రామనుజన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాల, నర్సాపురం నందు శుక్రవారం శ్రీనివాస రామనుజన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు గపూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు వ్యాస రచన, గణిత ముగ్గుల పోటీలు, గణిత క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గణిత ఆధార నాటికలను, పాటలను పాడించారు. పోటీలలో గెలుపొందిన వారికీ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానపద్యాయులు బి.వెంకటేశ్వర్లు, గణిత ఉపాధ్యాయులు కల్లూరి బొర్రయ్య, సోయం కృష్ణ, తెల్లం సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండల పరిధిలోని సుబ్లేడు గ్రామంలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా 22 శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర పరిశోధకులు రామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.గోవిందరావు,ఎస్ఎంసి చైర్మన్ కామల్ల వీరయ్య రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, నృత్య పోటీలు, నిర్వహించిన అనంతరం బహుమతులు ప్రధానం చేశారు. గణిత అధ్యాపకులు ఎస్.వెంకటేశ్వరరెడ్డి, డి.బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ, గోపాలరావు, మల్లికార్జున్, భ్రమరాంబ, పీఈటి శివ, తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : గణిత పితామహుడు శ్రీ శ్రీనివాస రామానుజం జయంతి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీనివాస రామానుజం చిత్రపటంకు ప్రధానోపాధ్యాయురాలు పరుచూరి హరిత తో పాటు బోధనా ఉపాధ్యాయులు పుష్పాలు సమర్పించి నివాళ్ళు అర్పించారు. అనంతరం విద్యార్థులచే నిర్వహించిన గణిత ఫేర్ లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్టమస్ వేడుకలు

నవతెలంగాణ-చంద్రుగొండ

చంద్రుగొండలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. క్రిస్మస్ పర్వదినం గురించి ప్రిన్సిపాల్ ఆశ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్సీఎం చర్చి ఫాదర్ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీలను సస్పెండ్‌పై ఖండన, నిరసన : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఇల్లందు



భారత పార్లమెంట్లో ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ వామ పక్షాలు పిలుపు లో భాగంగా శుక్రవారం పెట్రో బంక్ ఎదురు గా సీపీఐ(ఎం) అధ్వర్యంలో నిరసన కార్యక్రమం, ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో మండల కార్యదర్శి అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం లో మన్యం మోహన్ రావు, కూకట్ల శంకర్, ఎండీ. అబ్బాస్,వాసం రాము, ఆర్ బీ జే రాజు, వరంగంటి రాజ మొగిలి, సత్యనారాయణ కోరి, కామ కోటేశ్వరరావు, వీరకృష్ణ, బండి అంజి, సుధీర్, సత్యనారాయణ వాసం తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో మొదలైన ఎన్నికల వేడి...

- ప్రచారంలో దూసుకు పోతున్న సీఐటీయూ
- 84 బూతులు.. 12 లెక్కింపు కేంద్రాలు
- పోటీలో 13 యూనియన్లు
- 39,809 మంది ఓటర్లు

నవతెలంగాణ-కొత్తగూడెం



సిరుల తల్లి సింగరేణిలో ఎన్నికల వేడు పెరిగింది. సీతాకాలం ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా కార్మిక సంఘాలు ఎన్నికల ప్రచారాల సాగిస్తున్నాయి. సిఐటియూ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుంది. గుర్తింపు కార్మిక సంఘాల కంటే సిఐటియూ కార్మికులకు చేసిన అనేక ప్రయోజనాలు కార్మికులకు వివరిస్తున్నాయి. సింగరేణి రక్షించుకోవాలంటే సిఐటియూకే ఓటు వేయాలని కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి తలమానికమైన సింగరేణి ప్రభుత్వరంగ సంస్థలో ఎన్నికల వేడి రోజురోజుకు పెరుగుతుంది.ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించేందుకు యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేశారు. సింగరేణి సంస్థలో 1998 నుంచి ఎన్నికలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2017లో సంస్థలు ఎన్నికలు జరగగా పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చాయి. బిఆర్ఎస్ ప్రభుత్వం పలుమార్లు కోర్టు మెట్లు ఎక్కడం జరిగింది. సింగరేణి యాజమాన్యం ఉత్పత్తి కారణాలను సాకు చెబుతూ ఎన్నికలు వాయిదా వేసుకుంటు వచ్చాయి. ఎట్టకేలకు తాజా ఈనెల 21వ తేదీన కోర్టు తీర్పుతో ఈనెల 27న ఎన్నికలు నిర్వహించేందుకు అధికారుల సిద్ధమయ్యారు.

ఎన్నికల వేడి....ఏర్పాట్లు...

సింగరేణి సంస్థలో ఎన్నికల వేడి ప్రారంభమైంది. మొత్తం 12 ఏరియాలలో 39,809 మంది ఓటర్లు ఉండగా 84 బూతులను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఎన్నికల అధికారులు ఆదేశించారు. అధికారులు బూతుల ఏర్పాటు ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఎన్నికలు పూర్తవగానే సాయంత్రానికి లెక్కింపు ప్రక్రియ కోసం మొత్తం 12 ఏరియాలలో 12 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం సింగరేణి వ్యాప్తంగా 13 యూనియన్లు ఎన్నికల బరిలో నిలువగా అన్ని యూనియన్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. ఈసారి ఎన్నికల బరిలో టిబిజికెఎస్ ఉండే అవకాశం లెకుండా పోయిందని తెలుస్తుంది.

సింగరేణి ఓటర్లు....

సింగరేణిలో ఈనెల 27న జరిగే ఎన్నికల్లో 39809 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో 1,191, కొత్తగూడెం ఏరియాలో 23 31, ఇల్లందు ఏరియాలో 613, మణుగూరు ఏరియాలో 2,452, రామగుండం ఏరియా-1లో 5,404, రామగుండం ఏరియా-2లో 3,557, ఆర్జీ ఏరియా-3లో 3,884 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. భూపాలపల్లి ఏరియాలో 5,395, బెల్లంపల్లి ఏరియాలో 998, మందమరిలో 4,835, శ్రీరాంపూర్‌లో 9,149 ఓటర్లు యూనియన్ల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు.

ప్రజా తీర్పుని గౌరవిద్దాం..

- ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిద్దాం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిద్దామని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిద్దామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక పిండిప్రోలు పద్మనాభుల పుల్లయ్య భవనంలో కిన్నెర వెంకన్న అధ్యక్షతన జరిగిన పిండిపోలు గ్రామశాఖ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల ఆధారంగా మన పార్టీ బలాన్ని లెక్కవేయద్దని, పార్టీ బలానికి అనుకూలంగా ఓట్లు రాలేదని, అయినా ప్రజల ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ప్రజల దగ్గరకు వెళ్లాలని దానికోసం ప్రజల నుంచే ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్మించేందుకు సిద్ధం కావాలని, ప్రజా సమస్యలపై ఉద్యమించేందుకు మరింత ముందుకు కార్యకర్తలు సాగాలని సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ పార్టీ బలహీనంగా ఉన్నప్పుడు బలోపేతానికి ప్రతి కార్యకర్త నీకు లాగా పని చేయాలని, అట్లా అనేక సందర్భాల్లో పార్టీ బలహీనంగా ఉన్నప్పుడు పార్టీ కార్యకర్తల సైనికులను పనిచేసే పార్టీ బలాన్ని పెంచిన సందర్భాలు ఉన్నాయని ఆయన సందర్భంగా గుర్తు చేశారు.

సీపీఐ(ఎం) పెండిప్రోలు నూతన శాఖ కార్యదర్శిగా దొడ్డ లింగస్వామి



పిండిప్రోలు నిర్వహించిన సీపీఐ(ఎం) గ్రామ శాఖ సమావేశంలో నూతన కార్యదర్శిగా దొడ్డ లింగస్వామి ఎన్నుకున్నారు. లింగస్వామి పార్టీకి సీనియర్‌గా గత అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి పిండిప్రోలు గ్రామంలో పార్టీ పెరుగుదలకు కృషి చేస్తారని తెలియజేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, మండల నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, పద్మనాభల సుధాకర్,పప్పు ప్రసాద్, నాగాటి సురేష్, గ్రామ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, రవి, పిట్టల పాపారావు, పప్పుల ఉపేందర్, భూషయ్య, నిర్మల్‌రావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మిన కార్మికులను ముంచిన నాయకులు

- మూకుమ్మడిగా కాంగ్రెస్‌లోకి టీబీజీకేఎస్ నాయకులు
- అధికారం కోసమే పాకులాట

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి సంస్థలో గుర్తింపు సంఘంగా చలామణి అయిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికేఎస్) అగ్ర నేతలు మూకుమ్మడిగా ఆ కార్మిక సంఘానికి గుడ్ బై చెప్పేశారు. రాష్ట్రంలో తాజా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం ఎట్టకేలకు బోర్డు తిప్పేసింది. ఆ సంఘాన్ని, నాయకులను నమ్ముకున్న కార్మికులను నట్టేట ముంచి నాయకులు అధికార కాంగ్రెస్ గూటిలో చేరిపోయారు. గత కొంత కాలంగా తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం పేరుతో విర్రవీగిన నాయకులు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో కార్మిక సంఘం నేతలు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. ఇంత కాలం అధికారం ధాంభికాన్ని అనుభవించిన వారు మళ్లీ అధికారం లేకపోతే బతకలేని స్థితికి చేరుకున్నారు. ఇప్పటికే పైరవీకారులగా ఉన్న వారు కార్మికుల నుండి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారు. మెడికల్ బోర్డు, ట్రన్స్‌ఫర్స్, ఇతర విషయాల్లో కార్మికులనుండి పెద్దఎత్తున వసూళ్లు చేసిన నాయకులకు కార్మిక సంఘం రానున్న సింగరేణి ఎన్నికల్లో బొక్కబోర్ల పడుతుందని తెలిసిపోయింది. దీంతో రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గూటికి చేరుకున్నారని చర్చ సాగుతుంది. ఈనెల 27వ తేదీన సింగరేణిలో గుర్తిపు కార్మిక సంఘం ఎన్నికలు జరుగనున్న తరుణంలో నాయకులు టిబిజికేఎస్‌కు రాజీనామాలు చేసి, కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న తొమ్మిదిన్నర ఏండ్లు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సింగరేణిని, సీఎండీని, డైరెక్టర్స్, జీఎంలను నాయకులు తమ చెప్పు చేతల్లో పెట్టుకుని ఇష్టా రాజ్యంగా పైరవీలకు పాల్పడ్డారని ఆరోపనలు ఉన్నాయి. కార్మికులకు సబంధించిన ఒక్క సమస్యను పరిష్కరించలేదని కార్మికులు గనుల వద్ద చర్చించుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో ఈ సారి అధికార కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టియూసీ పక్షాన నిలబడి గెలవాలని ఉవ్విళ్లూరుతున్నారు. గెలిచి మళ్లీ అధికారాన్ని దక్కించుకొని, కార్మికులకు మాయమాటలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారని కార్మికులు మండి పడుతున్నారు. ఇంత కాలం టిబిజికేఎస్‌ను నమ్ముకుని జెండా మోసిన కార్మికులను నట్టేట ముంచారని వారంటున్నారు. తొమ్మిది సంవత్సరాలుగా తెలంగాణ బొగ్గు గాని కార్మిక సంఘం నేతలు కార్మికులకు అనేక వాగ్దానాలు చేసి ఒకటి కూడా చేయకుండా బొగ్గు గని కార్మిక సంఘం బోర్డు తిప్పేశారు. ఏదో చేస్తారని నమ్ముకున్న కార్మికులు దిక్కుతోచని పరిస్థితులో పడ్డారు. ఇప్పటికే సింగరేణిలో ముంచుకోస్తున్న ప్రైవేటీకరణ తరుణంలో ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, ప్రగల్భాలు పలికారు. కానీ ఏమి వెలగబెట్టకుండానే గుట్టు చప్పుడు కాకుండా కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. దీన్ని బట్టి చూస్తే భవిష్యత్తులో ఏ కార్మిక సంఘం గుర్తింపు సంఘంగా నిలబడుతుందో ఆ సంఘం గొడుగు కింద చేరి యధావిధిగా కార్మికులను నమ్మించి మోసం చేయడం, మెడికల్ బోర్డు పైరవీలు చేసుకుంటు పైరవులకే పరిమితమయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. నాయకులను నమ్మి మోసపోతున్న కార్మికులు ఈసారి కార్మికుల పక్షాన నిలబడిన వారికి, వారి సమస్యల పట్ల పోరాటాలు చేస్తున్న నిజమైన కార్మిక సంఘానికి ఓటు వేయాలని భావిస్తున్నారని తెలుసోంది.

బీజాపూర్ అడవుల్లో ఎదురు కాల్పులు

- ముగ్గురు మావోయిస్టులకు తీవ్ర గాయాలు
- పెసర బాబు పేలి జవాన్ గాయాలు

నవతెలంగాణ-చర్ల



సరిహద్దు చతిస్గడ్ బీజాపూర్ జిల్లా జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో భైరామ్‌గఢ్ ఏరియా కమిటీకి చెందిన నక్సలైట్ల సమాచారం ఆధారంగా పోలీసులు యాంటీ నక్సల్ ఆపరేషన్ ప్రారంభించారు. డిఆర్‌జి బస్తర్ యుద్ధ సైనికులు ఆపరేషన్‌లో ఉన్నారు. ఎన్‌కౌంటర్‌లో సుమారు ఇద్దరి నుండి ముగ్గురు నక్సలైట్లు గాయపడ్డారని బీజాపూర్ పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్ సమయంలో, నక్సలైట్లు అమర్చిన పెసర్ బాంబు పేలి డిఆర్‌జి జవాన్ గాయపడ్డాడు. గాయపడిన సైనికుడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని పోటానేర్ అడవులో ఘటనగా బీజాపూర్ ఎస్పీ ధ్రువీకరించారు. ఇదిలా ఉండగా డిసెంబర్ 22 భారత్ బందుకు పిలుపునిచ్చా మావోయిస్టులు అటు మధ్యప్రదేశ్, ఒడిస్సా ఛత్తీస్గడ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో సైతం అక్కడే ఇక్కడ చిన్న పెద్ద చెదురు మధురు సంఘటనలు చోటుచేసుకున్నాయి. డిసెంబర్ 20 రాత్రి చింతూరులో మరవక ముందే 21 రాత్రి సరిహద్దు చత్తీస్గడ్ బీజాపూర్ జిల్లా ఆవు పల్లి ఏరియాలో మావోయిస్టులు ప్యాసింజర్ బస్సులను తగలబెట్టి తమ నిరసన తెలిపారు.

రెండో వారధి నిర్మాణ పనులను తక్షమే ప్రారంభించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

నవతెలంగాణ-పాల్వంచ



భద్రాచలం వద్ద రెండో వారధి నిర్మాణ పనులను తక్షమే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. శుక్రవారం ఐడిఓసి లోని కలెక్టర్ ఛాంబర్‌లో జాతీయ రహదారుల ఇంజినీరింగ్ విభాగం అధికారులతో వంతెన నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఫిబ్రవరి మాసం వరకు వారధి నిర్మాణ పనులు పూర్తి చేయు విధంగా కార్యాచరణ తయారు చేయాలని చెప్పారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచేందుకు అవసరమైన కూలీలలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వంతెన పనులు పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయుటకు చర్యలు చేపట్టాలని అదేశించారని చెప్పారు. వారధి నిర్మాణ పనులకు ప్రత్యామ్నయంగా రెండు వైపుల అప్రోచ్ రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. పనులు సకాలంలో పూర్తి చేయుటకు షెడ్యూల్ తయారు చేయాలని, షెడ్యూల్ ప్రకారం పనులు జరిగే విధంగా చర్యలు చేపట్టడంతో పాటు నివేదికలు అందచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈ ఈ యుగందర్, డిఈ శైలజ తది తరులు పాల్గొన్నారు.








గణిత శాస్త్ర దినోత్సవం



నవతెలంగాణ-ఖమ్మం

అరవింద హైస్కూల్‌లో

నగరంలోని శ్రీనగర్ కాలనీలో అరవింద హైస్కూల్లో శుక్రవారం జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అరవింద హైస్కూల్ చైర్మన్, శాస్త్రవేత్త (సైంటిస్ట్) అయిన మొహమ్మద్ సఫ్ దర్ ఖాన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ మొహమ్మద్ గౌస్ పాషా మాట్లాడారు. కార్యక్రమంలో అరవింద హైస్కూల్ చైర్మన్ మొహమ్మద్ సఫ్ దర్ ఖాన్, డైరెక్టర్ మొహమ్మద్ గౌస్ పాషా, కరెస్పాండెంట్ అంజాద్ ఖాన్, ఇంచార్జ్ కుమారి, ఉపాధ్యాయులు నారాయణ, లోకేష్, ఇబ్రహీం, సుశీల, వినోద, రఫతున్నిసా, కరుణ, మమత తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో

నగరంలోని సహకార నగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరెస్పాండెంట్ మహమ్మద్ జహీదా ఖాతూన్, రేవతి, షాహీన్ తదితరులు పాల్గొన్నారు.

బ్లూమింగ్ మైండ్ పాఠశాలలో

నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో శుక్రవారం గణిత దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ పి.అశోక్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య ఒలంపియాడ్ పాఠశాలలో

ప్రతి విద్యార్థి గణితంపై పట్టుసాధించాలని తెలంగాణ శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య అన్నారు. స్థానిక మమత ఆసుపత్రి రోడ్‌నందు గల శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలలో శుక్రవారం గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టిఎల్ఎన్.శర్మ, డిజియం. చేతన్ మాధుర్, కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్స్ టిఎల్ఎన్.శర్మ, రాజ్‌కుమార్ జోషి, ఏడుకొండలు, వైస్ ప్రిన్సిపాల్స్ రామకృష్ణారెడ్డి, సురేష్, ఐ.పి.ఎల్ ఇన్‌చార్జ్ రాజశేఖర్‌రెడ్డి, డీన్స్ కెవిఆర్, లక్ష్మీనారాయణ, నవీన్, రామరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూవిజన్ పాఠశాలలో

శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ గణిత దినోత్సవాన్ని నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ శ్రీ అబాద్ అలీ తెలిపారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి పూలతో నివాళి అర్పించారు. గణిత దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులు త్రికోణమితీయ రూపాలు, త్రిభుజ ధర్మాలు, అంకగణితం, వ్యాపార గణితం, రేఖాగణితం వంటి గణిత నమూనాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనకు న్యూవిజన్ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్ ప్రారంభించి, నమూనాలను తిలకించారు. కార్యక్రమంలో న్యూవిజన్ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ అబాద్ అలీ, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతాంజలి పాఠశాలలో

ఖమ్మం పట్టణంలోని శ్రీనివాస్‌గనగర్‌లో గల గీతాంజలి విద్యానికేతన్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు టి.పద్మ టి.అరుణ్, కరస్పాండెంట్ టివి. అప్పారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాలలో

నగరంలోని త్రివేణి పాఠశాలలో ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టైటాన్స్ పాఠశాలలో

నగరంలోని టైటాన్స్ పాఠశాలలో గణిత దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శెట్టి భాస్కర్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాధాకృష్ణ, సబిత, నాగమణి, రవి తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ స్కూల్‌లో

సత్తుపల్లి : సత్తుపల్లిలోని టాలెంట్ స్కూలులో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఉత్సాహంగా జరిపారు. గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు రోబో, యాంగిల్స్, బార్ గ్రాఫ్స్, స్క్వేర్ రూట్స్, మెషిన్, ఇతర గణిత ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూలు కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, ఉపాధ్యాయులు రవీంద్ర, సురేశ్, గోపీ, రమణ శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



వీవీ విద్యాలయంలో గణితశాస్త్ర ప్రాజెక్టుల ప్రదర్శన

సత్తుపల్లిలోని వీవీ విద్యాలయం, వీవీ టెక్నో స్కూలులో శుక్రవారం గణితశాస్త్ర దినోత్సవాన్ని గణిత ఉపాధ్యాయులు గోరంట్ల వంశీకృష్ణ, జగ్గవరపు శ్రీనివాసరెడ్డి, చీనేని మోహన్ సాయి చరణ్, ప్రియాంక, మారేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పలు గణితశాస్త్ర ప్రాజెక్టులు, గణిత ట్రిక్స్‌ను గణిత ఉపాధ్యాయులు విద్యార్థులచే ప్రదర్శింపజేశారు. ఈ కార్యక్రమంలో వీవీ విద్యాలయం కరస్పాండెంట్ ఒగ్గు భగవాన్‌రెడ్డి, వీవీ విద్యాలయం యాజమాన్య బాధ్యులు మహేశ్వరి పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : మండల కేంద్ర మైన ఎరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రభుత్వ పాఠశాల నందు మీనవోలు శ్రీ భాస్కర మెమో రియల్ స్కూల్ నందు జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

చైతన్య విద్యాలయంలో

బోనకల్ : మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామంలో గల చైతన్య విద్యాలయంలో శుక్రవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత



పితామహుడు శ్రీనివాస రామానుజన్ జన్మదిన సందర్భంగా గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి చైతన్య విద్యాలయం కరస్పాండెంట్ షేక్ హుస్సేన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం ఆయన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొండ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




బిజినెస్

ద్రవ్యోల్బణంతో వినిమయానికి దెబ్బ

- వ్యయానికి హెచ్చు ధరలు ప్రతికూలం : ఆర్బీఐ
- టమాటా,ఉల్లి వంటి నిత్యావసరాల ధరలతో మరింత ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ: వినిమయ డిమాండ్‌ను ద్రవ్యోల్బణం దెబ్బ తీస్తుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పేర్కొంది. వినియోగదారుల వ్యయానికి హెచ్చు ధరలు ప్రతికూలంగా మారాయని ఆర్బీఐ తన డిసెంబర్ బులిటెన్‌లో పేర్కొంది. ఇది ఉత్పాదక కంపెనీల మొత్తం వృద్ధికి, వాటి మూలధన వ్యయాలకు ఆటంకం కలిగిస్తోందని విశ్లేషించింది. ద్రవ్యోల్బణాన్ని సత్వరమే తిరిగి లక్ష్యానికి తీసుకురాకపోతే, సమర్థవంతంగా నియంత్రించకపోతే.. ఆర్థిక వృద్ధి నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. వచ్చే 2024-25 తొలి మూడు త్రైమాసికాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.6 శాతానికి తగ్గొచ్చని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖెల్ దేబబ్రత పాత్ర నేతృత్వంలోని బృందం ఈ కథనం రాసింది. ఈ బులిటెన్‌లో 2024లో ప్రపంచ వృద్ధి వేగం మరింత నెమ్మదించవచ్చని విశ్లేషించింది. గడిచిన నవంబర్ మాసంలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 5.6 శాతానికి చేరిన విషయం తెలిసిందే. ఉల్లిపాయలు, టామాటోలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల రాబోయే నెలల్లో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్త సుజన్ హజ్రా పేర్కొన్నారు.

2025లో విండోస్ 10ఓఎస్ నిలిపివేత

వాషింగ్టన్: మైక్రోసాఫ్ట్ సంస్థ తన విండోస్ 10 ఆపరేటింగ్ సిస్టమ్ (ఓఎస్) సర్వీసు మద్దతును నిలిపి వేయనున్నట్లు ప్రకటిం చింది. 2025 అక్టోబర్ 14 నుంచి ఈ ఓఎస్‌ను ఉపసంహరిస్తున్నట్లు పేర్కొంది. దీనివల్ల విండోస్ 10తో పనిచేస్తున్న కంప్యూటర్లలో మైక్రోసాఫ్ట్ నుంచి ఎలాంటి సెక్యూరిటీ అప్‌డేట్స్ రావని కెనాలసిస్ రీసెర్చ్ వెల్లడించింది. దీంతో యూజర్లు తప్పక కొత్త కంప్యూటర్లు లేదా కొత్త ఓఎస్‌ను కొనుగోలు చేయాల్సిన రావొచ్చు. దాదాపు 24 కోట్ల కంప్యూటర్లపై ప్రభావం పడనుందని అంచనా. కాగా.. పాత కంప్యూటర్ల స్థానంలో కొత్తవి కొనుగోలు చేయడం వల్ల సుమారు 480 మిలియన్ కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పోగవుతాయని కెనాలసిస్ అంచనా వేసింది.

నిధుల సమీకరణలో అన్మోల్ ఇండియా

హైదరాబాద్ : సప్లరు చైన్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ, కమోడిటీ ట్రేడింగ్, బొగ్గు దిగుమతిలో ఉన్న అన్మోల్ ఇండియా లిమిటెడ్ నిధులు సమీకరించినట్లు పేర్కొంది. వర్కింగ్ మూలధన అవసరాల కోసం క్యూఐబీ పద్దతిలో నిధులు సమీకరించడానికి ఆ సంస్థ బోర్డు ఆమోదం తెలిపిందని ఓ ప్రకటనలో తెలిపింది. అయితే ఎంత మొత్తం అనేది వెల్లడించలేదు. వచ్చే ఐదేళ్లలో సేంద్రీయ, అకర్బన వృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొంది.

భద్రాద్రిలో సీతారాముల తెప్పోత్సవం

- హంస వాహనంపై విహరించిన రామయ్య
- కన్నులారా తిలకించిన సందర్శకులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో కీలక ఘట్టమైన శ్రీరాముని తెప్పోత్సవ కార్యక్రమం వేలాది మంది సందర్శకుల సమక్షంలో వేద మంత్రాల మధ్య కొనసాగింది. ఈ నెల 13వ తేదీన ప్రారంభమైన అధ్యయనోత్సవాల్లో అవతారాలను ముగించుకున్న సీతారాములకు.. పవిత్ర గోదావరిలో శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి తెప్పోత్సవం కార్యక్రమాన్ని అట్టహాసంగా ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించారు. 1971లో మొదటిసారిగా వైకుంఠ ఏకాదశి అధ్యాయం ఉత్సవాల్లో స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆలయ అధికారులు నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏడాది సరికొత్త హంగులతో కొనసాగిస్తున్నారు. గోదారిలో స్వామి వారు జలవిహారం చేసే సమయంలో తీర ప్రాంతంలో దేవస్థానం ఆధ్వర్యంలో బాణసంచా కాల్చటం విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ తోపాటు పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖల సమన్వయంతో విజయవంతంగా ముగిసింది.

ప్రభుత్వ ఆసుపత్రి నకిలీ స్టాంప్ తయారీకి కానిస్టేబుల్ యత్నం

సమాచారం అందుకున్న వైద్యాధికారి ఇల్లందు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్ళపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన నకిలీ రబ్బర్ స్టాంప్ తయారీకి ఇల్లందు డీఎస్పీ కార్యాలయానికి చెందిన ఓ కానిస్టేబుల్ యత్నించాడు. సమాచారం అందుకున్న స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి అర్వపల్లి రేవంత్ నకిలీ స్టాంప్‌కు యత్నించిన కానిస్టేబుల్ పై ఇల్లందు పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యాధికారి కథనం ప్రకారం.. బోడు పోలీస్ స్టేషన్ ఆర్ఎస్ఐ వై.కిషన్ రావుకు సంబంధించిన గత 2022 ఏడాది మెడికల్ లీవ్ ధృవ పత్రాలపై సంతకాలు చేయించుకుని రావడానికి ఇల్లందు పట్టణం పోలీస్ స్టేషన్ టీఎస్ఎస్పీ 2017 బ్యాచ్ కానిస్టేబుల్ గుగులోత్ గాంధీ ఆళ్ళపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రేవంత్ వద్దకు శుక్రవారం వచ్చినట్టు తెలిపారు. గత ఏడాది నేను ఆసుపత్రిలో విధుల్లో లేనని, 2023 సంవత్సరం జనవరి నెలలో విధుల్లో చేరానని, సంతకం చేయడం కుదరదని వైద్యాధికారి రేవంత్ నిరాకరించానని చెప్పారు. గాంధీ తెచ్చిన రెండు మెడికల్ లీవ్ పత్రాల్లో ఒక దానిలో నా ఫోర్జరీ సంతకం చేసి ఉండటం, ఇల్లందులో గుర్తు తెలియని చోట ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నకిలీ రబ్బర్ స్టాంప్ తయారీకి యత్నం జరిగిన విషయం అక్కడి వారితో తెలుసుకున్నానని తెలిపారు. గాంధీని ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి పిలిపించి విచారించానని, గాంధీ మాటల ప్రకారం ఫోర్జరీ సంతకం, నకిలీ స్టాంప్ తయారీకి యత్నం నిజమేనని తేలినట్టు తెలిపారు. కొత్తగూడెం డీఎంఅండ్ హెచ్‌ఓ జేవియల్ శిరీష ఆదేశాల మేరకు ఇల్లందు పట్టణం పోలీస్ స్టేషన్‌లో గాంధీ, సంబంధిత వ్యక్తులపై పూర్తి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఫిర్యాదుకు ముందు ఇల్లందు చేరుకున్న కానిస్టేబుల్ గాంధీ అక్కడే నివసించే వైద్యాధికారి తండ్రిని "నా పై కేసు పెడితే మీ కొడుకుపై వంద కేసులు పెడతానని, మీ అబ్బాయి జీవితం నాశనం అయ్యేలా చేస్తాను" అని గాంధీ బెదిరింపులకు పాల్పడినట్లు వైద్యాధికారి రేవంత్ చరవాణిలో తెలిపారు.

మహిళలపై పెరుగుతున్న నేరాలు

చిన్నారులపై కూడా...

- ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడి





న్యూఢిల్లీ : దేశంలో మహిళలు, చిన్నారులపై నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. 2021తో పోలిస్తే గత సంవత్సరం ఈ తరహా నేరాల సంఖ్య 2.13% పెరిగింది. 2017లో మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి 3,15,215 కేసులు నమోదయ్యాయి. ఇప్పుడా సంఖ్య 3,65,300కి చేరింది.

గత ఆరు సంవత్సరాల కాలంలో మహిళలపై జరిగిన నేరాల సంఖ్యలో 15.88% పెరుగుదల కన్పించింది. 2017తో పోలిస్తే 2018లో నేరాల సంఖ్య 2.57% ఎక్కువ. కోవిడ్, లాక్‌డౌన్ సమయంలో మాత్రం ఈ తరహా నేరాలు తగ్గాయి. 2019తో పోలిస్తే 2020లో నేరాల సంఖ్య 10.22% తగ్గింది.

అయితే 2021లో నేరాలు రికార్డు స్థాయిలో 14.87% పెరగడం గమనార్హం. మహిళలపై జరుగుతున్న నేరాలకు సంబంధించిన కేసుల్లో ఎక్కువగా భర్త, అతని బంధువులే నిందితులుగా ఉంటున్నారు. మహిళల కిడ్నాప్‌లు కూడా గణనీయంగానే జరుగుతున్నాయి. గత సంవత్సరం జరిగిన నేరాల్లో 89% నేరాలకు భర్త, అతని బంధువుల దాష్టీకాలు, అపహరణలే కారణం.

మహిళలపై నేరాలు అత్యధికంగా జరిగిన రాష్ట్రాలలో ఉత్తరప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంది. 2017 నుండి 2022 వరకూ వరుసగా ఆరు సంవత్సరాల పాటు ఈ రాష్ట్రానికే అగ్రస్థానం. 2019 నుండి 2022 వరకూ రాజస్థాన్ రెండో స్థానంలో ఉంది. 2017లో ఆ రాష్ట్రం ఐదో స్థానంలోనూ, 2018లో నాలుగో స్థానంలోనూ నిలిచింది. మహిళలపై నేరాల రేటుకు సంబంధించి మాత్రం గత సంవత్సరం ఢిల్లీ, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలు మొదటి మూడు స్థానాలలో ఉన్నాయి.

పెరిగిన పోక్సో నేరాలు

2017 తర్వాత చిన్నారులపై జరిగిన లైంగిక నేరాల సంఖ్య 94.47% పెరిగిందని ఎన్‌సీఆర్‌బీ నివేదిక తెలిపింది. ఈ తరహా నేరాలలో కూడా ఉత్తర ప్రదేశ్ దే మొదటి స్థానం. గత సంవత్సరం దేశంలో నమోదైన మొత్తం 63,414 కేసుల్లోనూ ఒక్క యూపీలోనే 8,136 కేసులు నమోదయ్యాయి. 2017లో పోక్సో చట్టం కింద 32, 608 కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్య 2022 నాటికి 94% పెరిగింది. పోక్సో కింద నేరాలకు పాల్పడిన వారిలో 96.8% మంది బాధితుల తో అంతకు ముందే పరిచయం ఉన్న దని నివేదిక పేర్కొంది.

బీజేపీ పాలిత రాష్ట్రాలలో అధిక ఉపా కేసులు

2017 నుండి చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద దేశంలో నమోదైన కేసులలో 60% జమ్మూకాశ్మీర్, అసోం, మణిపూర్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలలోనివే. 2017లో ఉపా కింద 901 కేసులు నమోదు కాగా వాటిలో 86% కేసులు ఈ రాష్ట్రాలలోనే నమోదయ్యాయి. 2019లో అత్యధికంగా 1,226 ఉపా కేసులు నమోదయ్యాయి. పైన తెలిపిన రాష్ట్రాలతో పాటు హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలలోనూ చెప్పుకోదగిన సంఖ్యలోనే కేసులు వచ్చాయి. 2019లో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరిగిన విషయం తెలిసిందే. అప్పుడు ఆందోళనకారులపై ఉపా కింద కేసులు పెట్టారు. 2019లో బీహార్, తమిళనాడు, కేరళ, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో కూడా ఉపా కేసులు ఎక్కువగానే వచ్చాయి. తమిళనాడులో అత్యధికంగా 270 కేసులు నమోదయ్యాయి. అంతకు ముందు ఆరు సంవత్సరాల కాలంలో ఈ చట్టం కింద ఆ రాష్ట్రంలో ఎన్నడూ ఐదు కేసులకు మించి నమోదు కాలేదు. ఉపా కేసులు నమోదైన రాష్ట్రాలన్నీ బీజేపీ ఏలుబడిలోనో లేదా ఆ పార్టీ సంకీర్ణ భాగస్వామిగా ఉన్న ప్రభుత్వాల పాలనలోనో ఉన్నవే. జార్ఖండ్‌లో మాత్రం తీవ్రవాద కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఉపా కేసులు నమోద య్యాయి. 2017 మార్చిలో ఉత్తర ప్రదేశ్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపా కేసులు పెరగడం ఆశ్చర్యం కలిగించే విషయమేమీ కాదు. అంతకు ముందు 2017లో ఉపా కింద అక్కడ కేవలం పది కేసులు మాత్రమే నమోదయ్యాయి.

బీడీకార్మికులందరికీ ఒకే వేతనమివ్వాలి

కనీస పింఛన్ రూ.10 వేలివ్వాలి : సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశవ్యాప్తంగా బీడీ కార్మికులందరికీ ఒకే రకమైన వేతనం చెల్లించాలనీ, కనీస పింఛన్ రూ.10 వేలు ఇవ్వాలని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కొనసాగుతున్న ఆలిండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) జాతీయ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.

బీడీ కార్మికుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందనీ, బీడీ కార్మికుల ఉపాధిని కొల్లగొట్టే విధంగా ముందుకెళ్తున్నదని అన్నారు. దేశంలో 60 లక్షల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న బీడీ పరిశ్రమను సంక్షోభంలోకి నెడుతున్న తీరును వివరించారు. ఈ రంగంలో 92 శాతం మంది మహిళా కార్మికులే ఉన్నారనీ, వారి నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని బీడీ కంపెనీల యాజమాన్యాలు శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వంత పాడుతున్నాయని చెప్పారు. కార్మికులకు న్యాయం చేయాల్సిన లేబర్ అధికారులు కూడా యజమానులతో కుమ్మక్కవుతున్నారని విమర్శించారు. జీఎస్టీ పేరుతో బీడీ కార్మికుల సంక్షేమానికి సెస్సు రద్దు చేసి వారి సంక్షేమాన్ని గాలికి వదిలివేశారని వాపోయారు. బీడీ కార్మికుల పోరాటాలకు సీఐటీయూ మద్దతుగా ఉంటుందని చెప్పారు. ఆలిండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ జాతీయ అధ్యక్షులు సహదేవన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు ఏకే.పద్మనాభన్, బీడీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి దేబశ్రీరాయ్, తెలంగాణ బీడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. గోపాలస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. రమ, రాష్ట్ర నాయకులు సూర్జహాన్, ఎంఎ. చౌదరి, పద్మ, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేజ్రీవాల్‌కు మూడోసారి

- మద్యం కుంభకోణం కేసులో ఆప్ అధినేతకు ఈడీ సమన్లు
- జనవరి 3న విచారణకు రమ్మని పిలుపు

న్యూఢిల్లీ : మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ప్రభుత్వానికి కష్టాలు తప్పడం లేదు. ఇప్పుడు ఈ వ్యవహారం సీఎం కేజ్రీవాల్‌కు చేరింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆప్ అధినేతకు ఒకదాని తర్వాత ఒకటి సమన్లు పంపుతోంది. కేజ్రీవాల్ ఒక్కసారి కూడా ఈడీ ముందు హాజరు కాలేదు. తాజాగా ఈడీ సీఎం కేజ్రీవాల్‌కు మూడోసారి సమన్లు జారీ చేసి జనవరి 3న హాజరు కావాలని కోరింది.




పంజాబ్‌లోని హెూషియార్‌పూర్‌లో సీఎం కేజ్రీవాల్

పంజాబ్‌లోని హెూషియార్‌పూర్‌లో సీఎం కేజ్రీవాల్ మకాం వేశారు. పదిరోజుల పాటు ఇక్కడే ఉండి ధ్యానం చేయనున్నారు. తిరిగి 30 న ఢిల్లీకి రానున్నారని ఆప్ వర్గాలు తెలిపాయి. డిసెంబరు 18,21న హాజరు కావాలని రెండుసార్లు కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేసినా..ఆయన గైర్హాజరైన విషయం విదితమే.

బిలియన్ల విలువగల సరుకు రవాణా ఎర్ర సముద్రంలోకి రాకుండా దారి మళ్లింపు

యెమెన్‌లోని హౌతీ మిలిటెంట్ల దాడులను ఎదుర్కొంటున్న ఎర్ర సముద్రం, సుయెజ్ కాలువ గుండా సాగే సరుకు రవాణా మార్గం నుంచి మరో మార్గానికి మారింది. ఇలా మారిన సరుకుల విలువ 35 బిలియన్ డాలర్లు ఉంటుంది. ఓ నివేదిక ప్రకారం 57 కంటైనర్ నౌకలు ఆఫ్రికా దక్షిణాగ్రాన్ని చుట్టి పయనిస్తున్నాయి. ముందుముందు ఈ నౌకల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ సీ లాజిస్టిక్స్ గ్లోబల్ హెడ్‌గా వున్న పావోలో మాంట్రోన్ సిఎన్‌బిసికి చెప్పాడు. ఇలా ఆఫ్రికా దక్షిణాగ్రాన్ని చుట్టి పయనించే నౌకలలో 7లక్షల కంటైనర్లు ఉన్నాయి. వీటి విలువ 35బిల్లియన్ డాలర్లు ఉంటుందని భావిస్తున్నారు. గత సోమవారం రెండుకుపైగా నౌకలపై దాడి జరిగిందనే రిపోర్టుల నడుమ నౌకలను ఎర్ర సముద్రం, సూయజ్ కాలువల గుండా రాకుండా దారి మళ్లించారు. గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న మానవ హననానికి వ్యతిరేకంగా తాము ఇజ్రాయిల్ వెళ్ళే నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నట్టు హౌతీ నాయకులు చెబుతున్నారు. ఎర్ర సముద్రం గుండా తన చమురు రవాణాను నిలిపివేస్తున్నట్టు బ్రిటిష్ చమురు కంపెనీ బిపి ప్రకటించింది. అనేక ప్రధాన సరుకు రవాణా కంపెనీలు ఎర్ర సముద్రం గుండా సరుకు రవాణాను నిలిపివేశాయి. బాబ్ ఎల్ మండేవ్ జలసంధి ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ యేడెన్‌తో కలుపుతుంది. ఆ తరువాత ఒకవైపు హిందూ మహాసముద్రం, మరోవైపు మధ్యదరా సముద్రాలను సుయెజ్ కాలువ కలుపుతుంది. ఈ సముద్ర మార్గం ఆసియా, ఐరోపా ఖండాలను కలుపుతుంది. ఈ మార్గం గుండా 12శాతం ప్రపంచ వాణిజ్యం, 30 శాతం కంటైనర్ల రవాణా జరుగుతుంది.



జర్మన్లు 'దొంగలు' : లవ్రోవ్



ఉక్రెయిన్‌కు నిధులను సమకూర్చటానికి ప్రపంచ వ్యాప్తంగావున్న రష్యా ఆస్తులను కొల్లగొట్టేందుకోసం చట్టాలలోవుండే లొసుగులను అన్వేషించాలని అమెరికా పశ్చిమ దేశాలకు సూచిస్తోందని రష్యా విదేశాంగ శాఖా మంత్రి సెర్గీ లవ్రోవ్ గురువారమొక పత్రికా విలేకరుల సమావేశంలో ప్రకటించారు. యూరోపియన్ యూనియన్ ఆంక్షలను ఉల్లంఘించారనే పేరుతో ఫ్రాంక్‌ఫర్ట్ లోని రష్యన్ బ్యాంక్ అకౌంట్‌లో గల 800మిలియన్ డాలర్ల సంపదను కైవసం చేసుకోవాలనే ప్రణాళికను జర్మన్ అధికారులు తెలిపారు. జర్మన్ అధికారులకు దొంగతనం చేసే జబ్బు ముదిరిందని లవ్రోవ్ అన్నారు. "వాళ్ళకు దొంగ బుద్ధి ఉందని మాకు చాలాకాలం క్రితమే తెలిసింది. ఒప్పందాలను అమలు చేయకుండా ఇతరులను మోసం చేసే ప్రయత్నం చేయటం అందులో ఒకటి. ఇప్పుడు వీళ్ళు ప్రత్యక్షంగా దొంగలుగా మారారు". అని లవ్రోవ్ ట్యునీషియా పర్యటన తరువాత ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో చెప్పారు. ముందుగా ఘనీభవింపజేసిన రష్యా ఆస్తులపై వచ్చిన వడ్డీని ఉక్రెయిన్‌కు మరలించటంతో ప్రారంభించి రష్యా ఆస్తులను కైవసం చేసుకోవటానికి చట్టంలో లొసుగులు ఏమైనా దొరుకుతాయేమోనని పశ్చిమ దేశాల అధికారులు అన్వేషిస్తున్నారు. "ఐరోపావాసులకు తమ చట్టాలపై కొంచెం గౌరవం మిగిలివుంది. అందుకే వాళ్ళు నిర్ణయాలను తీసుకోవటానికి ఆలస్యం చేస్తున్నారు. అయితే మాకున్న సమాచారం ఏమంటే ఎలాగైనా అవసరమైతే చట్టాలను మార్చైనా రష్యా ఆస్తులను కైవసం చేసుకోవాలని అమెరికా సలహా ఇస్తోంది" అని లవ్రోవ్ వివరించారు. గత సంవత్సరం జి-7 దేశాలలో, యూరోపియన్ యూనియన్‌లో, ఆస్ట్రేలియాలో గల 285 బిలియన్ల రష్యన్ కేంద్ర బ్యాంకు ఆస్తులను ఘనీభవింపజేశారు. ఐరోపాలో 230 బిలియన్ డాలర్ల రష్యన్ రిజర్వ్ నిధులున్నాయని అంచనా. వీటిలో 191 బిలియన్ బెల్జియంలో, 19 బిలియన్ ఫ్రాన్స్‌లో, 7.8 బిలియన్ స్విట్జర్లాండ్‌లోనూ ఉన్నాయి. జర్మనీ ఫైనాన్స్ సంస్థలలోగల 5.3 బిలియన్ యూరోల రష్యా నిధులను జర్మనీ బ్లాక్ చేసింది. ఇప్పుడు జెపి మోర్గాన్ లోగల రష్యన్ నిధులను లక్ష్యంగా చేసుకుని పావులు కదుపుతోంది. తాము ఘనీభవింపజేసేన తమ నిధులపై వచ్చే లాభాలను తరలించాలని ప్రయత్నిస్తే తమ వైపు నుంచి ప్రతిస్పందన తీవ్ర స్థాయిలో ఉంటుందని రష్యా ఆర్థిక మంత్రి అంటోన్ సైల్యుయానోవ్ హెచ్చరించారు. తమకు మిత్రులుకాని దేశాలకు కూడా తమ బ్యాంకు అకౌంట్లలో భారీగానే నిధులు ఉన్నాయన్న విషయాన్ని ఈ దేశాలు గుర్తుంచుకోవాలని సైల్యుయానోవ్ అన్నారు.



ఎంపీల సస్పెన్షన్‌పై నిరసన


- వామపక్షాలు, కాంగ్రెస్, ఇతర పార్టీల ర్యాలీలు
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం

నవతెలంగాణ- విలేకరులు

ప్రధాని మోడీ నియంతలా వ్యవహరిస్తున్నారని పార్లమెంట్ లోపల, బయట ప్రశ్నించిన వారి గొంతు నొక్కేప్రయత్నం చేస్తున్నారని వామపక్షం, కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీల నాయకులు విమర్శించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 146 మంది విపక్ష ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేసి ప్రజావ్యతిరేక చట్టాలను ఆమోదింపజేసుకున్నారని ఆరోపించారు. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ర్యాలీలు తీసి దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఖమ్మం అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అటూ సీపీఐ ఆధ్వర్యంలోనూ పార్టీ కార్యాలయం ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలోనూ ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు దుష్ట విధానాలు ముందుకు తీసుకొస్తుందని వామపక్ష పార్టీల నాయకులు ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాస్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ర్యాలీ తీశారు. చిట్యాలలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐఎంఎల్ ప్రజాపంథా, తెలంగాణ జనసమితి, దళితమహాసభ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రతిపక్ష పార్టీల ఎంపీ సభ్యుల సస్పెన్షన్ చేయడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజులని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరై కేంద్రంలోని బీజేపీ నియంతృత్వ ధోరణిని ఎండగట్టారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేశారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఈసీఐఎల్ చౌరస్తా వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నేతలకు ప్రజాస్వామ్య విలువలు తెలియజేసి జ్ఞానోదయం కల్పించాలని కోరుతూ ఘట్కేసర్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి ర్యాలీ నిర్వహించారు. సీపీఐ ఆధ్వర్యంలో మేడ్చల్- మల్కాజి గిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులు, ఉపాధ్యాయుల సంక్షేమమే మా ఎజెండా

- టీఎస్‌యూటీఎఫ్ మైనార్టీ గురుకుల రాష్ట్ర కమిటీ పునరుద్ధాటన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మైనార్టీ గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయుల సంక్షేమమే తమ ఎజెండా అని టీఎస్‌యూటీఎఫ్ మైనార్టీ గురుకుల రాష్ట్ర కమిటీ పునరుద్ఘాటించింది. ఈ మేరకు మైనార్టీ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి షఫీఉల్లాను టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య నేతృత్వంలో కలిసి ఆ సంఘం రాష్ట్ర కమిటీ బాధ్యులను పరిచయం చేశారు. మైనార్టీ గురుకుల రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా జి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం మహేశ్, కోశాధికారిగా పి నరసింహ, ఉపాధ్యక్షులుగా పి భరత్, కె శైలజ, బి లింగస్వామి, వి రాజిరెడ్డి, ఎస్‌కే జావిద్, ఎం జ్యోతి, ఎస్‌కే మోసిన్, కార్యదర్శులుగా వి దామోదర్, భూపేందర్ కౌర్, కె నరేశ్‌కుమార్, జి మల్లేషం, ఎస్ గంగారెడ్డి, కె సుమతిరెడ్డి, జి విజయ్ ఎన్నికయ్యారని వివరించారు.

ఈ సందర్భంగా మైనార్టీ గురుకుల సొసైటీ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అన్ని అంశాలనూ పరిశీలించి ప్రతినెలా సంఘాలను పిలిచి సమీక్ష నిర్వహిస్తామంటూ కార్యదర్శి సానుకూలంగా స్పందించారని తెలిపారు. బదిలీలు, పదోన్నతులు, ఉపాధ్యాయుల సీపీఎస్ పెండింగ్ బిల్లులు సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలని కోరగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పని 9చేయాలంటూ సంఘ నాయకులకు ఆయన సూచించారని వివరించారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,230	▲	230
22 క్యారెట్లు	58,000	▲	250
కిలో వెండి	81,000	▲	300



చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	85
రిటైల్ (లైవ్)	రూ.	107
స్కిన్‌తో	రూ.	155
స్కిన్‌లెస్	రూ.	177

వారికి సమయం కేటాయిస్తున్నారా...?



ఒకప్పుడు పిల్లలు ఆడుతూ పాడుతూ హాయిగా స్కూల్‌కు వెళ్లి స్నేహితులతో కబుర్లు చెబుతూ గడిపేవారు. టీచర్ చెప్పిన పాఠాలు విని ఇంటికి వచ్చి ఆ కబుర్లను తల్లిదండ్రులకు చెప్పి ఆనందించేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. ఇందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా చెప్పుకోవలసింది పెరుగుతున్న సాంకేతికత. దీని వల్ల పిల్లలు పెద్దలతో మాట్లాడే సమయం తగ్గింది. ఆన్‌లైన్ గేమ్స్, యూట్యూబ్, షార్ట్స్ అంటూ వాటికే ఎక్కువగా పరిమితమవుతున్నారు. వీటి వల్ల ఇతరులతో ఎక్కువగా మాట్లాడుకపోవడం, వేరే వారితో పోల్చుకోవడం, కొన్ని సందర్భాలలో తమను తాము తక్కువ చేసుకోవడం వారు ఒత్తిడికి గురయ్యేలా చేస్తున్నాయి. టీనేజర్లు ఎక్కువగా ఈ ఒత్తిడికి గురవుతున్నారట. అంతా తమకు తెలుసని, కోరుకున్నది అందలేదని వంటి విపరీత ఆలోచనలు, చిన్న చిన్న విషయాలు వారిని మానసికంగా కుంగదీస్తున్నాయి. కొంతమంది తల్లిదండ్రులకు కూడా పిల్లలతో సమయం గడిపే అవకాశం ఉండటం లేదు. ఫలితంగా ఒంటరిగా వారికి అన్ని సమకూరుస్తున్నామని అనుకుంటున్నారు. అయితే కాలం ఏదైనా, పరిస్థితులు ఏవైనా పెద్దలు పిల్లలతో సామరస్యంగా మాట్లాడటం, వారేం చేస్తున్నారో, ఎలా ప్రవర్తిస్తున్నారో గమనించడం చాలా ముఖ్యం. మరి అలాంటప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చూద్దాం.

కారణాలు తెలుసుకోండి

సాధారణంగా గలగలా మాట్లాడే చిన్నారులు కూడా ఒత్తిడికి గురయితే మౌనం వహిస్తారు. మౌనంగా ఉండేందుకే ప్రాధాన్యం ఇస్తారు. ఒత్తిడికి గురైన చాలా పిల్లలు ఒంటరిగా ఉండటానికే ఇష్టపడతారు. కాబట్టి చిన్నారితో మాట్లాడి వారి టెన్షన్‌కు సంబంధించిన కారణాలను తెలుసుకోండి. కొత్తకొత్త విషయాలు నేర్చుకునేలా వారిని ప్రోత్సహించండి. క్రియేటివిటీపై వారి దృష్టిని మళ్లించండి. ఫోన్ అలాగే వీడియో కాల్స్ ద్వారా వారిని వారి స్నేహితులతో టచ్‌లోకి తీసుకెళ్లండి. ఒంటరిగా ఉన్నారన్న ఫీలింగ్ వారికి కలగనివ్వకండి.

టైం టేబుల్ తయారు చేయండి

స్కూల్‌కి వెళ్ళే పిల్లలు సాధారణంగా ఒక రొటీన్‌కు అలవాటు పడివుంటారు. అయితే చదువు, గేమ్స్, ఫిజికల్ యాక్టివిటీస్, ఎంటర్‌టైన్‌మెంట్, భోజనం, నిద్ర... వీటన్నింటికీ ఓ టైం టేబుల్ తయారు చేయాలి. దీన్ని పిల్లలు పాటించేలా చేస్తే వారు తమ రోజును ప్రశాంతంగా గడుపుతారు. వారికి కొన్ని సరదా సరదా పనులు కేటాయించండి. ఏదో ఒక యాక్టివిటీలో భాగస్వాములను చేయండి.

గమనిస్తూ ఉండండి

ప్రస్తుతం ప్రపంచాన్ని సోషల్ మీడియా శాసిస్తోంది అనడంలో సందేహం లేదు. ఎంటర్‌టైన్‌మెంట్ కోసం మనం కూడా సోషల్ మీడియాపై ఆధారపడుతున్నాం. పిల్లలు ఇందుకు మినహాయింపేమీ కాదు. అయితే సోషల్ మీడియాకు అతుక్కుపోవడం వల్ల మానసిక, శారీరక అనారోగ్యం కలిగే ప్రమాదం ఉంది. అన్ని రకాల సమాచారం ఈజీగా అందుబాటులో ఉండడం వల్ల వారు ఏ విషయం గురించైనా తెలుసుకునే అవకాశం ఉంది. కొన్ని ఫేక్ న్యూస్‌లు కూడా వారి దృష్టికి వెళ్ళవచ్చు. ఏది ఫేక్ న్యూస్ ఏది రియల్ న్యూస్ అని తెలుసుకునే తెలివి వారికి తక్కువే. అందుకే వారి సోషల్ మీడియా యూసేజ్‌పై నిఘా పెట్టండి. వారికి గైడెన్స్ ఇస్తూ ఉండండి.

సమయం కేటాయించండి

ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం అంటూ పేరెంట్స్ ఇద్దరూ వర్క్‌లో పడిపోతే పిల్లలులోన్లీ ఫీలవుతారు. వారితో కూడా టైమ్ స్పెండ్ చేయండి. మీరెంత ఎటెన్షన్ ఇస్తే వారంత రిలీఫ్‌గా ఫీలవుతారు. కాబట్టి వారితో క్వాలిటీ టైమ్‌ను స్పెండ్ చేయండి. వారితో కలిసి ఆటలు ఆడండి.

మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి

పిలల్లు మిమ్మల్ని గమనిస్తూ ఉంటారు. కాబట్టి వారి ముందు మీరెలా ప్రవర్తిస్తున్నారన్న విషయం వారి మనసులో ముద్ర వేసుకుంటుంది. కాబట్టి టెన్షన్‌కు గురైనా చెడు మాటలు వాడటం వంటివి చేయవద్దు. కోపం వస్తే చేతిలో ఉన్నవి విసిరేయడం వంటివి చేయవద్దు. మాట్లాడే ముందు ఆలోచించండి. మీ ప్రవర్తన వారికి పాఠం వంటిది. వారు అదే ఫాలో అయ్యే ప్రమాదం ఉంది. ఒత్తిడిని కంట్రోల్ చేసుకోవాలన్న ఆలోచన కలగదు వారికి. మీరు ప్రశాంతంగా ఉంటూ పిల్లల్ని ప్రశాంతంగా ఉంచేందుకు ప్రయత్నించండి. ఈ విధంగా మీ పిల్లల్లో మానసిక ఒత్తిడిని తగ్గించవచ్చు. పిల్లల్ని హ్యాపీగా ఉంచవచ్చు.

అమ్మను అర్థం చేసుకోండి

ఆనందంగా సాగుతున్న సంసారం.. ముత్యాల్లాంటి పిల్లలు... జీవితం సాఫీగా సాగిపోతుంది అనుకునేలోపే భార్యాభర్తల మధ్య గొడవలు. దానికి కారణం ఇతరులతో సంబంధాలు. భార్యను కాదని భర్త, భర్తను కాదని భార్య ఇతరులతో సంబంధాలు పెట్టుకుంటే దాంపత్య జీవితం పాడైపోతుంది. పచ్చని సంసారంలో చేతులారా చిచ్చుపెట్టుకున్నట్టే అవుతుంది. బయట పడనంత వరకు బాగానే ఉంటుంది. ఒక్కసారి తెలిసి అనుమానం మొదలైతే ఇక జీవితాంతం సమస్య వెంటాడుతూనే ఉంటుంది. చివరకు విడిపోవడానికి దారితీస్తుంది. ఏ పాపం తెలియని పసిపిల్లల జీవితం అన్యాయమై పోతుంది. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్‌లో...



లతకు 38 ఏండ్లు ఉంటాయి. ఓ ప్రైవేయి కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. 18 ఏండ్ల వయసులో ఆమెకు కిషోర్‌తో పెండ్లి జరిగింది. ఇప్పుడు వీరికి ఇద్దరు పిల్లలు. కిషోర్‌కు పెండ్లికి ముందు వేరే అమ్మాయితో సంబంధం వుండేది. ఆ విషయం తెలిసి తల్లిదండ్రులు అతనికి లతతో పెండ్లి చేశారు. వీళ్ళ పెండ్లి జరిగిన ఐదేండ్లకు కిషోర్ తల్లి చనిపోయింది. ఆమె ఉన్నన్ని రోజులు లతతో బాగానే ఉన్నాడు. తర్వాత మళ్ళీ తన పాత సంబంధాన్ని కొనసాగించాడు. ఈ విషయం లతకు తెలిసి ఇంట్లో పెద్దలకు చెప్పి పంచాయితీ పెట్టించింది. దాంతో అందరి ముందు కిషోర్ 'ఇకపై నేను ఎలాంటి తప్పు చేయను. లతతో మంచిగా ఉంటాను' అని మాట ఇచ్చాడు.

అప్పటి నుండి లతతో కిషోర్ కూడా అత్తగారింట్లోనే ఉండేవాడు. ఇద్దరూ ఉద్యోగం చేసేవారు. కానీ కొంత కాలానికి తాగడం మొదలుపెట్టాడు. బాగా తాగి వచ్చి లతను విపరీతంగా కొట్టేవాడు. 'వాళ్ళతో ఎందుకు మాట్లాడావు, వీళ్ళతో ఎందుకు మాట్లాడుతున్నావు' అంటూ ఆమెను అనుమానించేవాడు. పైగా భార్యకు ఎవరితోనే సంబంధం ఉందని ప్రచారం మొదలు పెట్టాడు. ఆ బాధ భరించలేక లత ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉండిపోయింది. దాంతో ఆదాయం తగ్గిపోయింది. కిషోర్‌కు వచ్చే జీతం ఇంటి ఖర్చులకే సరిపోయేవి కావు. మరి పిల్లల చదువులు ఎలా చదివిస్తారు. చివరకు ఫీజు కట్టలేక ఓ ఏడాది పిల్లలను ఇంట్లోనే ఉంచేశారు.

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక లత వాళ్ళ మామయ్యతో మాట్లాడి అత్తింటికి వెళ్ళిపోయింది. అక్కడికి వెళ్ళినప్పటి నుండి ఆమె సమస్యలు మరింత ఎక్కువయ్యాయి. అక్కడ ఆమె తరపున మాట్లాడేవారు ఎవరూ లేరు. కిషోర్ తాగొచ్చి విపరీతంగా కొట్టేవాడు. చివరకు మరదలితోనే సంబంధం పెట్టుకున్నాడు. అది భరించలేక లత కిషోర్‌ని వదిలేసి తిరిగి పుట్టింటికి వచ్చేసింది. దాంతో పిల్లలు తల్లిని తప్పు పడుతున్నారు. 'నువ్వెందుకు నాన్నను వదిలేసి వచ్చేశావు' అని అడిగే వారు. ఇప్పటికి లత కిషోర్‌ను వదిలేసి ఏడేండ్లు అవుతుంది. పిల్లలు అంటున్న మాటలు భరించలేక న్యాయం కోసం ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

తప్పు చేస్తుంది కిషోర్ అయితే పిల్లలతో తానెందుకు మాటలు పడాల్సి వస్తుందో ఆమెకు అర్థం కాలేదు. 'నాకు నా భర్త నుండి విడాకులు ఇప్పించండి. నాకు నాన్న లేడు. అమ్మ ఆరోగ్యం బాగోలేదు. అన్నయ్యలు వాళ్ళ జీవితాలు వాళ్ళు చూసుకుంటూ బిజీగా ఉన్నారు. ఇక నా గురించి ఆలోచించే వారు ఎవ్వరూ లేరు. మీరే నాకు ఎలాగైనా సాయం చేయండి' అంటూ వేడుకుంది.

మేము కిషోర్‌కి ఫోన్ చేసి పిలిపించాము. లత చెప్పిన విషయాల గురించి అతన్ని అడిగితే ముందు అతని తప్పులు అతను ఒప్పుకోలేదు. గట్టిగా మాట్లాడితే ఒప్పుకున్నాడు. అతనికి పెండ్లికి ముందే వేరే అమ్మాయితో సంబంధం ఉంది. పెండ్లి తర్వాత కూడా అతను చాలా మంది మహిళలతో సంబంధాలు పెట్టుకున్నాడని తెలిసింది. తాను చేస్తున్న తప్పు గురించి బయటకు తెలిస్తే అందరూ అతన్నే అంటారని లతకే వేరే వాళ్ళతో సంబంధం ఉన్నట్టు ప్రచారం చేశాడు. ఆమెంతట ఆమే ఇంట్లో నుండి వెళ్ళిపోయేలా చేశాడు. ప్రస్తుతం అతను తన మరదలినే పెండ్లి చేసుకున్నాడు. ఒక పాప కూడా ఉంది. ఆ పాపకు ఇప్పుడు 12 ఏండ్లు అని చెప్పాడు. అంటే లత వాళ్ళ ఇంట్లో ఉన్నప్పుడు మరదలికి పాప పుట్టింది.

ఈ విషయాలన్నీ విన్న తర్వాత 'నీ లాంటి వ్యక్తితో ఏ భార్య అయినా ఉండగలుగుతుందా? తన భర్త తనని మోసం చేస్తున్నాడని తెలిస్తే ఏ భార్యా భరించలేదు. నువ్వు ఆమెను పదే పదే మోసం చేస్తూనే ఉన్నావు. అయినా చాలా ఏండ్లు ఆమె నిన్ను భరించింది. చివరకు పిల్లల్ని తీసుకుని వెళ్ళి పోయింది. నువ్వేమో ఏ బాధ్యతలూ పట్టకుండా మళ్ళీ పెండ్లి చేసుకుని హాయిగా బతుకుతున్నావు. విడాకులు ఇవ్వకుండా పెండ్లి చేసుకుంటే నీపై కేసు అవుతుంది. ఇప్పుడు లత నీపై కేసు పెడితే ఏం చేస్తావు' అన్నాడు.

నేను చేసింది తప్పే మేడమ్. పిల్లల కోసం కొంత డబ్బు కూడా ఇస్తాను' అన్నాడు.

లతను పిలిపి మాట్లాడితే 'ఇలాంటి వాడితో నేను ఉండను మేడమ్. నేను విడాకులు తీసుకుంటాను. నా పిల్లలు నన్ను అర్థం చేసుకుంటే చాలు. అంతకు మించి నాకు ఏమీ వద్దు. అతను ఇచ్చే డబ్బు కూడా వద్దు' అంది.

దాంతో మేము లత పిల్లల్ని పిలిపించి 'మీ అమ్మ మీ కోసం చాలా కష్టపడుతుంది. మీ నాన్న మీ గురించి పట్టించుకోకుండా వేరే ఆమెను పెండ్లి చేసుకుని హాయిగా ఉంటున్నాడు. ఇన్నాళ్ళు అతను మిమ్మల్ని చూడటానికి కూడా రాలేదు. మీ అమ్మను మీరు అర్థం చేసుకోకపోతే ఇంకెవరు అర్థం చేసుకుంటారు. మీ కోసం మీ అమ్మ ఒంటరిగా జీవిస్తుంది. తన సంతోషాన్ని వదులుకొని మీ కోసమే బతుకుతుంది. కష్టపడి మిమ్మల్ని చదివిస్తుంది. అలాంటి అమ్మను మీరు ఎంతో ప్రేమగా, గౌరవంగా చూసుకోవాలి. అలా కాకుండా మీరు ఆమెను అనేక మాటలు అంటున్నారు. భర్త మంచిగా చూసుకుంటుంటే ఏ భార్య వదిలిపెట్టి రాదు. ఇప్పటికైనా మీ అమ్మ మీ కోసం చేస్తున్న త్యాగాన్ని అర్థం చేసుకోండి. ఆమెతో ప్రేమగా ఉండండి. మీరు ఇలాగే మాట్లాడితే ఆమె ఏమైపోతుందో ఎవరూ చెప్పలేరు. అప్పుడు మీరు దిక్కులేని వారు అవుతారు' అని చెప్పాము.

ఎంత చెప్పినా ఒక బాబు కిషోర్‌తో ఉండటానికి ఇష్టపడ్డారు. ఒక బాబు మాత్రం తల్లితోనే ఉంటానన్నాడు. దాంతో లతకు పెండ్లప్పుడు కట్నంగా ఇచ్చిన డబ్బుతో పాటు తనతో ఉంటున్న బాబు పేరుతో, ఆమె పేరుతో కలిపి వంద గజాల స్థలం రాయించాము.

ఒకరోజు లత ఫోన్ చేసి 'మీరు నాకు చాలా సాయం చేశారు. నా పిల్లల్లో మార్పు తెచ్చారు. మీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేను' అంటూ లత సంతోషంగా చెప్పింది.



మీ అమ్మను మీరు అర్థం చేసుకోకపోతే ఇంకెవరు అర్థం చేసుకుంటారు. మీ కోసం మీ అమ్మ ఒంటరిగా జీవిస్తుంది. తన సంతోషాన్ని వదులుకొని మీ కోసమే బతుకుతుంది. కష్టపడి మిమ్మల్ని చదివిస్తుంది. అలాంటి అమ్మను మీరు ఎంతో ప్రేమగా, గౌరవంగా చూసుకోవాలి. అలా కాకుండా మీరు ఆమెను అనేక మాటలు అంటున్నారు. భర్త మంచిగా చూసుకుంటుంటే ఏ భార్య వదిలిపెట్టి రాదు. ఇప్పటికైనా మీ అమ్మ మీ కోసం చేస్తున్న త్యాగాన్ని అర్థం చేసుకోండి. ఆమెతో ప్రేమగా ఉండండి.

- వై. వరలక్ష్మి, 9948794051

ఎంజీఎం, నీలోఫర్‌లో ముగ్గురికి కరోనా

- వారిలో 15 నెలల చిన్నారి..

నవతెలంగాణ-మెహిదీపట్నం/ మట్టెవాడ

హైదరాబాద్ నాంపల్లిలోని నీలోఫర్ ఒకరు, వరంగల్ ఎంజీఎంలో ఇద్దరికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణైంది. నీలోఫర్ ఆస్పత్రిలో 15 నెలల చిన్నారికి కరోనా ప్రబలింది. చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి వివరాలు వెల్లడించారు. నాంపల్లికి చెందిన ఓ బాబుకు దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్య ఉండటంతో 18వ తేదీన నీలోఫర్ ఆస్పత్రికి తీసుకొచ్చారని తెలిపారు. లక్షణాలను బట్టి డాక్టర్లు కరోనా పరీక్ష చేయించారన్నారు. అందులో గురువారం పాజిటీవ్‌గా రిపోర్టు వచ్చిందని తెలిపారు. చిన్నారికి ప్రస్తుతం ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. చిన్నారి తల్లిదండ్రులకు ఎలాంటి కోవిడ్ లక్షణాలూ లేవని చెప్పారు. ఆస్పత్రిలో కోవిడ్ కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇదిలా ఉండగా, వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ త్రివేణి నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో సమావేశం నిర్వహించి కోవిడ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చర్చించారు.

ఎంజీఎంలో 2 కరోనా పాజిటివ్ కేసులు

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఔట్ పేషెంట్లుగా వచ్చిన వారి నుంచి గురువారం రక్త నమూనాలు సేకరించి కాకతీయ మెడికల్ కళాశాలలోని వైరాలజీ విభాగానికి పంపించారు. శుక్రవారం ఫలితాలు వచ్చాయి. భూపాలపల్లి జిల్లాకు చెందిన యాదమ్మ, రాజేందర్‌కు పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు వైద్యులు తెలిపారు. యాదమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు ఎంజీఎం సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్ వెల్లడించారు. కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రేపు కలెక్టర్లతో సీఎం రేవంత్ భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం కీలక సమావేశం నిర్వహించనున్నారు. భూ రికార్డులతో ముడిపడిన సమస్యలు, కౌలు రైతుల గుర్తింపు, కొత్త రేషన్ కార్డుల జారీ, మహాలక్ష్మి తదితర పథకాల అమలు ఇతర అంశాలపై కలెక్టర్లతో సీఎం చర్చించే అవకాశముంది. కలెక్టర్లతో గురువారమే సీఎం సమీక్ష నిర్వహించాల్సి ఉన్నప్పటికీ శాసనసభ సమావేశాల కారణంగా వాయిదా పడింది. అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలపై తగిన సమాచారం సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కేంద్రాలు, పట్టణాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తున్నది. అందులో భాగంగా జిల్లా స్థాయిలో ప్రజావాణిని ఏయే వారాల్లో నిర్వహించాలనే దానిపై కలెక్టర్ల సదస్సులో నిర్ణయం తీసుకోనున్నారు. ముఖ్యంగా గృహలక్ష్మి పథకాన్ని వీలైనంత త్వరగా అమల్లోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ఇండ్ల స్థలాలు ఉండి ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ పేరుతో రూ.5 లక్షల ఆర్థిక సాయం చేసే కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభించాలని యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఇండ్ల స్థలాల గుర్తింపు, ఇండ్ల నిర్మాణానికి అవసరమైన నిధుల పంపిణీ కోసం మార్గదర్శకాల ఖరారుపై నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

27 నుంచి ఢిల్లీలో సీఎస్‌ల సమావేశం

- హాజరుకానున్న శాంతి కుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాని మోడీ అధ్యక్షతన ఢిల్లీలో ఈనెల 27 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల (సీఎస్‌లు) సమావేశం జరగనుంది. ఈ భేటీకి రాష్ట్రం నుంచి సీఎస్ శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు హాజరు కానున్నారు. గతంలో నిర్వహించిన 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' తరహాలో ఇప్పుడు 'ఈజ్ ఆఫ్ లైఫ్' అనే అంశం ప్రాతిపదికన ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిసింది. పర్యావరణం, పరిశ్రమలు, శాస్త్ర, సాంకేతిక రంగాలు, భూ తాపం, భూ సేకరణ, నదుల పరిరక్షణ తదితరాంశాలపై ఈ భేటీలో చర్చించనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈనెల 29 వరకూ ఈ సమావేశాలు కొనసాగనున్నాయి.

మహిళలపై 12శాతం పెరిగిన నేరాలు

(మొదటిపేజీ తరువాయి)

బయలుదేరాడని, మరో మార్గం నుంచి వెళ్లాలని చెప్పినా వినిపించుకోలేదని సీపీ తెలిపారు. అభిమానం ముసుగులో విధ్వంసానికి పాల్పడ్డారన్నారు. ప్రశాంత్ మూలంగానే సంఘటన జరగడంతో కేసు నమోదు చేశామని, సీసీ టీవీ పుటేజీలను పరిశీలించిన తర్వాత మరికొంత మందిని అరెస్టు చేస్తామని చెప్పారు.

నిమిషం ఆలస్యమైనా చర్యలు

నూతన సంవత్సర వేడుకలను రాత్రి ఒంటి గంటలోపు ఆపేయాలని హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పబ్బులు, బార్లలో డ్రగ్స్ ఉన్నాయని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇక ఎప్పటికీ వాటిని తెరవలేరని అన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిపోతే రూ.10 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

టాలెంట్ ఉన్నవారికే ప్రమోషన్లు

పోలీసులు పోస్టింగ్‌ల కోసం సిఫారసు లేఖలతో వస్తే చర్యలు తప్పవని, టాలెంట్ ఉన్నవారికే ప్రమోషన్లు ఇస్తామని సీపీ తెలిపారు. సిఫారసు లేఖలతో వచ్చేవారికి పోస్టింగ్‌లు ఉండవని స్పష్టం చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని తేల్చి చెప్పారు. లేఖలు పట్టుకుని వస్తే ఏసీఆర్‌లో పేర్లు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒక్కసారి పేరు నమోదు చేస్తే ప్రమోషన్లు రావని స్పష్టం చేశారు.

కేంద్రానికి అసాధారణ అధికారాలు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. అన్ని విషయాలు ప్రభుత్వం చేతిలో ఉంటాయి కాబట్టి ఏది ఒప్పో ఏది తప్పో అదే నిర్ణయిస్తుందని చెప్పారు. 'ప్రభుత్వంలోని పలు మంత్రిత్వ శాఖలు తప్పుడు సమాచారం ఇస్తుంటాయి. అయితే వాటిని ఎవరూ ఏమీ చేయరు. మనం అందించే సమాచారం సరైనదే అయినప్పటికీ మనల్ని లక్ష్యంగా చేసుకోవడం తేలిక' అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని, దాని విభాగాలను విమర్శిస్తూ కథనాలు ప్రచురించే పాత్రికేయులను వేధించడం, అరెస్ట్ చేయడం వంటి ఉదంతాలు ఇటీవల చోటుచేసుకుంటున్నాయి. అలాంటి ఘటనలు పాత్రికేయులను నిరుత్సాహపరుస్తాయి. వారిలో భయాన్ని రేకెత్తించి స్వీయ నియంత్రణకు అవకాశం కల్పిస్తాయి.

నిఘా పెరుగుతుంది

'టెలికం బిల్లు కారణంగా మీడియాపై ప్రభుత్వ నిఘా పెరుగుతుంది. అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతాయి. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోతాయి. సమాచారాన్ని ఎవరికీ అందుబాటులో లేకుండా దానిని కోడ్‌గా మార్చేయవచ్చు' అని న్యాయవాది అపర్ గుప్తా తెలిపారు. లోక్‌సభ నుండి 95 మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసిన తర్వాత ఈ బిల్లును ఆమోదించారు. ఇంటర్నెట్ సేవలను దీర్ఘకాలం నిలిపివేస్తే జమ్మూకాశ్మీర్, మణిపూర్ ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతారని గుప్తా చెప్పారు. బిల్లును రూపొందించే సమయంలో టెలికమ్యూనికేషన్ నిబంధనలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. 2022 సెప్టెంబరులో ప్రజా సంప్రదింపుల కోసం విడుదల చేసిన దానితో పోలిస్తే ప్రస్తుత బిల్లు ఘోరంగా ఉన్నదని, అప్పుడు ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను టెలికం శాఖ బహిర్గతం చేయలేదని తెలిపారు. 'ఒకరి నుండి మరొకరికి వచ్చిన సందేశాన్ని వాట్సప్ అప్లికేషన్ కోడ్ రూపంలో మార్చి దానిని అధికారులకు పంపాల్సి ఉంటుంది. ఒకరి సందేశాలు మరొకరు చదవడం సాధ్యం కాదని ప్రస్తుతం వాట్సప్ చెబుతోంది. సందేశాన్ని తాను కూడా చూడలేనని అంటోంది. మరి ఇప్పుడేమో సందేశాన్ని కోడ్‌గా రాసే బాధ్యతను వాట్సప్‌కి అప్పగిస్తే సమాచార గోప్యత హక్కుకు భంగం కలగదా?' అని ప్రశ్నించారు. మణిపూర్ హింసకు సంబంధించి సామాజిక మాధ్యమాలలో వచ్చే ఏ వార్తనైనా ఉద్రిక్తతకు కారణమవుతోందన్న సాకుతో నిరోధించే అధికారం కేంద్రానికి లభిస్తుందని న్యాయవాది బృందా భండారీ తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు అన్ని టెలికం సేవలను నిలిపివేసే అధికారం టెలికం బిల్లు ద్వారా ప్రభుత్వానికి లభిస్తుందని న్యాయవాది శ్రేయా సింఘాల్ చెప్పారు.

మత సామరస్యాన్ని కాపాడతాం

(మొదటిపేజీ తరువాయి)

సహాయం అందించడం మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హత కలిగిన వారికి అవకాశాలు కల్పించటమే ధ్యేయమని చెప్పారు. అందుకు ఉదాహరణగా ఏకే ఆంటోనీ, పెర్నాండెజ్‌లకు కాంగ్రెస్ ఎంతో ప్రోత్సాహాన్ని అందించిందని గుర్తు చేశారు. తెలంగాణలో ఏర్పడ్డ ఇందిరమ్మ రాజ్యంలో పేదల అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. సంక్షేమ పథకాలను ప్రతీ పేదకు చేరేలా చూస్తామని మాటిచ్చారు. మేం పాలకులం కాదు.. సేవకులమని చెప్పారు. ఏసు క్రీస్తు మాకు ఆదర్శమన్నారు. ఏ సమ్మస్య వచ్చినా మా దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను, సంస్థలను సీఎం అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ రవిగుప్త, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, అంజన్‌కుమార్ యాదవ్, సంపత్‌కుమార్, క్రైస్తవ మతపెద్దలు, ఫాస్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

వాహనదారులకు శుభవార్త..

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

రాష్ట్రంలో వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తనందించింది. ఏడాది కాలంలో వాహనదారులకు విధించిన చలాన్లపై భారీ మొత్తంలో రాయితీలను ప్రకటించింది. బస్సులు, తోపుడు బండ్లపై ఉన్న చలాన్లపై 90శాతం రాయితీని, ద్విచక్ర వాహనదారులకు 80శాతం రాయితీని ఇస్తున్నట్టు తెలిపింది. అలాగే ఆటోలు, కార్లపై 60శాతం రాయితీని, లారీలు తదితర భారీ వాహనాలపై 50శాతం రాయితీని ప్రకటించింది. ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది జనవరి 10వ తేదీ వరకు రాయితీతో కూడిన చలాన్లను చెల్లించవచ్చని తెలిపింది. ఈ రాయితీలను ఆన్‌లైన్ ద్వారా చెల్లించుకోవచ్చునని వివరించింది. 2022లో ఇచ్చిన రాయితీల కారణంగా రూ.300 కోట్ల మేరకు ప్రభుత్వ ఖజానా నిండింది. గత నెలాఖరుకు చలానాల సంఖ్య రెండు కోట్లకు చేరుకుందని అంచనా. తాజా రాయితీ ప్రకటనతో దాదాపు 50శాతం ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

సింగరేణిని కాపాడింది...కేసీఆరే

- 20 వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించిన ఘనత ఆయనదే
- ఆత్మసాక్షిగా ఓట్లేసి టీబీజీకేఎస్‌ను గెలిపించండి :ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సింగరేణిని కాపాడింది మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆరేనని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆ సంస్థలో 20 వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించిన ఘనత ఆయనదేనని ఆమె తెలిపారు. కేసీఆర్ హయాంలో సంస్థ కోసం, కార్మికుల సంక్షేమం కోసం చేసిన పనులను చూసి కార్మికులు ఆత్మసాక్షిగా ఆలోచించి ఓటేసి టీబీజీకేఎస్ సంఘాన్ని గెలిపించాలని ఆమె ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అది కార్మికుల హక్కులను సాధించిందని పునరుద్ఘాటించారు. కార్మికుల గొంతుక అయిన ఆ సంఘం గుర్తు ' బాణం ' ఓట్లేసీ భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. డిపెండెంట్ ఉద్యోగం వద్దనుకుంటే ఆ కుటుంబానికి రూ.25 లక్షలు చెల్లించాలన్న ఉదారమైన నిర్ణయాన్ని కేసీఆర్ గతంలో తీసుకున్నారని ప్రస్తావించారు. కోల్ ఇండియా సంస్థలో సైతం లేని విధంగా కారుణ్య నియామకాల ద్వారా సింగరేణిలో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని స్పష్టం చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణి సంస్థ నికర లాభాల్లో కార్మికులకు భారీ మొత్తంలో వాటాలను పంచారని గుర్తు చేశారు. టీబీజీకేఎస్ ను గెలిపించుకుంటేనే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు.

విజృంభిస్తున్న కరోనా...

(మొదటిపేజీ తరువాయి)

సంగతి తెలిసిందే. కేరళ, మహారాష్ట్రల్లోనూ రద్దీ ప్రాంతాల్లో మాస్కును వినియోగించాల్సిందిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయి. జెఎన్.1 అనేది "పిరోలా" వేరియంట్ బీఏ 2.86 వర్గానికి చెందినదని, ఇది ఓమిక్రాన్ సబ్‌వేరియంట్ అని ఐఎంఎ కొవిడ్ టాస్క్ ఫోర్స్ డాక్టర్ రాజీవ్ జయదేవన్ పేర్కొన్నారు. జెఎన్.1 వద్ధులకు, దీర్ఘకాలిక వ్యాధులు కలిగి ఉన్నవారికి సమస్యాత్మకంగా ఉంటుందని అన్నారు.

గణతంత్ర వేడుకలు


ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు



న్యూఢిల్లీ : వచ్చే ఏడాది నిర్వహించే గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ హాజరుకానున్నారు. ప్రధాని కార్యాలయం ఆయనకు ఆహ్వానం పంపినట్టు కేంద్ర అధికారిక వర్గాలు శుక్రవారం తెలిపాయి. ఇరుదేశాల మధ్య అభివృద్ధి చెందిన సాన్నిహిత్యం, విశ్వాసానికి నిదర్శనంగా ఈ ఆహ్వానం నిలుస్తుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది జులైలో పారిస్‌లో జరిగిన ఫ్రాన్స్ జాతీయ దినోత్సవ బాస్టిల్ డే పరేడ్‌లో ప్రధాని మోడీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఢిల్లీ వేదికగా నిర్వహించిన జీ-20 సదస్సులో మాక్రాన్ పాల్గొన్నారు. గతేడాది గణతంత్ర వేడుకలకు ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్‌సిసి ముఖ్య అతిథిగా హాజరైన సంగతి తెలిసిందే. ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ముఖ్య అతిథిగా రావడం ఇది ఆరవసారి. మాక్రాన్‌కు ముందు ఆ దేశ మాజీ అధ్యక్షుడు జాక్వెస్ చిరాక్ వరుసగా 1976, 1988లో గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 1980, 2008 మరియు 2016 సంవత్సరాల్లో వరుసగా మాజీ అధ్యక్షులు గిస్కార్డ్ డి ఎస్టేయింగ్, నికోలస్ సర్కోజీ మరియు ఫ్రాంకోయిస్ హోలండ్‌లు పాల్గొన్నారు.

ఓటాన్ అకౌంట్ ఫిబ్రవరిలోనే..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో వచ్చే ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకనుగుణంగా ప్రాథమిక కసరత్తులు ప్రారంభమైనట్టు తెలిసింది. వాస్తవానికి రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రతీయేటా మార్చిలో ప్రవేశపెట్టటం ఆనవాయితీ. అయితే వచ్చే సంవత్సరం ఏప్రిల్, మేలో పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. ఆ క్రమంలో మార్చి నుంచే ఎలక్షన్ల సందడి మొదలు కానుంది. అభ్యర్థుల ఎంపిక, ప్రచారం, జాతీయ నాయకుల బహిరంగ సభలు తదితరాలు నిర్వహించాల్సి ఉంటుంది. అందువల్ల అధికార పార్టీకి సమయం సరిపోయినంత ఉండదు. ఈ కారణం రీత్యా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రక్రియను ఫిబ్రవరిలోనే ముగించి, ఆ తర్వాత ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టకపోతే మార్చితో ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం (శాసనసభ అనుమతి ఉండదు కాబట్టి) జీత భత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితి తలెత్తుతుంది. అందువల్ల మధ్యే మార్గంగా ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. పార్లమెంటు ఎన్నికల తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెడుతుందని ఆయా వర్గాలు వివరించాయి. ఫిబ్రవరి మొదటి వారంలో కేంద్ర బడ్జెట్ ఉంటుంది కాబట్టి... ఆ పద్దులో రాష్ట్రానికి వచ్చే రాబడులు, గ్రాంట్లు, ఇతర ఆర్థిక సాయాల ఆధారంగా లెక్కలేసుకుని, ఇక్కడ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను రూపొందిస్తామని ఓ సీనియర్ అధికారి తెలిపారు.

పట్టు బిగిస్తున్న భారత్

• స్మృతి, రీచా, రోడ్రిగ్స్, దీప్తి అర్ధసెంచరీలు • ఆస్ట్రేలియాతో ఏకైక టెస్ట్‌లో 157పరుగుల ఆధిక్యత



ముంబయి: ఆస్ట్రేలియా మహిళలతో జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో భారత మహిళలజట్టు పట్టు బిగిస్తోంది. రెండోరోజైన శుక్రవారం ఆట నిలిచే సమయానికి భారతజట్టు ఏడు వికెట్ల నష్టానికి 376పరుగులు చేసింది. దీంతో ఆసీస్‌పై ఇప్పటికే 157పరుగుల ఆధిక్యత లభించింది. క్రీజ్‌లో దీప్తి శర్మ(70), పూజా వస్త్రాకర్(33) ఉన్నారు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు ఇప్పటికే 102 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆసీస్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే.



ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 98పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ స్నేహ్ రాణా(9) రూపంలో రెండో వికెట్‌ను కోల్పోయింది. స్మృతి మంధాన(74), స్నేహ్ రాణా కలిసి రెండో వికెట్‌కు 50 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ ఔటయ్యారు. అనవసర పరుగుకు మంధాన ప్రయత్నించి రనౌటైంది. ఆ తర్వాత రిచా ఘోష్(52), జెమీమా రోడ్రిగ్స్(73) అర్ధసెంచరీలతో రాణించి 4వ వికెట్‌కు 113పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో వీరిద్దరూ అర్ధ సెంచరీలను పూర్తి చేసుకున్నారు. మరోసారి ఆసీస్ బౌలర్లు చెలరేగి వారిద్దరితోపాటు యాస్తికా భాటియా(1)తోపాటు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(0)ను ఔట్ చేశారు. దీంతో ఆసీస్ పట్టు బిగించేలా కనిపించింది. ఈ క్రమంలో దీప్తి శర్మ-పూజా వస్త్రాకర్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడి భారత్‌కు భారీ ఆధిక్యతను సంపాదించిపెట్టారు. ఇంగ్లండ్‌పై ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన దీప్తి శర్మ అర్ధసెంచరీకి తోడు, పూజ వస్త్రాకర్ క్రీజ్‌లో ఉన్నారు. ఆసీస్ బౌలర్లు గార్డినర్‌కు నాలుగు, కిమ్ గ్రాత్, జొనాసెన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా మహిళల తొలి ఇన్నింగ్స్: 219ఆలౌట్

భారత మహిళల తొలి ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (ఎల్‌బి)జొన్నాసెన్ 40, స్మృతి మంధాన (రనౌట్) గ్రాత్/గార్డినర్ 74, స్నేహ్ రాణా (బి)గార్డినర్ 9, రీచా ఘోష్ (సి)గార్డినర్ (బి)కిమ్ గ్రాత్ 52, జెమిమా రోడ్రిగ్స్ (సి)సదర్లాండ్ (బి)గార్డినర్ 73, హర్మన్‌ప్రీత్ కౌర్ (ఎల్‌బి)గార్డినర్ 0, యాస్టికా భాటియా (ఎల్‌బి)గార్డినర్ 1, దీప్తి శర్మ (బ్యాటింగ్) 70, పూజ వస్త్రాకర్ (బ్యాటింగ్) 33, అదనం 24. (119ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 375పరుగులు.

వికెట్ల పతనం: 1/90, 2/140, 3/147, 4/260, 5/261, 6/265, 7/274

బౌలింగ్: లారెన్ ఛట్లీ 9-3-23-0, కిమ్ గ్రాత్ 10-1-49-1, ఎలీసా పెర్రీ 4-0-31-0, ఎలీసా గార్డినర్ 41-7-100-4, జొన్నాసెన్ 18-4-42-1, సథర్లాండ్ 8-2-20-0, ఎలేనా కింగ్ 19-1-69-0, తహిలా మెక్‌గ్రాత్ 10-2-22-0

పద్మశ్రీ అవార్డును ప్రధానికి ఇచ్చేస్తా

రెజ్లర్ బజరంగ్ పునియా



ముంబయి: పద్మశ్రీ అవార్డును వెనక్కి ఇచ్చేస్తున్నట్టు స్టార్ రెజ్లర్ బజరంగ్ పునియా ప్రకటించాడు. తాను గతంలో రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్న ఈ అవార్డును ప్రధాని నరేంద్ర మోడీకి ఇచ్చేస్తున్నట్టు ట్విటర్‌లో వెల్లడించాడు. తన అవార్డును ప్రధానికి అందజేసేందుకు ప్రధాని నివాసం వద్దకు వెళ్లగా పోలీసులు అడ్డుకోవడంతో ఢిల్లీలోని కర్తవ్య మార్గ్‌లో ఫుట్‌పాత్‌పై ఉంచాడు. 'పద్మశ్రీ అవార్డును ప్రధానమంత్రికి తిరిగి ఇచ్చేస్తున్నాను. ఇది నా లేఖ మాత్రమే. దేశంలో రెజ్లర్ల పరిస్థితిని మీ దృష్టికి తీసుకొచ్చేందుకు ఈ లేఖ రాస్తున్నా. డబ్ల్యూఎఫ్‌ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ ఈ ఏడాది జనవరిలో మహిళా రెజ్లర్లు ఆందోళన చేసిన విషయం మీకు తెలిసే ఉంటుంది. వారికి మద్దతుగా నేను కూడా ఆ నిరసనలో పాల్గొన్నా. ఆ ఆరోపణలపై చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో మేం ఆందోళనను విరమించాం. కానీ, నెలలు గడిచినా బ్రిజ్‌భూషణ్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకపోవడంతో మేం మళ్లీ రోడెక్కాల్సి వచ్చింది. న్యాయం కోసం మా పతకాలను గంగా నదిలో కలిపేద్దామనుకున్నాం. అప్పుడు కూడా అతడిపై చర్యలు తీసుకుంటామని కేంద్రం హామీ ఇచ్చింది' అని బజ్‌రంగ్ తన లేఖలో పేర్కొన్నాడు. రెజ్లింగ్ ఫెడరేషన్‌కు జరిగిన ఎన్నికల్లో బ్రిజ్ భూషణ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ ఎన్నిక కావడంతో మనస్తాపానికి గురైన బజరంగ్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. డబ్ల్యూఎఫ్‌ఐ నూతన అధ్యక్షునిగా సంజయ్ సింగ్ ఎన్నికైన కొద్ది సెకన్లకే మీడియా సమావేశంలో మహిళా రెజ్లర్ సాక్షి మాలిక్ తన బూట్లను టేబుల్‌పై పెట్టి రెజ్లింగ్‌కు గుడ్‌బై చెబుతున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఇలాగైతే ఆడపిల్లల్ని ఆటలకు పంపిస్తారా?

రెజ్లర్లకు బాక్సర్ విజేందర్ మద్దతు



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) కొత్త అధ్యక్షుడిగా సంజయ్ సింగ్ ఎన్నిక కావడంపై దేశ రెజ్లింగ్‌లో మరోసారి వివాదం మొదలైంది. ఆయన ఎన్నికను నిరసిస్తూ దిగ్గజ రెజ్లర్, ఒలింపిక్స్ కాంస్య విజేత సాక్షి మలిక్ ఆటకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దిగ్గజ బాక్సర్ విజేందర్ సింగ్ ఆమెకు మద్దతుగా నిలిచాడు. దీనిపై రాష్ట్రపతి, ప్రధాని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాడు.

"ఒక క్రీడాకారిణిగా ఆమె (సాక్షి మలిక్) బాధను నేను అర్థం చేసుకోగలను. రెజ్లింగ్‌లో ఒలింపిక్ పతకం సాధించిన ఏకైక క్రీడాకారిణి.. నేడు న్యాయం కోసం పోరాటం చేసింది. కానీ, ఆమెకు న్యాయం జరగలేదు. దీంతో ఆవేదనకు గురైన ఆమె ఆటకు వీడ్కోలు పలికింది. తాజా పరిణామాలతో క్రీడారంగం మొత్తం అసంతృప్తికి గురైంది.

కోహ్లి తిరుగు పయనం..

టెస్ట్ సిరీస్‌కు దూరం



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌కు ముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణా రీత్యా భారత్‌కు తిరుగు పయనమైనట్లు బిసిసిఐ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. కోహ్లి తిరుగు ప్రయాణానికి గల కారణాలను ఆ ప్రకటనలో వెల్లడించలేదు. దక్షిణాఫ్రికా పర్యనటకు బిసిసిఐ మూడు ఫార్మాట్‌లకు మూడు వేర్వేరు జట్లను ప్రకటించగా.. కోహ్లికి టెస్టుల్లో మాత్రమే ఆడేందుకు చోటు దక్కింది.

మంగళవారం నుంచి తొలిటెస్ట్ ప్రారంభం కానునండగా.. ఇటీవల దక్షిణాఫ్రికాకు పయనమై వెళ్లాడు. అలాగే రుతురాజ్ గైక్వాడ్ వేలికి గాయం కావడంతో అతడూ టెస్ట్ సిరీస్‌కు దూరమయ్యాడు. ఈ టెస్ట్ సిరీస్‌లో నెగ్గితే భారత్‌కు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి)కు పాయింట్లు జమ కానున్నాయి.

దీంతో భారత్‌కు ఈ సిరీస్ గెలుపు తప్పనిసరి. దక్షిణాఫ్రికాతో రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ డిసెంబర్ 26న సూపర్‌స్పోర్ట్ పార్క్ వేదికగా ప్రారంభం కానుంది.

అంతర్జాతీయ క్రికెట్‌కు ఎల్గర్ గుడ్‌బై

భారత్‌తో టెస్టు సిరీస్ చివరిదంటూ ప్రకటన



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. భారత్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్ అనంతరం క్రికెట్‌నుంచి పూర్తిగా వైదులుగుతున్నట్లు తెలిపాడు. 'ఈ గేమ్ నుంచి రిటైర్ అవుదామనుకుని నిర్ణయించుకున్నా. భారత్‌తో కేప్‌టౌన్‌లో జరుగబోయే రెండో టెస్టే నాకు ఆఖరిది. ఈ గేమ్ నాకు చాలా ఇచ్చింది. నేను ఇక్కడే(కేప్‌టౌన్‌లో) నా తొలి టెస్టు సెంచరీ చేశాను. ప్రపంచంలో ఇది నా ఫేవరేట్ స్టేడియం ఇదే. ఇక్కడే నా కెరీర్‌లో ఆఖరి టెస్టు ఇక్కడే ఆడబోతున్నాను' అని తెలిపాడు. 2012లో పెర్త్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో అరంగేట్రం చేశాడు. 2017 నుంచి 2023 వరకూ 17టెస్టులలో దక్షిణాఫ్రికా జట్టుకు సారథిగా వ్యవహరించాడు. 2021లో భారత్ పర్యటనకు వెళ్లగా విశాఖ టెస్ట్‌లో అశ్విన్, రవీంద్ర జడేజా వంటి అగ్రశ్రేణి స్పిన్నర్లను ఎదుర్కొని 160 పరుగులు చేశాడు. అదే అతడి కెరీర్‌లోనే ది బెస్ట్‌గా నిలిచింది. 84టెస్టులు, 8 వన్డేలు ఆడిన ఎల్గర్.. టెస్టుల్లో 149 ఇన్నింగ్స్‌లలో 5,146 పరుగులు చేశాడు.

ఇందులో 13 సెంచరీలు, 23 అర్థ సెంచరీలూ ఉన్నాయి. టెస్టులలో అతడి సగటు 37.02గా ఉంది. వన్డే ఫార్మాట్‌లో 8మ్యాచ్‌లు ఆడి ఏడు ఇన్నింగ్స్‌లలో 104 పరుగులు మాత్రమే చేశాడు. 2018 తర్వాత వన్డేల్లో చోటు దక్కలేదు. ఈ ఏడాది ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లలో టెస్టు సిరీస్‌లు కోల్పోయింది. దీంతో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు టెంబు బవుమా సారథ్య బాధ్యతలు అప్పగించింది.



వరుణ్ తేజ్

దేశాన్ని కదిలించిన సంఘటనతో మట్కా

వరుణ్ తేజ్, కరుణ కుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'మట్కా'.వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, మోహన్ చెరుకూరి (సివిఎం) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శరవేగంగా జరుగుతున్న ఈ షెడ్యూల్ చిత్రీకరణ కోసం ఓ భారీ సెట్‌ను నిర్మించారు. ఈ కథ 1958, 1982 మధ్య సాగేది కావడంతో చిత్ర బృందం 50, 80ల నాటి పరిసరాలను అద్భుతంగా రిక్రియేట్ చేశారు. యావత్ దేశాన్ని కదిలించిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ కథను తయారు చేశారు. కథాపరంగా 24 ఏళ్ల స్పాన్ కలిగిన కథలో వరుణ్ తేజ్ నాలుగు విభిన్నమైన గెటప్‌లలో కనిపించనున్నారు. దీని కోసం ఆయన పూర్తిగా మేక్‌ఓవర్ అవుతున్నారు వరుణ్ తేజ్ సరసన నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నవీన్ చంద్ర, కన్నడ కిషోర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈచిత్రానికి అత్యుత్తమ సాంకేతిక నిపుణుల పని చేస్తున్నారు. సౌత్‌లో అత్యంత బిజీగా ఉన్న కంపోజర్‌లలో ఒకరైన జివి ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తుండగా, తంగలన్ ఫేమ్ ఏ కిషోర్ కుమార్ డీవోపీగా పని చేస్తున్నారు. కార్తీక శ్రీనివాస్ ఆర్ (పుష్ప ఫేమ్) ఎడిటర్. ఆశిష్ తేజ పులాల ప్రొడక్షన్ డిజైనర్, సురేష్ ఆర్ట్ డైరెక్టర్. మల్టిపుల్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్న ఈ చిత్రానికి నలుగురు ఫైట్ మాస్టర్‌లు యాక్షన్‌ను పర్యవేక్షిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. రవీంద్ర విజయ్, సత్యం రాజేష్, రవిశంకర్, అజయ్ ఘోష్, రూప లక్ష్మి, అవినాష్ కనపర్తి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్.

నవచిత్రం

సంక్రాంతి బరిలో సైంధవ్



శ్రద్ధా శ్రీనాథ్, వెంకటేష్, సారా

వెంకటేష్ నటిస్తున్న తన 75వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు.

సంక్రాంతి కానుకగా ఈ సినిమా జనవరి 13న అన్ని దక్షిణ భారతీయ భాషలతోపాటు హిందీలోనూ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే టీజర్‌తోపాటు తొలిపాటను విడుదల చేసిన మేకర్స్ లేటెస్ట్‌గా 'సరదా సరదాగా..' అంటూ సాగే రెండవ పాటను రిలీజ్ చేశారు. సంతోష్ నారాయణన్ ఈ పాటని మనసుని హత్తుకునే మెలోడీగా స్వరపరిచారు. వెంకటేష్, శ్రద్ధా శ్రీనాథ్ మధ్య సాగే సంభాషణతో పాట ప్రారంభమై, వారి ఇద్దరి చూడచక్కని ప్రయాణాన్ని ఈ పాట చూపించింది. అలాగే సారా పోషించిన వెంకీ కుమార్తె పాత్ర సైతం అందర్నీ అలరిస్తోంది.

రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యం వారి మధ్య బంధాన్ని మరింత అందంగా చూపించింది. అనురాగ్ కులకర్ణి వాయిస్ ఆ పాటకు ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చింది.



భగీరథ, ఆకృతి సుధాకర్, అనురాధా దేవి, ప్రసన్న కుమార్

24న వైభవంగా కృష్ణవేణి శత వసంత మహోత్సవం

కృష్ణవేణి.. నటిగా, గాయనిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా పలు బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహించి నాటి తరానికే కాదు రాబోయే తరాలకూ స్ఫూర్తిగా నిలిచిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు గర్వించే అలనాటి మేటి నటి అని నిర్మాత, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి టి.ప్రసన్నకుమార్ అన్నారు.

'కృష్ణవేణి శత వసంత మహోత్సవం' వేడుకను ఆకృతి ఆధ్వర్యంలో, సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సౌజన్యంతో ఈనెల 24న ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఫిల్మ్ నగర్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో ఈ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ప్రసన్నకుమార్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మన దేశం' సినిమాతో మహానటుడు ఎన్టీఆర్‌కి తొలి వేషం ఇచ్చిన ఘనత కృష్ణవేణిగారిది. ఎన్టీఆర్, ఏయన్నార్‌తో 'పల్లెటూరి పిల్ల' చిత్రాన్ని నిర్మించారు. ఎస్వీరంగారావు, సూర్యకాంతం, అంజలీదేవితో పాటు సంగీత దర్శకుడుగా ఘంటసాలను పరిచయం చేశారు' అని తెలిపారు.

'తొలితరం కథానాయిక కృష్ణ వేణి వంద సంవత్సరాల పండగను ముందుగా తలపెట్టిన ఘనత ఆకృతికి దక్కుతుంది' అని సీనియర్ పాత్రికేయుడు భగీరథ అన్నారు. కృష్ణ వేణి తనయ నిర్మాత ఎన్ ఆర్ అనూరాధ దేవి మాట్లాడుతూ,'అమ్మ క్రమశిక్షణే ఆమెను ఉన్నత స్థానంలో నిలబెట్టింది' అని చెప్పారు. 'ఈనెల 24న ప్రసాద్ లాబ్స్ నిర్వహించే ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, టూరిజం, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు తోపాటు పలువురు సినీ ప్రముఖులు కూడా పాల్గొంటారు' అని ఆకృతి సుధాకర్ అన్నారు.


ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో 2018కి దక్కని చోటు



దేశ వ్యాప్తంగా పలు భాషల్లో విడుదలై సంచలన విజయం సాధించిన **'2018'** చిత్రం ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డుల షార్ట్ లిస్ట్‌లో స్థానం పొందలేకపోయింది. 2024 సంవత్సరానికి సంబంధించి ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డుల షార్ట్ లిస్ట్‌ను జ్యూరీ శుక్రవారం విడుదల చేసింది. ఉత్తమ విదేశీ చిత్రాలతో పాటు ఒరిజినల్ సాంగ్, ఒరిజినల్ స్కోర్, డాక్యుమెంటరీస్, షార్ట్ ఫిల్మ్ వంటి దాదాపు 10 విభాగాల్లో పోటీ పడుతున్న చిత్రాల వివరాలను అధికారికంగా ప్రకటించారు. వీటిల్లో గ్రేటా గార్వీ **'బార్బీ'**, క్రిస్టోఫర్ నోలన్ **'ఓపెన్‌హైమర్'** చిత్రాలు ఎక్కువ విభాగాల్లో పోటీలో ఉండటం విశేషం. అలాగే యూకేకి చెందిన **'ది జోన్ ఆఫ్ ఇంట్రస్ట్'**, డెన్మార్క్‌కు చెందిన **'ది ప్రామిస్డ్ ల్యాండ్'**, **'పర్‌ఫెక్ట్ డేస్'** (జపాన్) చిత్రాలు సైతం పలు విభాగాల్లో గట్టి పోటీ ఇవ్వడం మరో విశేషం. **'ది టేస్ట్ ఆఫ్ థింగ్స్'** (ఫ్రాన్స్), **'టోటెమ్'** (మెక్సికో), **'ఫాలెన్ లీవ్స్'** (ఫిన్‌లాండ్) వంటి తదితర చిత్రాలు జ్యూరీని మెప్పించి ఆస్కార్ రేసులో బలమైన పోటీ ఇస్తున్నాయి.

ప్చ్.. అంచనాలు తారుమారు

ఎన్నో అంచనాలతో ఆస్కార్ బరిలోకి దిగిన '2018' చిత్రం షార్ట్ లిస్ట్‌లో స్థానం సొంతం చేసుకోలేకపోవడం బాధాకరం. ప్రతి ఏడాది మాదిరిగానే 2024 ఆస్కార్ అవార్డులకి సంబంధించి మన దేశం తరపున ఉత్తమ విదేశీ చిత్ర విభాగం నుంచి '2018' మలయాళ చిత్రం ఎంపికైంది. 2018లో కేరళలో సంభవించిన వరదల ఆధారంగా టోవినో థామస్ ప్రధాన పాత్రలో జూడ్ ఆంథోని జోసెఫ్ తెరకెక్కించారు. పలు భారతీయ భాషల్లో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల విశేష ఆదరణతో అఖండ విజయం సాధించింది. భారతీయ బాక్సాఫీస్ వద్ద రికార్డ్ స్థాయిలో వసూళ్ళని సైతం రాబట్టింది. దీంతో ఈ సినిమా కచ్చితంగా ఆస్కార్‌ని తీసుకొస్తుందనే ఆశతో ఉన్నారు. అయితే ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో ఈ సినిమాకి చోటు లభించకపోవడంతో అంచనాలు తారుమారై అందరికీ తీవ్ర నిరాశని మిగిల్చింది. 96వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 10న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో అత్యంత వైభవంగా జరుగనుంది.



భిన్న కథతో ప్రేమకు జై..

ఈశ్వర పరమేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అనసూర్య నిర్మించిన చిత్రం 'ప్రేమకు జై'. గ్రామీణ నేపథ్యంలో జరిగిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా నూతన నటీనటులతో శ్రీనివాస్ మల్లం దర్శకత్వం వహించిన చిత్రమిది. అనిల్ బురగాని, ఆర్.జ్వలిత హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రతినాయకునిగా దుబ్బాక భాస్కర్ కనిపించనున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నూతన సంవత్సరంలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా లిరిక్ రైటర్ శివశక్తి దత్త ఈ చిత్ర పోస్టర్, టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'యంగ్ టాలెంట్ బాగా చేశారు. నూతన నటీనటులు చాలా అద్భుతంగా నటించారు. డైరెక్షన్‌తోపాటు టీజర్ చాలా బాగుంది' అని తెలిపారు.

'వాస్తవ సంఘటనతో రూపొందుతున్న ఈచిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది. కొత్త సంవత్సరం కానుకగా మా చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాత అనసూర్య అన్నారు.



'మంచి కంటెంట్ ఉన్న కథతో మా నిర్మాత అనసూర్య ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు' అని దర్శకుడు శ్రీనివాస్ మల్లం చెప్పారు.

ఈ చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్: మైలారం రాజు, డిఓపి: ఉరుకుందా రెడ్డి, మ్యూజిక్ : చైతు, ఎడిటర్: సామ్రాట్ జి, ఫైట్స్: రాబిన్ సుబ్బు, డైనమిక్ మధు, కొరియోగ్రాఫర్ : బాలు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886